

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 292

శుక్రవారం 12-1-2018



గ్రీన్‌కార్డు కోటా పెంపు..
1.75 లక్షలకు పెంచాలని సభలో బిల్లు.
భారత ఐటీ నిపుణులకే ప్రయోజనం-13లో



నింగిలోకి వందో శాటిలైట్
నేడు పీఎస్‌ఎల్వీ సీ-40 ద్వారా
ప్రయోగించనున్న ఇస్రో - 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఉమ్మడి హైకోర్టు సీజేగా జస్టిస్ రాధాకృష్ణన్

'సుప్రీం' కొలీజియం సిఫార్సు

- కేబినెట్ ఆమోదించగానే రాష్ట్రపతి ఉత్తర్వులు
- ఇక్కడే కొనసాగనున్న ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్
- ఏపీకి హైకోర్టు ఏర్పాటయ్యాక సీజేగా వెళ్లే అవకాశం
- సుప్రీం న్యాయమూర్తులుగా జస్టిస్ జోసెఫ్, ఇందు మల్హోత్రా?

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ తొట్టతిల్ బి.నాయర్ రాధాకృష్ణన్ నియమితులు కానున్నారు. ఆయన నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదముద్ర వేసింది. ఆయన ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మిగతా 2వ పేజీలో ▶

విహంగ.. విహారం...

నగర శివారు ప్రాంతాల్లో విదేశీ పక్షుల కోలాహలం

- వేలాది కిలోమీటర్ల దూరం నుంచి వలసలు
- జలాశయాలు, చెరువుల్లో 200 విదేశీ జాతుల పక్షుల సందడి
- సైబీరియా కొంగలు, ఆఫ్రికా డేగల రాక.. మరో నెలపాటు ఇక్కడే
- సమశీతోష్ణస్థితి, ఆహార లభ్యతే వలసలకు కారణం
- గతేడాదితో పోలిస్తే పక్షుల సంఖ్యలో 30-40 శాతం తగ్గుదల
- కాలుష్యం, మానవ కార్యకలాపాలే కారణమంటున్న జంతు ప్రేమికులు

- వివరాలు 6లో



మియాపూర్ సమీపంలోని అమీన్‌పూర్ చెరువు వద్ద విదేశీ పక్షుల విహారం

పట్నంలో పంటచేలు

- నగరంలో 4 వేల మందికి పైగా మోడ్రన్ రైతులు
- సరికొత్త సేద్యం.. అర్బన్ కల్టివేషన్
- ఇంటి ఆవరణలు, రూఫ్ గార్డెన్సే వ్యవసాయ క్షేత్రాలు
- స్వచ్ఛ కూరగాయలు, పూల దిగుబడి

- టాబ్లాయిడ్ సెంటర్‌స్ప్రెడ్‌లో





కుత్బుల్లాపూర్‌లోని ఓ ఏటీఎం వద్ద 'నో క్యాష్' బోర్డు

మళ్లీ నో క్యాష్!

పండుగపూట ఏటీఎంలలో పైసల్లేవ్

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా 'నో క్యాష్' బోర్డులే

ఒకటీ అరా ఏటీఎంలలో డబ్బులు.. వాటి ముందే జనం బారులు

నగదు నింపిన గంటల్లోనే ఖాళీ.. బ్యాంకుల్లోనూ భారీగా క్యూలు

అయినా ఇస్తున్నది అరకొరే.. బ్యాంకుల తీరుపై ప్రజల మండిపాటు

'నోట్ల' కష్టాలు మళ్లీ మొదలయ్యాయి.. పండుగ పూట పైసల కష్టం వచ్చింది.. వారం రోజులుగా ఏటీఎంలు మూగనోము పట్టాయి.. ఎక్కడ చూసినా 'నో క్యాష్' బోర్డులు వెక్కిరిస్తున్నాయి.. 'ఔట్ ఆఫ్ సర్వీస్' అంటూ ఆగం చేస్తున్నాయి.. పది పదిహేను ఏటీఎంల చుట్టూ తిరగకతప్పడం లేదు. డబ్బులు దొరికినా అన్నీ రెండు వేల నోట్లే. పోనీ బ్యాంకులకు వెళితే నగదు దొరుకుతుందా అంటే అక్కడా చాంతాడంత క్యూలే. గంటలు గంటలు నిలబడితే ఎంతో కొంత చేతిలో పెడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి. - వివరాలు 6లో

కొత్త సచివాలయానికి మరో మెలిక

బైసన్ పోలోపై కేంద్రం విముఖత!



- మైదానం ఇవ్వొద్దంటూ పీఎంవోకు ఫిర్యాదులు
- దాంతో రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరిన వైనం
- ప్రత్యామ్నాయంగా 543 ఎకరాలివ్వాలని షరతు
- రూ. 1,100 కోట్లు, ఏటా నిర్వహణ చార్జీలూ చెల్లించాలని కొర్రీ

సాక్షి, హైదరాబాద్

కొత్త సచివాలయ నిర్మాణానికి మరో మెలిక పడింది. సికింద్రాబాద్‌లోని బైసన్ పోలో గ్రౌండ్‌ను అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం విముఖత వ్యక్తం చేస్తోంది. మైదానం ఇవ్వొద్దంటూ ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం గ్రీవెన్స్ సెల్‌కు కొంతకాలంగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వాటిలో 13 ఫిర్యాదులకు వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిగతా 2వ పేజీలో ▶

మండలానికో జూనియర్ కాలేజీ



- అన్ని కాలేజీలకు భవనాలు, మౌలిక సదుపాయాలు
- 2024 డాక్యుమెంట్ రూపొందించిన ఇంటర్ విద్యాశాఖ

- వివరాలు 6లో



ఓసీలకు 25% రిజర్వేషన్లు ఇవ్వొచ్చు

- వారికి 'కోటా' కల్పిస్తే నష్టం లేదు: కేంద్ర మంత్రి అథవాలే
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 'బ్యాక్‌లాగ్'ల భర్తీకి ఆదేశం

- వివరాలు 2లో

ఐటీ కాంగ్రెస్‌కు మోదీ, సోఫియా!

- ఫిబ్రవరి 19-21 తేదీల్లో డబ్ల్యూఐటీసీ
- ఇదే వేదికగా నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరం కూడా..
- 30 దేశాల నుంచి 2,500 మంది ప్రతినిధులు

- వివరాలు 16లో

సంగీతకు ఊరట

- భర్త ఇంట్లో ఉండేందుకు మియాపూర్ ఫ్యామిలీ కోర్టు అనుమతి
- ఆమె ఖర్చుల కోసం నెలనెలా రూ. 20 వేలు ఇవ్వాలని భర్తకు ఆదేశం
- కోర్టు ఆదేశాలతో తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లిన సంగీత

- వివరాలు 14లో

hmda Growing Global

ప్లాట్ల వేలానికి వేళాయె!

- సంక్రాంతి తర్వాత హెచ్ఎండీఏ నోటిఫికేషన్
- ప్లాట్ల అమ్మకాలు ఈ-వేలంలోనే - 18లో

శ్రీవారి ఆలయంలో ఇస్రో శాస్త్రవేత్తల పూజలు


శ్రీవారి దర్శనం తర్వాత ఆలయం వద్ద ఇస్రో ప్రతినిధులు

సాక్షి, తిరుమల: పీఎస్ఎల్‌వీ సీ–40 ప్రయోగం శుక్రవారం నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం ఇస్రో శాస్త్రవేత్తలు తిరుమల శ్రీవారి ఆలయంలో పూజలు చేశారు. ఇస్రో సైంటిఫిక్ సెక్రటరీ డాక్టర్ పీజీ దివాకర్, సెక్రటరీ ఆర్‌వై యశోద, డైరెక్టర్లు అమిత్ కుమార్ పాత్రా, అరుణన్ సుబ్బయ్య, మిషన్ ఆఫీసర్ ఎంఎస్ గుప్తా నమూనా రాకెట్‌ను శ్రీవారి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. పీఎస్ఎల్‌వీ సీ–40 రాకెట్ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం 9.29 గంటలకు ఈ ప్రయోగం చేపట్టనున్నారు. దీని ద్వారా 3 స్వదేశీ, 28 విదేశీ ఉపగ్రహాలను రోదసిలోకి పంపనున్నారు.

14 నుంచి టీ-శాట్ చానళ్లలో 'ఇంగ్లిష్ ఫర్ ఆల్'

- టీ–శాట్ సీఈఓ శైలేశ్‌రెడ్డి
- 12 నుంచి ఐదు రోజులపాటు అదనపు టీఆర్టీ క్లాసులు

సాక్షి, హైదరాబాద్: వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం టీ–శాట్ చానళ్లలో ప్రత్యేకంగా ఆంగ్లబోధన పాఠ్యాంశాలను ప్రసారం చేయనున్నట్లు టీ–శాట్ సీఈఓ ఆర్.శైలేశ్‌రెడ్డి వెల్లడించారు. రామకృష్ణ మఠం సౌజన్యంతో 'ఇంగ్లిష్ ఫర్ ఆల్'కార్యక్రమాన్ని ఈ నెల 14 నుంచి ప్రతి ఆదివారం నిపుణ, విద్య చానళ్లలో ప్రసారం చేయనున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిపుణ చానల్‌లో, సాయంత్రం 4గంటలకు విద్య చానల్‌లో 45 నిమిషాల పాటు కార్యక్రమాలను ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీఆర్టీ ప్రసారాలు మరో 3 గంటలు..

టీ–శాట్ నెట్‌వర్క్ చానళ్లలో ప్రసారం చేస్తున్న టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) అవగాహన ప్రసారాలను ఈ నెల 12 నుంచి మరో 3 గంటలు అదనంగా ప్రసారం చేయనున్నట్లు శైలేశ్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు సెలవులున్న నేపథ్యంలో 5 రోజుల పాటు ప్రసారాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. నిపుణ చానల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4గంటల వరకు, విద్య చానల్‌లో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ఈ అదనపు ప్రసారాలుంటాయని పేర్కొన్నారు.

ట్రావెల్స్ దోపిడీని అడ్డుకోండి: శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి పండుగను ఆసరాగా చేసుకొని అధిక టికెట్ ధరలతో ప్రైవేటు ట్రావెల్స్ సాగించే దోపిడీని అడ్డుకోవాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం సచివాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కంటే ఎక్కువగా ధరలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై ఆర్టీసీ ఎండీ రమణారావు, ట్రాన్స్‌పోర్ట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మకు ఫిర్యాదు చేశామన్నారు.

'బడ్జెట్‌లో బీసీలకు నిధులు పెంచాలి'

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీలకు నిధుల పరిమితిని పెంచాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. జనాభా ప్రాతిపదికన నిధులు ఇవ్వాలని కోరింది. సంఘ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు గురువారం కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలేను కలసి వినతిపత్రం అందించారు. నిధుల పరిమితిని పెంచుతామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు ఓ ప్రకటనలో తెలిపారు.

అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లండి: బీసీ సంఘం

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. గురువారం అసెంబ్లీలో బీసీ లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ గంగాధర్ గౌడ్, సభ్యులు ఆర్.కృష్ణయ్య, విఠల్ రెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, ఫరూఖ్ తదితరులతో కూడిన కమిటీతో సంఘం నేతలు భేటీ అయ్యారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, కళామండలి అధ్యక్షుడు యస్.రామలింగం, కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుడు తోడున్నాడన్న ధైర్యం కలిగించాలి

59వ రోజు
11-01-2018, గురువారం,
బీరమాకుల గండ్రిక,
చిత్తూరు జిల్లా.



ఈరోజు ఉదయం వెదురుకుప్పంలో శారదమ్మ అనే అక్క.. తన కుమారుడి ఫొటో చేతిలో పట్టుకుని, కళ్ల నిండా నీళ్లు పెట్టుకుని 'అన్నా.. నేను అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నాను. ఏడు నెలల కిందట నా కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అంతకు సంవత్సరం మునుపే నా కుమారుడి పేరును చంద్రన్న బీమా పథకంలో నమోదు చేయించాను. అయినా నాకు ఇంతవరకూ పరిహారం అందలేదు' అంటూ కన్నీటిపర్యంతమైంది. చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు మరణించి పుట్టెడు శోకంలో ఉన్న ఆ తల్లికి ప్రభుత్వ సాయం అందకపోవడం చాలా బాధనిపించింది.

మధ్యాహ్నం భోజన విరామం తర్వాత యాత్ర చంద్రగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పార్టీ పతాకాల తోరణాల పందిళ్ల కింద.. వేలాది మంది వెంటరాగా కోలాహలంగా సాగింది. నెమలిగుంటపల్లె జరిగిన రైతన్నల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నాను. అక్కడ మునుస్వామి అనే రైతు 'అన్నా.. నాకు పొలం ఉంది. నీళ్లూ ఉన్నాయి. అయినా బీడుపెట్టుకున్నాను' అన్నాడు. ఆశ్చర్యంతో 'ఎందుకన్నా?..' అని అడిగాను. 'ఈ ప్రభుత్వం మీద నమ్మకం లేదు. కష్టపడి పంట వేసినా.. గిట్టుబాటు ధరలేక పెట్టుబడులు కూడా వస్తాయో లేదోనన్న భయంతో సాగుచేసుకోలేదు' అన్నాడు. మాట్లాడిన మిగతా రైతులు కూడా తమ ఆవేదనను, అభద్రతాభావాన్ని వ్యక్తపరిచారు. రోజురోజుకూ దిగజారుతున్న రైతన్నల పరిస్థితి ఆందోళన కలిగించింది.

సంక్రాంతి పండగ దగ్గరపడుతోంది. కానీ రైతన్నలలో ఆ కళ ఏమాత్రం కనిపించడంలేదు. సంక్రాంతి అంటేనే భోగభాగ్యాలతో, సిరిసంపదలతో, సుఖసంతోషాలతో చేసుకునే పర్వదినం. తొలి పంట ఇంటికి వచ్చి ఆనందంగా జరుపుకొనే రైతుల పండగ. జనావళికి అన్నం పెట్టే అన్నదాత ఆనందానికి మించిన పండగ ఇంకేముంటుంది? అందుకే శ్రమకు, సంపదకు గొప్ప స్థానం ఇచ్చే ఈ సంక్రాంతి పండగను సంక్రాంతి లక్ష్మి అని కూడా పిలుచుకుంటాం. కానీ ఇప్పుడు ఆ 'ఊరంతా సంక్రాంతి.. జగమంతా క్రాంతి' ఏమైపోతోంది? ప్రస్తుత ప్రభుత్వ వైఖరితో.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ క్రమక్రమంగా దెబ్బతింటున్న నేపథ్యంలో 'అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి' చందంగా పరిస్థితులు నెలకొన్నాయి. ఆరుగాలం కష్టపడి రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. మార్కెట్లో మాత్రం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మన రాష్ట్రంలో దాదాపు 65 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా మన రాష్ట్రం ప్రసిద్ధి. పాలకుల దృక్పథం, వైఖరి రైతన్నల నుదిటి రాతను మార్చగలవు. వ్యవసాయాన్ని ప్రజల జీవన విధానంగా గుర్తించి ప్రోత్సహిస్తే వ్యవసాయం నిజంగా పండగే. రైతన్నలందరూ పదే పదే నాన్నగారి హయాంను స్మరించుకోవడానికి కారణం అదే. ఏం జరిగినా పాలకుడు తోడున్నాడనే ధైర్యం, వ్యవసాయం లాభసాటి వ్యాపకమన్న నమ్మకం కలిగించగలగాలి. రైతులు బాగుండాలని బలంగా కోరుకోవాలి. అంతేగానీ.. కేవలం తన స్వార్థం కోసం కొద్దిమంది తన అనుయాయుల, బినామీల బాగోగుల కోసం ఆలోచించి రైతులను బలిపీఠం ఎక్కిస్తే.. వ్యవసాయం దండగ కాక మరేమవుతుంది?

ఒక్కసారి చంద్రబాబు గారు ఆత్మావలోకనం చేసుకోవాలి. మీ హయాంలోనే సాగు విస్తీర్ణం దారుణంగా ఎందుకు తగ్గిపోతోంది? మీరు అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే సహకార కర్మాగారాలు ఎందుకు మూతపడుతున్నాయి? మీ పాలనలోనే బ్యాంకులు నిర్దేశిత లక్ష్యాలకన్నా తక్కువ రుణాలను ఎందుకు మంజూరు చేస్తున్నాయి? మీ ప్రభుత్వంలోనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు లక్షల సంఖ్యలో ఎందుకు పెండింగ్‌లో ఉంటాయి? మీ ఏలుబడిలోనే రైతుల ఆత్మహత్యలు ఎందుకు పెరిగిపోతుంటాయి?


కాపు మొండివెంగనపల్లెలో వృద్ధురాలిని పలకరిస్తున్న వైఎస్ జగన్

వై.యస్. జగన్.

ఉమ్మడి హైకోర్టు సీజేగా జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్‌లతో కూడిన కొలీజియం బుధవారం సమావేశమై పలు నియామకాలకు ఆమోద ముద్ర వేసింది. సుప్రీంకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులతో పాటు పలు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకాలను ఆమోదిస్తూ కేంద్రానికి సిఫార్సులు చేసింది. వీటిలో భాగంగా ఉమ్మడి హైకోర్టుకు పూర్తి స్థాయి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాధాకృష్ణన్‌ను నియమించాలని కొలీజియం నిర్ణయించింది. కేంద్రం ఆమోదముద్ర అనంతరం కొలీజియం సిఫార్సులు రాష్ట్రపతికి చేరతాయి. అనంతరం రాష్ట్రపతి నియామకపు ఉత్తర్వులు జారీ చేస్తారు. ప్రస్తుతం ఉమ్మడి హైకోర్టుకు జస్టిస్ రమేశ్ రంగనాథన్ దాదాపు ఏడాదిన్నరగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. జస్టిస్ రాధాకృష్ణన్ సీజేగా రానున్న నేపథ్యంలో జస్టిస్ రమేశ్ రంగనాథన్ ఉమ్మడి హైకోర్టులోనే న్యాయమూర్తిగా కొనసాగుతారని తెలిసింది. హైకోర్టు విభజన పూర్తయ్యాక ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యే అవకాశముంది. అప్పటిదాకా ఉమ్మడి హైకోర్టులోనే న్యాయమూర్తిగా కొనసాగుతారు. జస్టిస్ జోసెఫ్‌ను ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ 2016లోనే సుప్రీం కొలీజియం సిఫార్సు చేసినా పలు రాజకీయ కారణాలతో అది కార్యరూపం దాల్చలేదు.

మరోవైపు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాల్సిందిగా కొలీజియం సిఫార్సు చేసింది. ఇందు పేరుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే మహిళా న్యాయవాదుల కోటా నుంచి నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టిస్తారు. వీరితో పాటు కలకత్తా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి భట్టాచార్యను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి అభిలాష కుమారిని మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కొలీజియం సిఫారసు చేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆంటోనీ డామినిక్‌ను అదే హైకోర్టు సీజేగా సిఫార్సు చేసింది.



జస్టిస్ రాధాకృష్ణన్ నేపథ్యం ఇదీ..

జస్టిస్ తొట్టతిల్ బి.నాయర్ రాధాకృష్ణన్ 1959 ఏప్రిల్ 29న కేరళలో జన్మించారు. తండ్రి ఎన్.భాస్కరన్ నాయర్, తల్లి కె.పారుకుట్టి ఇద్దరూ న్యాయవాదులే. రాధాకృష్ణన్ కొల్లంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. కేరళ వర్సిటీ నుంచి బీఎస్సీ, బెంగళూరు వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ చేశారు. 1983లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. తిరువనంతపురంలో పి.రామకృష్ణ పిళ్లై వద్ద జూనియర్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. 1988లో ప్రాక్టీస్‌ను హైకోర్టుకు మార్చారు. సివిల్, రాజ్యాంగపరమైన కేసుల్లో దిట్టగా పేరు సంపాదించారు. పలు ప్రభుత్వ రంగ సంస్థలకు, బ్యాంకులకు న్యాయవాదిగా వ్యవహరించారు. 2004 అక్టోబర్‌లో కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016 మే 13న కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. రెండుసార్లు ఆ బాధ్యతలు నిర్వర్తించారు. 2017 నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు.

ఓసీలకు 25% రిజర్వేషన్లు ఇవ్వొచ్చు

- కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే
- వారికి 'కోటా' కల్పిస్తే నష్టం లేదని వ్యాఖ్య
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందిస్తున్న రిజర్వేషన్లలో ఎలాంటి మార్పులు చేయకుండా ఓసీలకు కూడా రిజర్వేషన్లు ఇవ్వొచ్చని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారతశాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే అభిప్రాయపడ్డారు. మొత్తంగా వారికి 25 శాతం రిజర్వేషన్లను కల్పించడం వల్ల ఎవరికీ నష్టం ఉండదన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే క్రీమీలేయర్ పద్ధతిని వర్తింపజేయవచ్చన్నారు. ప్రస్తుతం ప్రజల సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని, అయితే ప్రజల ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా వివిధ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రస్తుత చట్టాల్లో మార్పులను పరిశీలించొచ్చన్నారు. రిజర్వేషన్ల కోసం గుజరాత్‌లో పాటిదార్లు, ఉత్తరాది రాష్ట్రాల్లో జాట్లు చేస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ వివిధ రాష్ట్రాల్లో ఇలాంటి డిమాండ్లు వస్తున్నాయన్నారు. మరాఠాలకు రిజర్వేషన్లను తాను సమర్థించినట్లు అథవాలే ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీల కులాంతర వివాహాలకు ప్రభుత్వం రూ.50వేల ఆర్థిక సాయం అందిస్తోందని, ఈ మొత్తాన్ని రూ. లక్షకు పెంచాలనే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయన్నారు. గోరక్ష పేరిట దాడులు జరగడం అమానుషమని, గోవులకు రక్షణ ఇవ్వడం మంచిదేనని, కానీ దాని పేరిట మనుషులకు రక్షణ ప్రశ్నార్థకం కారాదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నిరోధక చట్టం కింద ఏటా 42 వేల కేసులు నమోదవుతున్నాయని మంత్రి అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగినప్పుడు రాజకీయ పార్టీలు అప్పటికప్పుడు స్పందించడం తప్ప దాడులు జరగకుండా నిరోధించేందుకు కృషి చేయాలని సూచించారు. హెచ్‌సీయూలో రోహిత్‌వేముల లాంటి ప్రతిభావంతుడు ఆత్మహత్య చేసుకోవడం బాధకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్‌ల భర్తీపై చర్చించేందుకు సంబంధిత అధికారులతో ఆయన అంతకుముందు సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో 'అంబేడ్కర్–రాజ్యాంగవాదం'అనే అంశంపై జరిగిన సదస్సులో కూడా అథవాలే పాల్గొన్నారు.

ఇండియానే మొదటి ప్రాధామ్యం: మాల్దీవులు

న్యూఢిల్లీ: 'ఇండియా ఫస్ట్ పాలసీ'ని కొనసాగిస్తామని మాల్దీవులు స్పష్టం చేసింది. ఇటీవల ఆ దేశం చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవటంతో భారత్, మాల్దీవుల సంబంధాలు దెబ్బతిన్నాయి. మాల్దీవుల విదేశాంగమంత్రి, ఆ దేశాధ్యక్షుడి ప్రత్యేక దూత మహ్మద్ అసీం గురువారం ప్రధాని మోదీతో పాటు విదేశాంగ శాఖమంత్రి సుష్మాస్వరాజ్‌తో సమావేశమయ్యారు. భారత్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తామని తెలిపారు.

ఇదండీ సంగతి


మా దగ్గరంతా చిల్లరే.. మమ్మల్నొదిలేయండని పారిపోతున్నార్సార్!

త్యాగఫలితమే చైర్మన్ పదవి: ఎర్రోళ్ల

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు చేసిన త్యాగాల ఫలితంగానే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా తనకు పదవి దక్కిందని ఇటీవల చైర్మన్‌గా నియమితులైన ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఉస్మానియా వర్సిటీ పూర్వ విద్యార్థి అయిన ఎర్రోళ్లను ఓయూలో పలు విద్యార్థి సంఘాలు గురువారం సన్మానించాయి. ఈ సందర్భంగా ఎర్రోళ్ల మాట్లాడుతూ..ఎస్సీ,ఎస్టీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తానన్నారు. నిబద్ధత గలవారికే అవకాశాలు అని, తనకు దక్కిన పదవి విద్యార్థులకు దక్కిన గౌరవమని చెప్పారు.

ఏపీ మంత్రి దేవినేని నుంచి ప్రాణహాని

విజయవాడ సీపీ నుంచీ ముప్పు • హైదరాబాద్ మహిళ ఆరోపణ

హైదరాబాద్: ఏపీ నీటిపారుదల మంత్రి దేవినేని ఉమతో పాటు ఆయన అనుచరులు, విజయవాడ సీపీ గౌతమ్ సవాంగ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన అట్లూరి ప్రవిజ ఆరోపించారు. తనను కిడ్నాప్ చేసేందుకు లేదా హత్య చేసేందుకు ప్రయత్నాలు జరగొచ్చని గురువారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై న్యాయ నిపుణుల సలహా మేరకు చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు. అమరావతి దగ్గర్లోని కంచికచర్ల మండలం చౌటుకల్లు గ్రామంలో తనకు రెండెకరాల స్థలం ఉందని, ఈ భూమి పంపకాల విషయంలో మంత్రి దేవినేని తమ్ముడు దేవినేని చంద్రశేఖర్, చవలం శ్రీనివాసరావు, మన్నె నాయుడు, మంత్రి పీఏ చౌదరి, మరో పీఏ శివరావు, గన్‌మన్ ప్రసాద్, ఆయన క్లాస్‌మేట్ ఎనిగళ్ల రాజేంద్రప్రసాద్, సొసైటీ ప్రెసిడెంట్ కోగంటి విష్ణువర్ధన్‌రావు వేధిస్తున్నారని బాధితురాలు వాపోయారు. 'వీరిపై గతేడాది జూన్ 21న విజయవాడ సీపీ సవాంగ్‌కు ఫిర్యాదు చేశాను. మంత్రి దేవినేనితో పాటు ఆయన సోదరుడిపై విజయవాడ సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుందని, కేసును వెనక్కి తీసుకోవాలంటూ నాపై మంత్రి కార్యాలయంతో పాటు పోలీసులు ఒత్తిడి చేస్తున్నారు. పోలీసుల వ్యవహార శైలిపై గతేడాది సెప్టెంబర్ 19న మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ)లో ఫిర్యాదు చేశాను. ఏపీ డీజీపీకి హెచ్ఆర్సీ నోటీసులు కూడా జారీ చేసింది. గత గురువారం కొందరు పోలీసులు విజయవాడలోని మా ఇంటికెళ్లి నా కదలికలపై ఆరా తీశారు. 2015 నవంబర్‌లో అప్పటి పట మట సీఐ దామోదర్ నన్ను కిడ్నాప్ చేసి గొల్లపూడిలోని మంత్రి ఇంటికి తీసుకెళ్లారు'అని ఫిర్యాదులో పేర్కొన్నారు.


బైసన్ పోలోపై కేంద్రం విముఖత!

▶ మొదటి పేజీ తరువాయి

పీఎంవో తాజాగా లేఖ రాసింది. దీంతో కేంద్రానికి వివరణ ఇచ్చేందుకు రహదారులు, భవనాల శాఖ మల్లగుల్లాలు పడుతోంది. మరోవైపు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలూ రక్షణ శాఖ భూములివ్వాలని ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో తెలంగాణకు భూమిలిస్తే.. మిగిలిన రెండు రాష్ట్రాలకూ ఇవ్వాల్సి ఉంటుందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుకే ఈ వ్యవహారాన్ని ఉద్దేశపూర్వకంగానే కేంద్రం పెండింగ్‌లో పెడుతోందని ప్రభుత్వ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్త షరతులు, రకరకాల కొర్రీలు తెరపైకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

భూములిచ్చేందుకు గతేడాది ఓకే

బైసన్ పోలోతో పాటు జింఖానా గ్రౌండ్‌కు చెందిన 60.87 ఎకరాలు.. జాతీయ, రాష్ట్ర రహదారుల విస్తరణ, గఫ్ రోడ్డుకు ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి 200.58 ఎకరాల భూమి అప్పగించాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరుతోంది. ప్రత్యామ్నాయంగా జవహర్‌నగర్‌లో 500 ఎకరాల భూమి కేటాయించడంతోపాటు మౌలిక సౌకర్యాలు కల్పించే ప్రతిపాదనలు పంపింది. ఆ ప్రతిపాదనలపై రక్షణ శాఖ ఇప్పటికే రాష్ట్ర అధికారులతో ఢిల్లీలో ఓసారి సమావేశమైంది. హైదరాబాద్‌కు వచ్చి భూములను సైతం పరిశీలించింది. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు భూములు అప్పగించేందుకు గతేడాది నవంబర్‌లోనే సంసిద్ధత వ్యక్తం చేసింది.



వెనక్కి తగ్గిన రాష్ట్ర ప్రభుత్వం

3 నెలలుగా నాన్చివేత ధోరణి అనుసరించిన రక్షణ శాఖ.. ఇటీవలే కొన్ని షరతులు విధించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. 500 ఎకరాలు సరిపోదని, 543 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ భూములు కేటాయించాలని, దాదాపు రూ. 1,100 కోట్లు చెల్లించాలని షరతు విధించినట్లు తెలిసింది. వీటితో పాటు నిర్వహణ పేరుతో ఏటా చార్జీలు చెల్లించాలని మరో మెలిక పెట్టినట్లు సమాచారం. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అంత మొత్తం చెల్లించి భూములు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అంచనాలు వేసుకుంటోంది. నిధులు చెల్లించేందుకు సిద్ధపడినా ఏటా నిర్వహణ చార్జీలు చెల్లించాలంటూ రక్షణ శాఖ పెట్టిన షరతులు అనుచితంగా ఉన్నాయని వెనుకడుగేసింది. అందుకే కొత్త సచివాలయం నిర్మాణాన్ని కొంతకాలం వాయిదా వేయాలని సూచనప్రాయంగా నిర్ణయించింది. కేంద్రం నుంచి సానుకూలత వచ్చే వరకు తొందరేమీలేదని ఈ విషయాన్ని అధికారులు తేలిగ్గా తోసిపుచ్చుతున్నారు.



భార్యను చంపిన భర్తకు యావజ్జీవం

శిక్షను ఖరారు చేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: భార్యను రోకలి బండతో కొట్టి చంపిన భర్తకు ఉమ్మడి హైకోర్టు యావజ్జీవ కారాగార శిక్షను ఖరారు చేసింది. కరీంనగర్ జిల్లా కోర్టు విధించిన యావజ్జీవ శిక్షను సమర్థిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావులతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు చెప్పింది. 11 ఏళ్ల క్రితం హుజూరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ సరిత ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత అదనపు కట్నం కోసం వేధించడమే కాకుండా అనుమానించడం మొదలుపెట్టాడు. 2010 అక్టోబర్ 13న తాగి వచ్చి రోకలితో సరిత తలపై బాది హత్య చేశాడు. ఆమె సోదరుని ఫిర్యాదుతో శ్రీనివాస్‌పై కేసు నమోదైంది. నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ కరీంనగర్ జిల్లా కోర్టు 2012 మేలో తీర్పు చెప్పింది. తన తొమ్మిదేళ్ల కుమార్తె సాక్ష్యం చెల్లదని, శిక్ష రద్దు చేయాలని శ్రీనివాస్ దాఖలు చేసిన అప్పీల్‌ను హైకోర్టు కొట్టేసింది. పిల్లల సాక్ష్యాల్ని యథాతథంగా తీసుకోవచ్చని, కింది కోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదని ధర్మాసనం తాజాగా స్పష్టం చేసింది.


సాక్షి
శుక్రవారం, జనవరి, 12

చిల్లర వర్తకానికి చిల్లు

మరికొన్ని రోజుల్లో దావోస్‌లో జరగబోయే ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) సమావేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కాబోతున్న తరుణంలో దానికి ముందస్తు చర్యగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆర్థిక రంగంలో మరిన్ని సంస్కరణలకు ద్వారాలు తెరిచింది. యూపీఏ హయాంలో ప్రతిపక్షంలో ఉండి తానే గట్టిగా ప్రతిఘటించిన అనేక నిర్ణయాలు ఇందులో ఉన్నాయి. సింగిల్ బ్రాండ్ చిల్లర వ్యాపారం, నిర్మాణ రంగం, విద్యుత్ ఎక్స్ఛేంజీల్లో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు(ఎఫ్‌డీఐ) వీలు కల్పించడంతోపాటు ప్రభుత్వ రంగ విమానయాన దిగ్గజం ఎయిరిండియాలో 49 శాతం వరకూ విదేశీ పెట్టుబడులు ఆస్కారమిస్తూ కేంద్ర మంత్రివర్గం బుధవారం నిర్ణయించింది. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం సింగిల్ బ్రాండ్ చిల్లర వర్తకంలో 49 శాతం వరకూ నేరుగా ఎఫ్‌డీఐలకు వీలుంది. అంతకు మించితే కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరయ్యేది. అలాగే ప్రైవేటు విమానయాన రంగంలో మాత్రమే ఇప్పటివరకూ 49 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి ఉండేది. దాన్ని ఇకపై ఎయిరిండియాకు కూడా వర్తింపజేస్తారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు లాంటి కీలక నిర్ణయాల వల్లనైతేనేమి... మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నుల వల్లనైతేనేమి మన ఆర్థిక రంగం మందకొడిగానే ఉంది. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) నాలుగేళ్ల కనిష్ట స్థాయికి పడిపోవచ్చునని, 2017–18లో అది 6.5 శాతం మాత్రమే ఉండొచ్చునని ఈ మధ్యే కేంద్ర గణాంకాల కార్యాలయం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం జీడీపీ 7.1 శాతం, అంతకుముందు ఏడాది అది 8 శాతంగా ఉన్నదని గుర్తుంచుకుంటే వర్తమాన స్థితి ఎలా ఉన్నదో అర్థమవుతుంది. ఇది తాత్కాలిక ధోరణి మాత్రమేనని, వచ్చే ఏడాదికి ఇది 7 శాతానికి చేరువవుతుందని హెచ్‌ఎస్‌బీసీ నివేదిక అంటోంది. పెట్టుబడుల సంగతికొస్తే 2011–12 జీడీపీలో అది 34.3 శాతంగా ఉంటే 2016–17లో 27 శాతం. ముందస్తు అంచనాల ప్రకారం 2017–18లో అది 26.4 శాతానికి పరిమితం కావొచ్చు. ముఖ్యంగా నిర్మాణ రంగం గత రెండేళ్లుగా నిరాశాజనకంగా ఉంది. 2016–17లో మన దేశానికి 6,000 కోట్ల డాలర్లకు మించి ఎఫ్‌డీఐలు వచ్చినా అవి ప్రధానంగా స్టాక్‌ల కొనుగోలు, ఆర్థికంగా దెబ్బతిన్న సంస్థల కొనుగోలుకు మాత్రమే పరిమితమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మరింత ఊతం ఇచ్చే నిర్ణయాలు తీసుకుంటే ఆర్థిక రంగానికి చురుకుదనం వస్తుందన్న భావన ప్రభుత్వానికి ఉన్నట్టుంది.

అయితే ఏదైనా అంశంపై నిర్దిష్టంగా, నికరంగా మాట్లాడటం...అలా మాట్లాడినదానికి కట్టుబడి ఉండటం ఏ రాజకీయ పక్షానికైనా ప్రాణప్రదమైన విషయం. అలాగైతేనే ఆ పార్టీలకు ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుంది. దురదృష్టవశాత్తూ మన దేశంలో చాలా పార్టీలు ఆ విశ్వసనీయత ఎంతో ముఖ్యమైనదని గుర్తించడం లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిన అంశాలను అధికారంలో కొచ్చాక తామే మరింత ఉత్సాహంతో అమలు చేస్తున్నాయి. ఇచ్చిన వాగ్దానాలను గాలికొదులుతున్నాయి. ముందస్తు అనుమతుల ప్రమేయం లేకుండా సింగిల్ బ్రాండ్ చిల్లర వర్తకం, టెలికాం, చమురు రంగాల్లో పెట్టుబడులకు అవకాశమీయాలని యూపీఏ హయాంలో అరవింద్ మాయారామ్ కమిటీ సిఫార్సు చేసినప్పుడు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ సింగిల్ బ్రాండ్ చిల్లర వర్తక రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను గట్టిగా వ్యతిరేకించింది. వ్యవసాయ రంగం తర్వాత దేశంలో అత్యధికులకు ఉపాధి కల్పిస్తున్న ఆ రంగం జోలికొస్తే ఊరుకోబోమని చెప్పింది. ఆ సిఫార్సుల అమలు ప్రారంభించినప్పుడు పార్లమెంటులో ప్రతిఘటించింది. చిల్లర వర్తక రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 కోట్లమంది ఆధారపడ్డారని గుర్తుచేసింది. బహుళ బ్రాండ్‌ల రిటైల్ వ్యాపారంలో సైతం 51 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించడాన్ని తిరగదోడతామని చెప్పింది. దాని మాట అటుంచి సింగిల్ బ్రాండ్ చిల్లర వర్తకంలో నేరుగా వందశాతం ఎఫ్‌డీఐలకు అనుమతించాలని నిర్ణయించడమే కాదు... విదేశీ రిటైల్ సంస్థలు స్థానికంగా 30 శాతం వరకూ తప్పనిసరిగా కొనుగోళ్లు చేయాలన్న నిబంధనను సైతం అయిదేళ్లపాటు సడలించడం ఆశ్చర్యకరం. గత మూడున్నరేళ్లుగా 'మేకిన్ ఇండియా' నినాదంతో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్న ప్రభుత్వం నుంచి ఈ తరహా నిర్ణయాలను ఎవరూ ఊహించరు. సంఘ్ పరివార్ సంస్థల్లో ఒకటైన స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) కేంద్రం తాజా నిర్ణయాలను గట్టిగా వ్యతిరేకించడమేకాక, వాటిని పునస్సమీక్షించాలని డిమాండ్ చేయడాన్ని గమనిస్తే స్వపక్షంలోనే ఈ విషయంలో ఎంత వ్యతిరేకత ఉన్నదో అర్థమవుతుంది.

ఎయిరిండియా సంస్థలో 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతినీయాలని తీసుకున్న నిర్ణయం కూడా కీలకమైనది. ఆ సంస్థ రుణభారం రూ. 52,000 కోట్ల మేర ఉన్న మాట నిజమైనా ఇప్పుడిప్పుడే అది స్వల్ప స్థాయిలోనైనా నష్టాలను క్రమేపీ తగ్గించుకుంటోంది. 2016–17లో దాని నికర నష్టం అంతక్రితంతో పోలిస్తే తగ్గింది. ఈ సంస్థను ప్రైవేటీకరించే ఆలోచన మానుకుని దాని రుణాలు మాఫీ చేయాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈమధ్యే సిఫార్సు చేసింది. ఆ సంస్థ కోలుకోవడానికి అయిదేళ్ల వ్యవధినీయాలని కూడా సూచించింది. విమాన ఇంధనం ధర బాగా తగ్గి, విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆ సిఫార్సును పరిగణనలోకి తీసుకుని ఉంటే బాగుండేది. ఎందుకంటే ఎన్ని లోటుపాట్లున్నా ఇప్పటికీ వైమానిక రంగంలో ఎయిరిండియా వాటా 14 శాతం. తాజా నిర్ణయంతో దాని పరిస్థితి ఏమాత్రం మెరుగుపడగలదో చూడాలి. వ్యవస్థాగత లోటుపాట్లపై దృష్టి పెట్టి వాటిని సరిదిద్దుకోవడానికి బదులు ఇలా ఎడా పెడా ఎఫ్‌డీఐలకు అనుమతించడం అటు ఉపాధి అవకాశాలపై, ఇటు చిల్లర వర్తకరంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా 'మేకిన్ ఇండియా' నీరుగారుతుంది. ఇది విచారకరం.




అట్టడుగు వర్గాలను స్పృశించని ఏ సంస్కరణ అయినా సమాజ ఆర్థిక గతిని మార్చడం కలలో మాటే.

– మాల్కొమ్ ఎక్స్
అమెరికా హక్కుల నేత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి బ.ఏకాదశి రా.11.09 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం విశాఖ ఉ.9.54 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం ప.2.14 నుంచి 3.57 వరకు, దుర్ముహూర్తం ఉ.8.47 నుంచి 9.31 వరకు, తదుపరి ప.12.28 నుంచి 1.12 వరకు, అమృతఘడియలు... రా.12.37 నుంచి 2.20 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.39
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్ : 5.32
జొహర్ : 12.24
అసర్ : 4.24
మగ్రీబ్ : 6.00
ఇషా : 7.16

దిక్సూచి కొరవడిన దివ్యశక్తి



దిలీప్ రెడ్డి

'...లక్షల మంది ఆకలితో, అజ్ఞానంతో అలమటిస్తున్నపుడు, వారందరి శ్రమనుంచి విద్యార్జన చేసి, వారికేమాత్రం సహకారం అందించని వారిని నేను ద్రోహులుగానే పరిగణిస్తాను. నిర్భాగ్యులను అణచి, దోచి, బాధించి పొందిన సొమ్ముతో తమ ఆడంబరాల్లో బందీలుగా ఉంటూ, ఆ బాధితులకు ఏ రూపంలోనూ ఉపయోగపడని వారూ నా దృష్టిలో ఆకలిగొన్న క్రూర మృగాలే! నిజానికి అటువంటి వారమంతా దరిద్రులం, చివరకు ఏమీ కాకుండా పోతాం!' అని రాస్తూ, అలా కాకుండా నడుచుకుందామని హితబోధ చేస్తారు.

సమకాలీనం

''ఇప్పటి యువకుల మీద, వారి ఆధునికత పైన నాకు పరిపూర్ణ విశ్వాసం ఉంది. వారి నుండే నాకవసరమైన కార్యకర్తలు లభిస్తారు. వారు సమస్యల్ని సింహబలులై ఎదుర్కొంటారు''

అని స్వామీ వివేకానందుడు విశ్వాసం ప్రకటించి నూటపాతిక సంవత్సరాలయింది. ఆ తర్వాత అనేక మార్పులొచ్చాయి. రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సంస్కృతీ పరంగా ఇంటా బయటా ఎన్నెన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. శాస్త్ర–సాంకేతికత ప్రగతికి బాటలు పరిచాయి. ముఖ్యంగా యువతకు అపారమైన అవకాశాలు అందివస్తున్నాయి. ఇప్పటికీ యువతే ఏ దేశ భవిష్యత్తునైనా నిర్దేశించే స్థితిలో ఉంది. భారతదేశం అత్యధిక యువతరం కలిగిన దేశంగా లెక్కలకెక్కుతోంది. ప్రపంచీకరణ ఫలితంగా విశ్వవ్యాప్తమై లభిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని ఒడిసిపడుతూ మనవాళ్లు ముందుకు సాగుతున్నారు. దేశీ యంగానూ ఉన్నంతలో అవకాశాల్ని అందిపుచ్చుకునే యత్నం మన యువత నిర్విరామంగా సాగిస్తోంది. కానీ, వివేకానందుని ఆలోచనా ధోరణికి, తాత్విక చింతనకు, ఆశావహ దృక్పథానికి విరుద్ధమైన భావజాలం, ఆలోచన, కార్యాచరణ అత్యధికుల్లో ఇప్పుడు రాజ్యమేలుతోంది. సరైన గమ్యం, దిశానిర్దేశం లేని పంథాలో వారు సాగుతున్నారు. జాతిని జాగృత పరచి, అనుపమానమైన యువశక్తిని ఏకీకృతం చేసి సరైన మార్గాన నడిపే ఆత్మ దేశంలో కొరవడింది. ఆదర్శ మార్గదర్శకత్వం లేకుండా పోయింది. సరైన దిక్సూచి లేక యువశక్తి... కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాలు, భావజాలాల వారీగా విడిపోయి సంకుచిత మార్గాల్లో సాగుతోంది. విలువలు పతనమైన ఫక్తు వ్యాపార విద్యావిధానం వల్ల వారిలో పరిమిత యోచన, హ్రస్వ దృష్టి పెరిగి ఆలోచనా పరిధి విస్తరించడం లేదు. జీవనశైలి సంక్లిష్టమౌతోంది. నిర్హేతుకమైన హింస, విధ్వంసాలకు తెగించే పెడ ధోరణులు యువతలో పెచ్చరిల్లుతున్నాయి. 1984లో ఉత్తర కర్ణాటకకు చెందిన గుల్బర్గా నగరంలోని న్యాయ కళాశాల వార్షికోత్సవ సదస్సు జరిగింది. న్యాయ కోవిదుడు రామ్‌జెత్మలానీని ఆహ్వానించి ''భారతదేశానికిపుడు రాజకీయ నాయకుల కన్నా నైతికనేతల అవసరం ఎక్కువుంది'' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం ఏర్పాటు చేశాము. మూడున్నర దశాబ్దాల తర్వాత... ఇప్పటికీ పరిస్థితిలో ఏం మార్పు లేదు! ఒక పిలుపుతో అత్యధికుల్ని ఒక్కతాటిపై నడిపే నిబద్ధత కలిగిన నైతిక, ధార్మిక నేతృత్వపు నేటి అవసరాన్ని వివేకానందుడు గుర్తుచేస్తున్నారు.

విత్తొకటి వేస్తే చెట్టొకటి వస్తుందా?

దారితప్పిన మన విద్యావిధానం ప్రస్తుత పెడధోరణులకు ప్రధాన కారణం. ప్రభుత్వ నిర్వహణ నుంచి విద్య క్రమంగా ప్రయివేటు వైపు మళ్లుతున్న క్రమంలోనే ప్రతి అంశంలోనూ ఫక్తు వ్యాపార ధోరణి పెచ్చు మీరింది. లాభాపేక్షతో విద్యాబోధన జరిపించే 'పరిశ్రమ'లు వెలిశాయి. ఫలితంగా విలువలు అడుగంటుతున్నాయి. విద్యార్థులు–యువతరం ఆలోచనా ధోరణి వికటిస్తోంది. ప్రపంచీకరణలో అన్నీ వినియోగ వస్తు దృక్పథంతో చూడటం అలవాటయ్యాక త్యాగ భావనే కొరవడుతోంది. చదువులో, ఉద్యోగాలు పొందడంలో అనారోగ్యకర పోటీ పెరిగి వారిలో స్వార్థం కట్టలు తెంచుకుంటోంది. దాని చుట్టే జీవనశైలి రూపుదిద్దుకుంటోంది. ఇది విద్యావిధానమే కాదనేది వివేకానందుడి భావన. 'మెదడును అసంఖ్యాకమైన వైజ్ఞానిక విషయాలతో నింపటం విద్య కాదు. మనస్సు సమగ్ర ఉత్తీర్ణతను సాధించాలి. దానిపై సాధికారతను, నియంత్రణను సమకూర్చడమే విద్య లక్ష్యమై ఉండాలి' అంటారాయన. విద్య ఎలా ఉండకూడదో చెబుతూ, 'గంధపు చెక్కలు మోసే గాడిదకు వాటి బరువు తప్ప విలువ తెలియదు, ఎంత సమాచారం మెదడులో నింపామన్నది మన విద్యాజ్ఞానం కొలమానమే కాద'ంటారు. 'సమాచార సేకరణ, విషయ గ్రహణమే విద్య అయితే, మన గ్రంథాలయాలు తాపసులౌతాయి, మన విజ్ఞానసర్వస్వాలు మహర్షులుగా వెలుగొందుతాయ'ని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తారు. 'జీవితానికి, ప్రవర్తనకు అక్కరకొచ్చే అయిదు ఆలోచనల్ని మనస్సుకు పట్టించుకుంటే చాల'ంటారు. 'విద్యవల్ల సత్ప్రవర్తన అలవడాలి, మనో దారుఢ్యం పెరగాలి, వ్యక్తిత్వ వికాసం–వివేక విస్తరణ జరగాలి. చివరగా, మన కాళ్లమీద మనం నిలబడగలగాలి అంతే!' అంటారు స్వామీజీ.

తప్పు తెలిస్తే, దిద్దుకోవడం తేలిక!

భారతదేశంలో రెండు దుష్కర్మలు సాగుతున్నాయని వివేకానందుడనేవారు. ఒకటి స్త్రీ జాతి అణచివేత, రెండోది బీదల పట్ల వివక్ష, ముఖ్యంగా కుల వివక్షతో చూపే నిర్లక్ష్య వైఖరి అని ఆయన అభిప్రాయం. అవి ఇంకా కొనసాగడం దురదృష్టకరం! మహిళల పట్ల ఇప్పటికీ జరుగుతున్న దాష్టీకాలు చూస్తుంటే, లింగపరంగా సరైన దృక్పథం అలవడకపోవడమే వాటికి కారణం అనిపిస్తుంది. ఈ విషయంలో స్వామీజీకి ఉదాత్తమైన భావాలుండేవి. 'స్త్రీ పురుష భేదాన్ని విస్మరించి, మానవులంతా సమానులే అన్న భావన రానంతవరకు, స్త్రీ జనోద్ధరణకు అవకాశమే ఉండదు' అని బలంగా అభిప్రాయపడ్డారు. 'మానవ జాతి ఒక్కటే. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అని ఏమీ ఉండదు. అందరూ సర్వసమానతా భావాన్ని ప్రోత్సహిస్తూ ఒకరి సాహచర్యాన్ని మరొకరు అభిలషిస్తూ స్త్రీ–పురుషులు పరస్పర సహకారంతో సంచరిస్తేనే జీవతం ఆనందమయమౌతుంది'అనేవారు. 'ప్రపంచ శ్రేయస్సును సంరక్షించుకోవాలంటే స్త్రీ పరిస్థితి మెరుగుపడాలి. పక్షి ఎన్నడూ ఒక రెక్క సహాయంతో ఎగురలేదు' అన్నారాయన. తరాల తరబడి కొన్ని అట్టడుగు వర్గాల ప్రజలు మోసగించబడ్డారని, వాటికి చారిత్రక సాక్ష్యాధారాలున్నాయని వివేకానందుడు పేర్కొనేవారు. 'మనదేశంలో బీదలను, అట్టడుగు వర్గాల వారిని ఆదుకునేందుకు స్నేహితులుండరు. వారు ఎంత కష్టించినా వారొక స్థాయి నుండి పైకి రాలేరు. రోజులు గడిచిన కొద్దీ ఇంకా తక్కువ స్థాయికి దిగజారుతున్నారు. సమాజం నిర్దయగా వారిని చెప్పుదెబ్బలు కొడుతూనే ఉంది. ఆ దెబ్బలు ఏ సమయంలో ఎలా వచ్చి తాకుతాయో కూడ ఆ నిస్సహాయ ప్రజలకు తెలియదు' అన్నారు. 1894లో చికాగో నుంచి 'అలిసింగ'కు రాసిన ఉత్తరంలో చాలా ఆవేదన వ్యక్తం చేశారు. '...లక్షల మంది ఆకలితో, అజ్ఞానంతో అలమటిస్తున్నపుడు, వారందరి శ్రమనుంచి విద్యార్జన చేసి, వారికేమాత్రం సహకారం అందించని వారిని నేను ద్రోహులుగానే పరిగణిస్తాను. నిర్భాగ్యులను అణచి, దోచి, బాధించి పొందిన సొమ్ముతో తమ ఆడంబరాల్లో బందీలుగా ఉంటూ, ఆ బాధితులకు ఏ రూపంలోనూ ఉపయోగపడని వారూ నా దృష్టిలో ఆకలిగొన్న క్రూర మృగాలే! నిజానికి అటువంటి వారమంతా దరిద్రులం, చివరకు ఏమీ కాకుండా పోతాం!' అని రాస్తూ, అలా కాకుండా నడుచుకుందామని హితబోధ చేస్తారు.

ముందు మేల్కొనండి...

యువత పట్ల వివేకానందుడికి అపారమైన ఆశ, నమ్మకం ఉండేవి. మీలో ఎంతో శక్తి ఉంది, ఆత్మవిశ్వాసంతో ఉండండి, అప్రమత్తం కండి, అంతే చాలు, మిగతావన్నీ వాటంతట అవే జరిగిపోతాయని యువతరానికి సందేశం ఇచ్చేవారు. సమాజంలో కొనసాగుతున్న అరిష్టాల్ని ఎదుర్కొనేందుకు యువత సన్నద్ధం కావాలని పిలుపునిచ్చేది. 1896 జూన్ 7న లండన్ నుంచి మిస్ మార్గరెట్ నోబెల్‌కు ఉత్తరం రాస్తూ వివేకానందుడు ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. '... ప్రపంచం దుఃఖంతో జ్వలిస్తోంది. మీరు నిద్రించగలరా? మనం బిగ్గరగా అరవాలి... ఎంతలా అంటే, మనలో విశ్రమిస్తున్న దేవత నిద్ర లేవాలి, ఆ పిలుపులకు ప్రతిస్పందించాలి' అని రాశారు. యువత ఎక్కువగా ఉన్న ఒక సమావేశంలో మాట్లాడుతూ, 'సాహసికులైన యువకులారా! మీకు కావలసినవి మూడే విషయాలు: అవి ప్రేమ, నిజాయితీ, సహనం. జీవితమంటే ప్రేమ. ప్రేమమయమే జీవితం. ఇదే జీవిత పరమార్థం. స్వార్థపరత్వమే మరణం! ఇది ఇప్పటికే కాదు ఎప్పటికీ సత్యమే. మనకు భావి లేదనుకున్నా, ఇతరులకు మంచి చేయడమే జీవితం. హాని సల్పటం మరణం. నీకు కనిపించే పశుప్రవృత్తి కలిగిన మానవుల్లో నూటికి తొంబై మంది మృతులే!' అన్నారు. జీవితంపైనే సరైన దృక్పథం లేని నేటి యువకులు కొందరు, ఉన్మాదంతో ఎదుటివారి జీవితాల్ని హరిస్తున్నారు. వివేకానందుడు చెప్పిన ప్రేమ, నిజాయితీ, సహనం మూడూ లేని ముష్కరులు తయారవుతున్నారు. చిన్న వయసులో తాగి తందనాలాడుతున్నారు. నేర ప్రవృత్తిలోకి దిగుతున్నారు. విలువలు నశించినా ఆడంబరాలకు అతుక్కుపోతున్నారు.

అందరి పూనికతోనే మార్పు...

యువతరం భారత్‌కు ఓ గొప్ప శక్తి! 35 ఏళ్ల లోపు వయస్కులైన 65 శాతం జనాభాతో ప్రపంచంలోనే అగ్రగామి 'యువ'దేశంగా మనకు కీర్తి లభిస్తోంది. 15–29 మధ్య వయస్కుల జనాభా 27.5 శాతంగా మానవవనరుల సహాయ మంత్రి డా. సత్యపాల్‌సింగ్ వారం కింద లోకసభకు తెలిపారు. తగిన విద్య, శిక్షణ, నైపుణ్యాల వృద్ధి చేస్తూ వారిని శ్రమశక్తి వనరుగా తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్వో) ప్రమాణాల ప్రకారం పనిచేసే–చేయని మానవ వనరుల నిష్పత్తి, రాగల ఒకటిన్నర దశాబ్దాల్లో (2016–30) చైనా, కొరియా, బ్రెజిల్ కంటే భారత్‌లోనే మెరుగ్గా ఉంటుందని కార్మిక మంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వార్ తెలిపారు. భారత యువజనాభివృద్ధి సూచిక 0.569 సగటుతో ఆశావహంగానే ఉందని యువజన వ్యవహారాలు –క్రీడల సహాయ మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్ వివరించారు. 2014 యువ విధాన పత్రం ప్రకారం, అభివృద్ధి ఫలాల గ్రహీతలుగా మాత్రమే కాకుండా యువతను చోదకశక్తులుగా, క్రియాశీలంగా ఉంచే కార్యక్రమాలు రచించి, అమలు చేస్తున్నట్టు ఆ శాఖ మంత్రి విజయ్‌గోయల్ సభలో వెల్లడించారు. ఇక్కడ రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది అర్హులైన నిరుద్యోగులు తమ ఉద్యోగ–ఉపాధి అవకాశాల కోసం నిత్య పోరాటం చేస్తున్నారు. మరో వంక మూడు ప్రభుత్వాలు తాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ప్రకటనలు చేస్తున్నాయి. ప్రభుత్వ లెక్కలు, కథలు, కథనాలెలా ఉన్నా... నేటి యువతరం ప్రవర్తన, ఆలోచనా ధోరణి, దృక్పథాలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకం. దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్, అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఫేస్‌బుక్ అధినేత జుకెర్‌బర్గ్, ఐటీ దిగ్గజాలు అజీమ్ ప్రేమ్‌జీ, నందన్ నీలేకనీ వంటి వారి మాటలకు అక్కడక్కడ యువతరం ఎంతో కొంత ప్రభావితమవుతున్నారు, స్పందిస్తున్నారు. కానీ, యువతను దారిన పెట్టే ప్రభావశీలురు, వైతాళికులు లేకుండా పోయారు. కుంచించుకుపోతున్న యువత ఆలోచనా ధోరణి విస్తరించాలి. విశాల దృక్పథం అలవడాలి. ఇందుకు, తల్లిదండ్రులు క్రియాశీల పాత్ర పోషించాలి. ఆదర్శమూర్తుల దారిన నడిచేలా తమ పిల్లల్ని చిన్నప్పట్నుంచే ప్రభావితుల్ని చేయాలి. నరేంద్రుడు వివేకానందుడిగా మారేంత ప్రభావితం చేసిన భువనేశ్వరీ దేవి అందరికీ ఆదర్శం కావాలి. ఒకనాడు తల్లి తనకు చెప్పినట్టు వివేకానందుడే స్వయంగా తన పుస్తకంలో రాసుకున్న మాటలతో ముగిస్తా. ''పవిత్రంగా ఉండు. స్వచ్ఛమైన జీవితాన్ని గడుపు. ఆత్మగౌరవాన్ని సంరక్షించుకో. ఇతరులను గౌరవంగా చూడు. సరళ స్వభావుడవై నిరాడంబరంగా మెలుగు. కానీ, అవసరమైనచోట దృఢత్వాన్ని ప్రదర్శించడానికి వెనుకాడకు''

(నేడు వివేకానంద జయంతి)

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

నిత్య నూతన స్ఫూర్తి ప్రదాత

భారత్ ఔన్నత్యాన్ని ప్రపంచం నలుమూలలా చాటుతూ.. అది తన ప్రాచీన గౌరవాన్ని తిరిగి పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. ఇనుప కండలు, ఉక్కునరాలు నినాదంతో జాతిని జాగృతం చేసిన నిత్యచైతన్య దీప్తి ఆయన.

సందర్భం



డాక్టర్ కె. లక్ష్మణ్

వివేకానందుడి పేరు వినగానే ముందుగా జ్ఞాపకం వచ్చే వాక్యాలు.. ''ఇనుప కండలు, ఉక్కు నరాలు, దృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసం''. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ... ఇంకో క్షణంలో ప్రాణాలు పోతాయన్న వ్యక్తి సైతం ఈ మాటలతో మళ్లీ జీవం పోసుకుంటాడు. యావత్ యువతను నిత్యచైతన్య దీప్తులను చేసేందుకు వివేకానందుడు పలికిన ఈ స్ఫూర్తి వాక్యాల్లో అంతులేని కొండంత బలం ఉంది... ఎంతో ఆకర్షణ శక్తి ఉంది. యువతకు ఆయన ఇచ్చిన సందేశం దిశదశతో కూడిన మార్గదర్శిగా పనిచేస్తూనే ఉంది. ఎప్పటికీ అది పనిచేస్తూనే ఉంటుంది.

1863 జనవరి 12న జన్మించిన వివేకానందుడి అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా. బెంగాల్ ప్రెసిడెన్సీలోని కలకత్తాలో జన్మించిన నరేంద్రనాథ్ దత్తా చిన్నప్పటి నుంచే ఎంతో చురుకైన, తెలివైనవాడు. నిత్య నూతన చైతన్య ఝరితో.. తన చుట్టూ ఉండే ఎంతో మందికి ప్రతిక్షణం జ్ఞాన సందేశాలు ఇస్తూనే.. అందరికీ ఆదర్శమూర్తిగా వెలుగొందే వాడు. ''లెండి.. మేల్కొండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి'' అంటూ తాను యువతకు ఇచ్చిన సందేశం ఒక బలమైన టానిక్ అనే చెప్పాలి. హిందూ యోగిగా వివేకానందుడు అనేక ప్రదేశాలను చుట్టివచ్చారు. రామకృష్ణ పరమహంస శిష్యుడిగా వేదాంత, యోగ తత్వ పారాయణంలో వివేకానందుడి ముద్ర అత్యంత క్రియాశీలం.

గురువు రామకృష్ణ పరమహంస కోరిక మేరకు అమెరికాకు వెళ్లి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేశారు. భారత దేశ ఔన్నత్యాన్ని, భారత గడ్డ పవిత్రతను నలుమూలలా చాటుతూ.. మళ్లీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని తిరిగి పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. అతని ఉపన్యాసాలకు, సందేశాలకు అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టి అనేక మంది అతనికి శిష్యులుగా మారారు. పాశ్చాత్య దేశాల్లోకి అడుగు పెట్టిన మొదటి హిందూ సన్యాసి కూడా స్వామి వివేకానంద కావడం విశేషం. 1893లో తూర్పు దేశాల తత్వాన్ని చికాగోలో జరిగిన ప్రపంచ మత సదస్సులో ప్రవేశపెట్టడమే కాక, అనేకమంది అమెరికా వాసుల్ని తన మంత్రముగ్ధ వాక్పటిమతో ఆకర్షించి వారి అభిమానాన్ని చూరగొన్నారు. హిందూమతం ప్రాశస్త్యాన్ని, భారత దేశ ఔన్నత్యాన్ని దశదిశలా వ్యాప్తి చేసిన స్వామి వివేకానంద సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 1984 నుంచి జాతీయ యువజన దినోత్సవంగా జరుపుతూ వస్తోంది.

చికాగోలోని సర్వమత సమ్మేళనం గురించి ముఖ్య విషయం చెప్పుకోవాలి. చికాగోలో స్వామి వివేకానంద బోస్టన్ నగరానికి వెళ్లే మార్గమధ్యంలో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఆయనతో కొద్ది సేపు మాట్లాడిన ఆమె అతని గొప్పదనం ఏంటో అర్థం చేసుకుంది. అతను ఎంతో గొప్ప వ్యక్తి అని గ్రహించి అయన్ను తన ఇంట్లో బస చేయమని కోరింది. ఈ క్రమంలో ఎక్కడ అవకాశం



వచ్చినా భారత దేశ సంస్కృతి, హిందూ ధర్మం ప్రాముఖ్యత గురించి వివరించేవారు. స్వామి వివేకానందుడు ప్రపంచ ప్రజలందరినీ సోదరభావంతో చూసేవారు. అందుకు ఉదాహరణే చికాగో సభలో ఆయన మాట్లాడిన మాటలు. అమెరికా దేశపు సోదరులారా అంటూ ఆయన మాట్లాడటం మొదలు పెట్టగానే సభలో కరతాళ ధ్వనుల మోత మోగడంతో పాటు అప్పటి నుంచి చాలా మంది అతనికి ఆరాధ్యులయ్యారు. ఎక్కడికి వెళ్లినా వివేకానందుడు తన ప్రసంగంలో భారతదేశ విలువలను ప్రచారం చేసేవారు. చరిత్ర, సామాజిక శాస్త్రం, తత్వశాస్త్రం, సాహిత్యం ఇలా అన్నిఅంశాలపై పట్టు సాధించి.. ప్రతి అంశంపై ధారాళమైన ఉపన్యాసం ఇచ్చేవారు.

స్వామి వివేకానందుడు అప్పటికీ ఇప్పటికీ.. ఎప్పటికీ యువతకు ఆదర్శనీయుడే. ఆయన చూపిన మార్గం ఎందరికో స్ఫూర్తిదాయకం. నేటి యువతలో గూడు కట్టుకుని పోయిన సోమరితనం, అలసత్వం, నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వంటి దుర్గుణాలను తక్షణమే త్యజించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. వివేకానందుడు ఏనాడో చెప్పిన లేవండి, మేల్కొండి, లక్ష్యాన్ని చేరేవరకూ విశ్రమించకండి అన్న మంచిమాటల్ని స్ఫూర్తిగా తీసుకుని ఇప్పటి యువతరం లక్ష్యసాధనలో ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది. ఈనాటి యువతలో గూడుకట్టుకుని పోయిన నిరాశ, నిస్పృహలకు స్వామి వివేకానందుడి స్ఫూర్తిదాయక వాక్కులే దివ్యౌషధం కావాలి. నిరంతరం జ్వలించే నిప్పు కణంలా యువత సమస్యలపై సమరశంఖం పూరించి.. ఈ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఎక్కడ సమస్య ఉంటుందో అక్కడ యువత ఆలోచన ఉండాలి. ఎక్కడ నిర్లక్ష్యం ఉంటుందో అక్కడ యువత చైతన్యం ఉండాలి. ఎవరూ బాధితులుగా మారకుండా.. యువత బాసటగా నిలవాలి.

యువతకు స్ఫూర్తి ప్రదాత, నిరంతర చైతన్యశీలి స్వామి వివేకానందుడి సుగుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకుని, ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ.. భవిష్యత్ భారతావని మేలి రత్నాలుగా ఎవరికి వారు తమను తాము తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. వివేకానందుడి బాటలో పయనించేందుకు ఈ క్షణాలే శుభతరుణంలా భావించి, నవభారత నిర్మాణానికి భావి భారత ముద్దుబిడ్డలందరూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఇదే స్వామి వివేకానందుడికి మనం ఇచ్చే సగౌరవం.

(నేడు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా)

వ్యాసకర్త బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు
ఈ–మెయిల్: bjptsmedia@gmail.com

సమాచారం అడిగితే బెదిరింపా?

ఉద్యోగ నియామకాల్లో కుంభకోణాలకు సంబంధించి సమాచారం అడిగిన వారిని, వారి కుటుంబ సభ్యులను కూడా బెదిరించడం ఆర్టీఐ ప్రాథమిక సూత్రాలకే విరుద్ధం. దీని విచారణపై అలక్ష్యం మరింత నేరం.

విశ్లేషణ




మాడభూషి శ్రీధర్

కార్మికుల బీమా కార్పొరేషన్ వారు గుమస్తాలు, ఇన్‌స్పెక్టర్ల నియామకంలో ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాయడానికి డబ్బు తీసుకుని వీలు కల్పించారనే అంశంపైన, సమాచార హక్కు చట్టం కింద అనేక దరఖాస్తుల ద్వారా సమాచారం అడిగారు హరీందర్ ధింగ్రా. కొంత ఇవ్వడం, మరికొంత లేదనడం, తరువాత మొదటి అప్పీలు, ఆ తరువాత రెండో అప్పీలు, ఫిర్యాదు తంతులన్నీ జరుగుతున్నాయి. సమాచార కమిషన్ కొన్ని కేసులలో ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలలో కొన్ని అంశాలు అమలు చేస్తూ కొంత సమాచారం ఇచ్చారు. రికార్డులు లేవన్నారు. సంబంధించిన సమాచారాన్ని, దస్తావేజులు చూపాలన్నారు.

కుంభకోణాన్ని వెలికితీసి బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నాడు ధింగ్రా. ఆ వ్యక్తులు శక్తులు తనను బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారాయన. ఇంటినుంచి బయటకు నడిచి వెళ్తుంటే బెదిరించడం, మోటార్ సైకిల్‌పైన ఇద్దరు వ్యక్తులు ఇదంతా ఆపేయ్ నీకు మంచిది కాదు అంటూ హెచ్చరించి జారుకోవడం జరుగుతూ వస్తున్నది. నీ కుటుంబ సభ్యులకు కూడా సమస్యలు వస్తాయని హెచ్చరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. భద్రత కల్పించాలని సమాచార కమిషన్‌ను కోరుతూ ఒక దరఖాస్తు ఇచ్చారు. సమాచార కమిషన్ ఉత్తర్వులు అమలు కాలేదనే ఫిర్యాదును అర్జెంట్‌గా స్వీకరించాలని కోరారు.

సమాచార కమిషన్ వెంటనే పరిశీలనకు స్వీకరించింది. జనవరి 5న ఆయన ఫిర్యాదులను విచారించింది. ఆయన హరియాణా పోలీసులకు, కార్మిక మంత్రిత్వ శాఖకు, ఇఎస్ఐసీకి కూడా లేఖలు, వినతి పత్రాలు సమర్పించారు. డిసెంబర్ 20వ తేదీన జరిగిన రెండో అప్పీలు విచారణలో సమాచార కమిషన్ ముందు ఇఎస్ఐసీ సంస్థ అధికారులు తాము కొన్ని పత్రాలు ఇచ్చామని వివరించారు. సీబీఐలోని జాయింట్ డైరెక్టర్‌కు, చేతిరాత పరిశీలన నిపుణులకు కొన్ని పత్రాలను ఇవ్వాలని కోరుతూ 9 ఆగస్టు 2017న లేఖ రాసినట్టు తెలిపారు. ఆ లేఖ ప్రతిని హరీందర్ ధింగ్రాకు ఇచ్చారు. కేంద్ర ఫోరెన్సిక్ లేబొరేటరీ వారికి పరీక్షించేందుకు అనుమతి ఇస్తూ సెప్టెంబర్ 8న అడిషనల్ కమిషనర్ రాసిన లేఖ ప్రతి కూడా ఇచ్చారు. దీనికి జవాబు ఇంకా రాలేదని అధికారులు చెప్పారు.

ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాశారని దాదాపు అందరికీ తెలిసిపోయినా ఇంకా అసలు నేరస్తులెవరో పరిశోధించడంలో ఏ ప్రగతీ లేదు. సరిగ్గా దస్తావేజులను కూడా నిర్వహించలేకపోయారనీ దీంతో తేలింది. ఈ అనుభవాలనుంచి పాఠాలు



నేర్చుకున్నామని, ఇప్పుడు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ వెంట వెంటనే ఫలితాలను వెబ్‌సైట్‌లో ప్రచురిస్తున్నామని, మెరిట్ ప్రకారమే నియామకాలు జరుపుతున్న విషయం అందరికీ తెలిసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించారు. అయితే ఇదివరకు జరిగిన అక్రమాలపైన దర్యాప్తు జరపడం కూడా ప్రధానమైన అంశం అని కమిషన్ భావించింది. కేంద్ర ఫోరెన్సిక్ లేబొరేటరీ వారు సీబీఐ కోరిన విధంగా చేతిరాత నిపుణుల సేవలను ఇవ్వాలనే విషయంలో ఏ చర్య తీసుకున్నారో తెలపాలని కమిషన్ సూచించింది. పదిహేను రోజుల్లో ప్రగతి చర్యలు వివరించాలని ఆదేశించింది. దర్యాప్తు ఎంతవరకు వచ్చిందో వివరించాలని కూడా ఆదేశించింది.

హరీందర్ ధింగ్రా అవినీతి కుంభకోణాన్ని వెలికితీసే సమాచార అభ్యర్థనలు చేయడం, దానిపై వెల్లడైన సమాచారం ప్రకారం ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాశారని ప్రాథమికంగా తేలడం జరిగింది కనుక బెదిరింపులు అవాస్తవాలు అనుకోవడానికి వీల్లేదు. ఇది దరఖాస్తుదారు జీవనానికి, భద్రతకు, స్వేచ్ఛకు సంబంధించిన సమాచారం కనుక 48 గంటలలోగా ఇవ్వాలని చట్టం కూడా వివరించింది. ఇదివరకు సీఐసీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడం ద్వారా ఈ బెదిరింపులను నిరోధించవచ్చన్న వాదంలో వాస్తవం ఉందని కమిషన్ అంగీకరించింది. ఈ ఆదేశాల వల్లనే బెదిరింపులు వస్తున్నాయని కూడా తేలింది. కమిషన్ తన ఉత్తర్వులను అమలు చేయించడానికి తీసుకోవలసిన చర్యలన్నీ తీసుకోక తప్పదు కనుక కమిషన్ ధింగ్రా భద్రతకు భరోసా ఇవ్వాలని ఇఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్‌కు సూచించింది. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవడం ద్వారా భద్రత కల్పించాలని ఇన్సూరెన్స్ కమిషనర్ అరుణ్ కుమార్‌కి ఆదేశించింది. హరియాణా పోలీసు డైరెక్టర్ జనరల్ బల్‌జిత్ సింగ్ సాంధు వెంటనే హరీందర్ భద్రతకు కావలసిన చర్యలు తీసుకోవాలని, ఆ వివరాలను హరీందర్ ధింగ్రాకు 48 గంటల్లో ఇవ్వాలని ఆదేశించింది. కమిషన్ 11.12.2017న ఇచ్చిన ఆదేశాలను పాటించాలని కూడా నిర్దేశించింది. (హరీందర్ ధింగ్రా వర్సెస్ ఇఎస్ఐసీ CIC/BS/A/2016/002028 మరో 13 కేసులలో జనవరి 5, 2018న ఇచ్చిన ఆదేశం ఆధారంగా).

వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com


అంతర్జాతీయ స్థాయిలో మేడారం జాతర

- జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జాతర
- యాత్రికుల కోసం హెలికాప్టర్ సేవలు: సీఎస్
- ప్రత్యేకాధికారిగా వాకాటి కరుణ



సాక్షి, హైదరాబాద్: సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం లభించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పలు శాఖల అధికారులను ఆదేశించారు. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే మేడారం జాతర ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్షించారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాలని, విదేశీ యాత్రికుల కోసం అత్యున్నత సదుపాయాలతో ప్రత్యేక నివాసాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సాంస్కృతిక శాఖలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, జాతర కార్యక్రమాలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. గతంలో వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వాకాటి కరుణను జాతర కోసం ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జాతరకు దేశంలోని అన్ని రాష్ట్రాల గిరిజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రులు, సెక్రటరీలు, గిరిజన ఎంపీలను ఆహ్వానించాలని ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అత్యాధునిక మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. జాతర ఏర్పాట్లపై సాంస్కృతిక దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా శాఖల వారీగా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. యాత్రికులకు హెలికాప్టర్ సేవలను కల్పించాలన్నారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అర్విందర్ కుమార్, పర్యాటక, సాంస్కృతిక కార్యదర్శి వెంకటేశం, దేవాదాయ శాఖ కమిషనర్ శివ శంకర్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, నాగిరెడ్డి పాల్గొన్నారు.

మేడారం జాతరకు కేంద్ర సాంస్కృతిక మంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: మేడారం జాతరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ సహాయ మంత్రి అల్ఫోన్స్ హాజరుకానున్నారు. గురువారం బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ ఆయన్ను కలసి జాతరకు ఆహ్వానించారు. తాను జాతరకు హాజరవుతానని మంత్రి తెలిపారు. తెలంగాణలో 3 పర్యాటక ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని అన్నారు. ట్రైబల్ ఎకో టూరిజం ప్రాజెక్టుకు రూ.1,400 కోట్లు, దేవరకొండ, రాచకొండ, భువనగిరి కోటల అభివృద్ధికి రూ.94.98 కోట్లు ఇవ్వాలని కోరినట్టు దత్తాత్రేయ తెలిపారు. కొలనుపాక, యాదాద్రి ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి నిధుల కేటాయింపును పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ ఎక్స్‌పీరియన్స్ ప్లాన్లు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: బీఎస్ఎన్ఎల్ ఎక్స్‌పీరియన్స్ ఎల్ఎల్–49, ఎక్స్‌పీరియన్స్ అన్‌లిమిటెడ్ బీబీ–249 ప్లాన్లను మార్చి 31 వరకు పొడిగించినట్లు టెలికాం తెలంగాణ సర్కిల్ సీజీఎం వి.సుందర్ తెలిపారు. కొత్తగా కనెక్షన్లు తీసుకునే వినియోగదారులకు ఉచిత ఇన్‌స్టాలేషన్, ఏ నెట్‌వర్క్‌కైనా రాత్రి 10.30 నుంచి ఉదయం 6 వరకు ఉచిత నైట్ కాలింగ్ సదుపాయం ఉంటుందన్నారు. రూ.49కే ల్యాండ్‌లైన్, రూ.249లకు అన్‌లిమిటెడ్ ప్లాన్, 8 ఎంబీపీఎస్ స్పీడ్, 5జీబీ వరకు ఆపై 1ఎంబీపీఎస్ స్పీడ్‌తో కనెక్షన్ పొందవచ్చన్నారు. ఉచిత నైట్ కాలింగ్ సదుపాయం రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు అన్ని ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బాండ్, కాంబో, ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్–18003451500ను సంప్రదించవచ్చన్నారు.

ఇదే తొలిసారి

ఒకే వేదికపై వెయ్యి రకాల స్వీట్లు: చందూలాల్



సాక్షి, హైదరాబాద్: రాజధానికి అంతర్జాతీయ ఖ్యాతి లభించేలా ఒకే వేదికపై 1,000 రకాల స్వీట్లను ప్రదర్శించటం ప్రపంచంలోనే తొలిసారని పర్యాటక, సాంస్కృతిక మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. శనివారం నుంచి సోమవారం వరకు మూడ్రోజులపాటు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఫెస్టివల్‌లో స్వీట్ల అమ్మకాల కోసం కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. గురువారం సచివాలయంలో మంత్రి చందూలాల్, పర్యాటక కార్యదర్శి బుర్రా వెంకటేశం కలసి ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

✦ రుణమాఫీపై టీఆర్ఎస్‌ను నిలదీయండి

కిసాన్‌సెల్ సమావేశంలో ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీని ఒకేసారి చేయకపోవడమే గాక, రైతులపై పడిన వడ్డీ భారాన్ని కూడా మాఫీ చేయకుండా మోసం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, టీఆర్ఎస్‌ను నిలదీయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అధ్యక్షతన గురువారం గాంధీభవన్‌లో జరిగిన కిసాన్‌సెల్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. స్పీకర్‌ను కలిసి రైతులకు న్యాయం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2లక్షల రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలు, పంటల బీమా పథకానికి సంబంధించిన ప్రీమియం డబ్బులను ప్రభుత్వమే భరించడం వంటి ప్రధానమైన హామీలు ఎన్నికల ప్రణాళికలో ఉంటాయని చెప్పారు. ఈనెల 13న రైతు సమస్యలు, పరిష్కారం కోసం అన్ని జిల్లా కేంద్రాలలో పత్రికా సమావేశాలు ఏర్పాటు చేయాలని, 17న అన్ని జిల్లాల కలెక్టర్లను కలిసి వినతిపత్రాలను ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాలు, 570 మండలాలలో కిసాన్‌సెల్ కమిటీలను వెంటనే పూర్తి చేయాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు.

✦ 'ఓటుకు కోట్లు' దొంగతో చర్చించం

ఉత్తమ్, జానారెడ్డి వస్తే చర్చకు సిద్ధం: బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ అంశంపై చర్చించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాంగ్రెస్ తరపున పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి వస్తే తాము చర్చకు సిద్ధమని ఎంపీ బాల్కసుమన్ పేర్కొన్నారు. ఓటుకు కోట్లు కేసులో పట్టుబడ్డ దొంగ రేవంత్‌రెడ్డితో ఎందుకు చర్చిస్తామని అన్నారు. మండలిలో ప్రభుత్వ విప్ పల్లారాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌లతో కలసి ఆయన గురువారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తప్పుడు ఆరోపణలతో వార్తల్లో ఉండేందుకు తపించే విశ్వసనీయత లేనివ్యక్తి రేవంత్ అని, అలాంటి వారితో చర్చించడం వల్ల ఏం ఉపయోగం ఉండదని సుమన్ పేర్కొన్నారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా విద్యుత్‌పై అబద్ధాలు మాట్లాడి రేవంత్ అడ్డంగా దొరికిపోయాడని, తన వాదనకు సరైన డాక్యుమెంట్లు చూపలేక అసెంబ్లీకి మొహం చాటేశాడని గుర్తు చేశారు. కోమటిరెడ్డి చేసిన ఆరోపణలు ఏ ఒక్కటీ నిజంకాదని రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సీఎం చర్చకు రావాలంటే తాము 10, జనపథ్ నుంచి రావాలంటామని పల్లా అన్నారు.

✦ సవాల్ చేసిన టీఆర్ఎస్ పారిపోయింది

కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్‌పై బహిరంగ చర్చకు వస్తామని సవాల్ చేసిన టీఆర్ఎస్ నాయకులు భయపడి పారిపోతున్నారని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. విద్యుత్ ఉత్పత్తి, కొత్త ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేసిన టీఆర్ఎస్ తోకముడిచిందని గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఆ పార్టీ నేతలు బాల్క సుమన్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భానుప్రకాశ్ ఇప్పటిదాకా మాట్లాడినవన్నీ అబద్ధాలుగా తేలిపోయాయన్నారు. టీఆర్ఎస్ బండారం బయటపడిపోతుందనే భయంతోనే చర్చకు రాకుండా తప్పించుకుంటున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్‌ను వదిలేది లేదని, వారి అక్రమాలను బయటపెడ్తానని హెచ్చరించారు. అన్ని వివరాలు, ఆధారాలతో శుక్రవారం మాట్లాడుతానని పేర్కొన్నారు.

✦ ఓటర్ల తొలగింపులో అక్రమాలు: సబిత



సాక్షి, హైదరాబాద్: ఓటర్ల తొలగింపులో అక్రమాలు జరిగాయని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా ఓటర్ల జాబితాను సవరించారని ఆమె గురువారం విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణకు రాజ్యాంగం ప్రకారం అనుసరించాల్సిన ప్రక్రియను పాటించలేదని అన్నారు. జాబితా నుంచి అర్హులను తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించిన ఓటర్లను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించాలని కోరారు.

✦ 100 శాతం ఎఫ్‌డీఐలు దారుణం: చాడ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా అనేక సమస్యలతో ప్రజలు, రైతులు సతమతమవుతున్నా పట్టించుకోని కేంద్రం విదేశీ కంపెనీలకు మాత్రం ఎర్ర తివాచీ పరుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. సింగిల్ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్, నిర్మాణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను 100 శాతానికి అనుమతిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఈ చర్యను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించి కేంద్రం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎన్నికల వాగ్దానాలను మరిచి బీజేపీ ఈ విధంగా వ్యవహరించడం ప్రజలను మోసం చేయడమేనని చాడ విమర్శించారు. బీజేపీ విధానాలు, సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని సీపీఐ జాతీయ సమితి నిర్ణయించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి గురువారం చెప్పారు.

✦ రిమాండ్‌కు ప్రేమోన్మాది

జానకి హత్య కేసులో నిందితుడు అరెస్టు



హైదరాబాద్: ప్రేమోన్మాది చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురైన బోను జానకి కేసులో నిందితుడిని గురువారం కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాకుళం జిల్లా గుయ్యనవలసకు చెందిన బోను జానకి కేబీహెచ్‌బీలోని డీమార్టులో సేల్స్ గర్ల్. అదే సంస్థలో పనిచేస్తున్న నిందితుడు వికారాబాద్ జిల్లా నేర్లపల్లి అనంతప్ప అలియాస్ ఆనంద్‌తో 8 నెలల క్రితం పరిచయం ఏర్పడటంతో తనను ప్రేమించాలంటూ జానకిని వేధించడం మొదలు పెట్టాడు. దీంతో ఆమె డీమార్టు యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. వారు అతన్ని మందలించారు. జానకిని మరో బ్రాంచ్‌కు బదిలీ చేశారు. అయినా అతడి వేధింపులు ఆగలేదు. తన బావతో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ తనకు దూరమవుతోందని భావించిన అనంతప్ప జానకిని హత్య చేసి తాను ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. ఈ నెల 9న జానకి రూమ్‌కు వెళ్లి తనను పెళ్లి చేసుకోవాలని కోరడంతో ఆమె నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన అనంతప్ప కత్తితో జానకిని మూడు చోట్ల పొడిచి, గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.



విహంగ విహారం!

నగర శివార్లలో వలస పక్షుల కోలాహలం ● వేలాది కిలోమీటర్ల దూరం నుంచి వలసలు

ఏసిరెడ్డి రంగారెడ్డి

భాగ్యనగరానికి కొత్త అతిథులొస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి అలుపుసొలుపు లేకుండా ప్రయాణం చేసి నగరానికి చేరుకుంటున్నాయి. నగర శివారు ప్రాంతాల్లోని పర్యాటక ప్రదేశాలు, జలాశయాలు మొదలైన ప్రాంతాల్లో ప్రశాంతంగా సేదదీరుతున్నాయి. ఇంతకీ ఎవరీ అతిథులు అనుకుంటున్నారా..? ఏటా శీతాకాలంలో మనదేశానికి వలస వచ్చే సైబీరియన్ కొంగలు.. ఆఫ్రికా డేగలు.. రాజహంసలు.. మచ్చల బాతులు.. గోరింకలు ఇలాంటి వలస పక్షులే ఇవి. రాజధాని నగరానికి చుట్టూ ఉన్న పర్యాటక ప్రాంతాలు, జలాశయాలు ఈ వలస విహంగాలకు ఆలవాలంగా మారుతున్నాయి. ఏటా అక్టోబర్–ఫిబ్రవరి మధ్యకాలంలో కనువిందు చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 200 జాతులు, ప్రజాతులకు చెందిన పక్షులు ఇక్కడకు చేరుకోవడం గమనార్హం. అయితే ఈ సంవత్సరం వీటి సంఖ్య 30–40 శాతం తగ్గుముఖం పట్టినట్లు జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వలస వచ్చే ప్రధాన పక్షి జాతులివే..

ప్రధానంగా కొంగలు, బాతులు, డేగలు, గుడ్లగూబలు, నీటి కోళ్లు తదితర జాతులు, ప్రజాతులకు చెందిన విభిన్న రకాల పక్షులు వలస వస్తుంటాయి. ఇందులో గుజరాత్ రాజహంసలు(గ్రేటర్ ఫ్లెమింగోలు), ఎర్రకాళ్ల కొంగలు, గూడబాతులు, రివర్‌టెర్న్, పిన్‌టెయిల్డ్ డక్, షౌలర్, గార్గినే టేల్, హ్యారియర్స్ డేగలు, ఫ్లైక్యాచెస్, గోరింక ప్రజాతికి చెందిన రోజీపాస్టర్స్, స్టార్‌లింక్స్ పక్షులు, బార్హెడోగూస్ బాతు, పైడ్ క్రస్టడ్ కకూ మొదలైనవి ప్రధానమైనవి.

సుదూర తీరాల నుంచి..

సైబీరియా, యూరప్, ఆఫ్రికా, మయన్మార్, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్ తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ నగరంతోపాటు.. సిటీకి ఆనుకుని ఉన్న పలు పర్యాటక ప్రాంతాలు, జలాశయాలకు ఏటా అక్టోబర్–ఫిబ్రవరి మధ్య కాలంలో సుమారు 200 జాతులు, ప్రజాతులకు చెందిన రెండు లక్షల పక్షుల వరకూ వలస రావడం పరిపాటి. గ్రేటర్‌తోపాటు.. సిటీకి ఆనుకుని ఉన్న పలు జలాశయాలు, పర్యాటక ప్రాంతాలు ఈ వలస పక్షులను అక్కున చేర్చుకుని వాటికి ఆహారం.. వసతి సమకూరుస్తున్నాయి. ప్రధానంగా కేబీఆర్ పార్క్.. అనంతగిరి హిల్స్.. ఫాక్స్‌సాగర్(జీడిమెట్ల).. అమీన్‌పూర్ చెర్వు.. హిమాయత్‌సాగర్.. ఉస్మాన్‌సాగర్.. మంజీరా జలాశయాలకు ఇవి తరలివస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 200 జాతులకు చెందిన 70 శాతం పక్షులు ఇక్కడకు చేరుకోవడం విశేషం. ఆ ప్రాంతాలను సందర్శించే పర్యాటకులకు ఈ వలస పక్షులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

వలసలకు ప్రధాన కారణాలివే..

ఆయా దేశాల్లో అధిక ఉష్ణోగ్రతలు, శీతల వాతావరణం, మంచు ప్రభావం వల్ల ఆహారం, వసతి కష్టతరంగా మారడం తదితర కారణాలతో వేలాది కిలోమీటర్ల దూరం నుంచి నగరానికి పక్షులు వలస వస్తుంటాయి. పక్షులు వలస వచ్చే మన పర్యాటక ప్రాంతాల్లో సమశీతోష్ణ వాతావరణం ఉండటం, ఈ ప్రాంతంలో ఉన్న జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గి నీటిలో వృక్ష, జంతు ప్లవకాలు, చిన్న కీటకాలు వీటికి ఆహారంగా లభ్యమవుతున్నాయి. వీటిలో పక్షులకు అవసరమైన పోషక విలువలు మెండుగా ఉంటాయి. ఈ కారణాల రీత్యా పక్షులు వలస వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

తగ్గుతున్న వలస పక్షుల సంఖ్య..



సుదూర ప్రాంతాల నుంచి నగరానికి వలస వచ్చే రాజహంసలు, మచ్చల బాతులు, ఎర్రకాళ్ల కొంగలు, గోరింకలు, డేగలు తదితర పక్షుల జాడ ఏటేటా తగ్గుముఖం పడుతోంది. ఈ ఏడాది వీటి సంఖ్య 30–40 శాతం తగ్గుముఖం పట్టాయి. ఇటీవలి కాలంలో వీటి సహజ ఆవాసాలైన ఆయా జలాశయాలు, చెరువులు, కుంటలు కాలుష్య కాసారాలుగా మారడం, గుర్రపుడెక్క పేరుకుపోవడం, కబ్జాలకు గురవ్వడం, నగరీకరణ ప్రభావం, పర్యాటక, మానవ కార్యకలాపాలు పెరగడం, వాతావరణ, శబ్ద, వాయు కాలుష్యం మొదలైనవి వలస పక్షుల పాలిట శాపంగా మారుతోంది. ఏటా ఈ సమయానికి హిమాయత్‌సాగర్‌కు సుమారు 200 వరకు గుజరాత్ రాజహంసలు వలస వస్తాయి. ఈసారి వీటి సంఖ్య 50కి మించలేదని జంతు ప్రేమికులు చెబుతున్నారు. విభిన్న రకాల గోరింక ప్రజాతులదీ ఇదే పరిస్థితి. ఇక ఆఫ్రికా ఖండం నుంచి ఐదు వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే బార్‌హెడ్ గూస్(బాతు) జాడ కూడా ఈసారి కనిపించడం లేదు. ఆఫ్రికా నుంచే వలస వచ్చే డేగ ప్రజాతికి చెందిన పైడ్ క్రస్టెడ్ కకూ అనే పక్షి జాడ కూడా లేదు.

వలస పక్షులకు నిలయాలు ఈ ప్రాంతాలు..

ప్రాంతం	వలస పక్షుల జాతులు
కేబీఆర్ పార్క్	24
అనంతగిరి హిల్స్	37
ఫాక్స్‌సాగర్(జీడిమెట్ల)	38
అమీన్‌పూర్ చెరువు	42
హిమాయత్‌సాగర్	52
ఉస్మాన్‌సాగర్	99
మంజీరా	153

వివిధ దేశాల నుంచి పక్షులు వలస వచ్చే దూరం

దేశం	కిలోమీటర్లు
ఆఫ్రికా	5,637
సైబీరియా	5,118
యూరప్	6,721
మయన్మార్	3,497
అఫ్గానిస్తాన్	2,130
పాకిస్తాన్	1,715
గుజరాత్	1,377

నగరీకరణ, కాలుష్యమే ప్రధాన కారణం



నగరీకరణ ప్రభావం, వాతావరణ, శబ్ద, వాయు కాలుష్యాలే వలస పక్షుల పాలిటశాపంగా మారుతున్నాయి. రెండేళ్లుగా అమీన్‌పూర్ చెర్వు, ఇక్రిశాట్, మంజీరా జలాశయాల వద్ద వలస పక్షుల మనుగడను పరిరక్షించేందుకు పలు చర్యలు చేపట్టడం సంతోషకరం. ఇదే స్ఫూర్తితో ఇతర ప్రాంతాల్లోనూ వలస పక్షులకు ఆహారం, వసతి లభ్యమయ్యేలా చూడాలి.

– డాక్టర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జంతుశాస్త్ర విభాగం, ఓయూ



ప్రగతి నగర్ చెరువు వద్ద..

వలస పక్షులను అక్కున చేర్చుకోవాలంటే..



❖ సహజసిద్ధమైన జలాశయాలు, చెరువులు, కుంటలు కాలుష్యకాసారం కాకుండా కాపాడుకోవాలి. ❖ గృహ, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాల నుంచి ఆయా జలాశయాల్లోకి మురుగునీరు చేరకుండా చూడాలి. ❖ ఆయా జలాశయాల చుట్టూ పెద్ద ఎత్తున హరిత హారం చేపట్టాలి. జలాశయాలు కబ్జాల పాలు కాకుండా చూడాలి. ❖ మానవ, పర్యాటక కార్యకలాపాలను పక్షులు నివాసం ఉండే ప్రాంతాలకు చాలా దూరంలోనే పరిమితం చేయాలి. ❖ శబ్దకాలుష్యం పెరగకుండా చూడాలి. చైనీస్ మాంజాను నిషేధించాలి.

ఈ ప్రాంతాల్లో పక్షులు మాయం

పదేళ్ల క్రితం హుస్సేన్‌సాగర్‌కు విభిన్న రకాల బాతులు, వాటి ప్రజాతులకు చెందిన పక్షులు వలస వచ్చేవి. ఇప్పుడు ఈ జలాశయం కాలుష్య కాసారం కావడంతో వలస పక్షుల జాడ కనుమరుగైంది. ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, కాప్రా, రామకృష్ణాపూర్, బోయిన్‌పల్లి చెరువులదీ ఇదే దుస్థితి. ఆయా జలాశయాల్లోకి సమీప గృహ, వాణిజ్య, పారిశ్రామికవాడల నుంచి కాలుష్య, మురుగు నీరు చేరి యుట్రిఫికేషన్ చర్య జరుగుతోంది. దీంతో జలాశయాల ఉపరితలంలో గుర్రపుడెక్క మందంగా పరుచుకుంటుంది. దీంతో పక్షి జాతులకు ఆహార సేకరణ కష్టతరమై.. వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

మండలానికో ప్రభుత్వ జూనియర్ కాలేజీ

- అన్ని కాలేజీలకు భవనాలు, మౌలిక సదుపాయాలు
- 2024 డాక్యుమెంట్ రూపొందించిన ఇంటర్ విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ నిర్దేశించుకుంది. అంతేకాదు కాలేజీలన్నింటికీ పక్కా భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ రూపొందించిన 2024 డాక్యుమెంట్‌లో పలు అంశాలను పొందుపరిచింది. ప్రస్తుతం రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 500కి పైగా ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీలు తక్కువగా ఉండటంతో గ్రామీణ నిరుపేద విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కాలేజీలు లేని మండలాల్లో వాటి ఏర్పాటుకు అవసరమైన భూమి, నిధుల వివరాలను ఆ డాక్యుమెంట్‌లో పొందుపరిచింది. ప్రభుత్వ కాలేజీల్లో ఏటా 10 శాతం చొప్పున విద్యార్థుల నమోదును పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 65 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75 శాతం ఫలితాలను సాధించేలా కార్యాచరణను రూపొందించింది. అలాగే జూనియర్ కళాశాలల అభివృద్ధికి 23 రకాల అంశాలను గుర్తించి పలు ప్రతిపాదనలను సిద్ధం చేసింది.



ఇవీ డాక్యుమెంట్‌లోని ప్రధానాంశాలు

- ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్ సదుపాయం కల్పించడం.
- జిల్లా ఇంటర్ విద్యాధికారి ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ని ఏర్పాటు చేయడం.
- ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశ పెట్టడం. జీతభత్యాలను బయోమెట్రిక్‌తో అనుసంధానం చేయడం.
- విద్యార్థినుల కోసం వెయిటింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయడం.
- కాలేజీల్లో ఖాళీలు లేకుండా బోధనా సిబ్బంది నియామకం చేపట్టడం. ముఖ్యంగా ఇంగ్లిష్, గణితం లెక్చరర్లను వీలైనంత తొందరగా నియమించడం.
- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార ప్రకటనలు ఇచ్చే ప్రైవేట్ జూనియర్ కాలేజీలను నియంత్రించడం.
- ఇంటర్ పరీక్షా పత్రాన్ని విద్యార్థులకు తేలిగ్గా అర్థమయ్యేలా రూపొందించడం.
- నిపుణులైన బోధనా సిబ్బంది సహకారంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వర్చువల్ తరగతులను నిర్వహించడం.
- డిజిటల్ లైబ్రరీ, కెరీర్ గైడెన్స్, స్పెషల్ తరగతులు, పునఃశ్చరణ తరగతులను నిర్వహించడం.
- కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయడం.
- కాలేజీల భద్రత కోసం స్వీపర్, వాచ్‌మెన్, స్కావెంజర్ పోస్టులను భర్తీచేయడం.
- పరిస్థితులకు అనుగుణంగా బోధనా సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం.
- వొకేషనల్ విద్యార్థుల ఉపాధి కల్పనకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించడం.

విద్యుత్ ప్లాంట్లలో భారీ స్కాం: కోమటిరెడ్డి

కేసీఆర్ చర్చకు రావాలని సవాల్



సాక్షి, హైదరాబాద్: యాదాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటులో భారీ కుంభకోణం జరిగిందని, దీనిని ఆధారాలతో సహా నిరూపిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ కుంభకోణంపై ఎవరు చర్చకు వచ్చినా నిరూపించడానికి సిద్ధమన్నారు. ఈ కుంభకోణంలో సీఎం కేసీఆర్‌కు భాగస్వామ్యం ఉందని, స్కాం జరగలేదనే ధైర్యముంటే కేసీఆర్ చర్చకు రావాలని కోమటిరెడ్డి సవాల్ చేశారు. పవర్ లేని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో అవసరం లేదన్నారు. కుంభకోణాన్ని నిరూపించలేకుంటే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు.

మళ్లీ నో క్యాష్..!

పండుగ పూట పైసల్లేవ్.. ● ఏటీఎంల వద్ద చాంతాడంత క్యూలు

సాక్షి నెట్‌వర్క్: సంక్రాంతి పండుగకు కొత్త బట్టలు కొనాలన్నా, ఇతర సరుకులు కొనాలన్నా చేతిలో నగదు లేని పరిస్థితి నెలకొంది. ఈ నెల మొదట్లో కొంతవరకు ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉన్నా.. నాలుగైదు రోజులుగా ఖాళీగా కనిపిస్తున్నాయి. ఏ ఏటీఎం వద్దకు వెళ్లినా 'నో క్యాష్'బోర్డులు కనిపిస్తున్నాయి. చాలా చోట్ల డబ్బు లేదనేందుకు బదులుగా ఏకంగా 'ఏటీఎం ఔటాఫ్ సర్వీస్'అంటూ బోర్డులు పెట్టేస్తున్నారు. కొన్ని చోట్ల ఏటీఎం షెట్టర్లను కూడా మూసేస్తున్నారు.

బ్యాంకులకు వెళితే బోలెడు క్యూలు

ఏటీఎంలలో నగదు లభించకపోవడంతో బ్యాంకులకు వెళుతున్న వారికీ ఇబ్బందులు తప్పడం లేదు. బ్యాంకుల్లో చాంతాడంత క్యూలు ఉంటున్నాయి. గంటలు గంటలు నిలబడితేగానీ డబ్బులు తీసుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే మహిళా సంఘాల వారు, పింఛన్ల కోసం వచ్చే వారితోపాటు సాధారణ ఖాతాదారులతో బ్యాంకులు కిటకిటలాడుతుంటాయి. ఇప్పుడు నగదు కోసం వెళ్లేవారితో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల బ్యాంకుల్లో తగినంత నగదు లేదంటూ రూ. పది వేలు వరకు మాత్రమే చేతిలో పెడుతున్నారు.

కార్డులు వాడుదామంటే బాదుడు!

నగదు చేతిలో లేక ఏటీఎం/డెబిట్ కార్డులను వినియోగించుకుందామంటే బాదుడు తప్పడం లేదు. అసలు చిన్న పట్టణాలు, గ్రామాల్లో అసలు కార్డు స్వైపింగ్ యంత్రాలే అందుబాటులో లేవు. చాలా చోట్ల క్రెడిట్/డెబిట్ కార్డులతో డబ్బులు చెల్లిస్తామంటే.. 2 శాతం వరకు అదనంగా వసూలు చేస్తు న్నారు. దీంతో అటు నగదూ లేక ఇటు కార్డులూ వాడితే బాదుడు భరించలేక జనం లబోదిబోమంటున్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు?

నోట్ల కొరతతో సామాన్యులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఏటీఎంలలో డబ్బుల్లేవు. బ్యాంకుల్లో పెద్ద పెద్ద లైన్లు. ఎన్నాళ్లీ అవస్థలు భరించాలి..

– రాజు యాదవ్, కూకట్‌పల్లి డివిజన్, హైదరాబాద్

బ్యాంకుల్లో లైన్లు.. ఆన్‌లైన్‌లో మోసాలు

నోట్ల రద్దు నాటి నుంచి డబ్బుల కోసం తిప్పలు తప్పడం లేదు. ఏటీఎంలలో డబ్బుల్లేవు. బ్యాంకులకు వెళితే గంటలు గంటలు ఉండాల్సి వస్తోంది. ఆన్‌లైన్ వాడుదామంటే రోజుకో కొత్త మోసం పేరిట వార్తలు వస్తూ భయపెడుతున్నాయి..

– సత్యనారాయణ, వివేకానందనగర్ కాలనీ, హైదరాబాద్

ఆర్‌బీఐ సరఫరా నిలిపేయడంతోనే..!

సరిపడా నగదు అందుబాటులో లేకనే బ్యాంకుల్లో, ఏటీఎంలలో నగదు ఉండడం లేదని బ్యాంకుల అధికారులు చెబుతున్నారు. రిజర్వు బ్యాంకు నగదు సరఫరాను నిలిపివేయడంతోనే ఈ సమస్య ఏర్పడిందంటున్నారు. బ్యాంకుల్లోకి కొత్తగా డిపాజిట్లు రావడం తగ్గిపోయిందని, అదే సమయంలో నగదు తీసుకునేవారి సంఖ్య పెరిగిపోయిందని అంటున్నారు. ''బ్యాంకుల నిబంధనలు మారుతాయి, నష్టాలు వస్తే డబ్బులు పోతాయి.. అనే ప్రచారం ఉండటంతో ఇంతకు ముందటిలా బ్యాంకుల్లో డబ్బు డిపాజిట్ చేసేందుకు ఖాతాదారులు ముందుకు రావడం లేదు. దీంతో నగదు కొరత ఏర్పడుతోంది.'' అని ఓ బ్యాంకు అధికారి పేర్కొనడం గమనార్హం.

బ్యాంకులకు వెళ్లినా లాభమేదీ?

వరంగల్ పాత జిల్లా పరిధిలో దాదాపు 215 ఏటీఎంలు ఉండగా అందులో 90శాతం ఏటీఎంలు నగదు లేక వెలవెలబోతున్నాయి. జనం నగదు కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో 254 ఏటీఎంలు, కామారెడ్డి జిల్లాలో 120 ఏటీఎంలు ఉండగా.. చాలా వాటిలో 'నో క్యాష్'బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో నగదు కొరత తీవ్రంగా ఉంది. నాలుగైదు రోజులుగా చాలా ఏటీఎంలు పూర్తిగా మూతపడ్డాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పది రోజులుగా నగదు కొరత ఏర్పడింది. వేములవాడలో ఏటీఎంలు పనిచేయకపోవడంతో రాజన్న దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

సాయంత్రం దాటితే 'క్యాష్'లేనట్లే!

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, యాదాద్రి భువనగరి, సూర్యాపేట జిల్లాల్లో చాలా వరకు ఏటీఎంలు ఖాళీగా కనిపిస్తున్నాయి. కొన్నింటిలో నగదు నింపుతున్నా కొద్దిగంటల్లోనే ఖాళీ అవుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రమైతే ఏ ఏటీఎంలోనూ డబ్బులుండటం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో ఏటీఎంలున్నా.. వాటిలో చాలావరకు నెలలో మొదటి వారంలోనే పనిచేస్తాయి.



కొత్తగూడెంలో రైల్వే స్టేషన్ ఏటీఎం వద్ద బారులు తీరిన జనం

హైదరాబాద్‌లో కటకట

హైదరాబాద్‌లో వేలాది ఏటీఎంలున్నా నగదు కోసం కటకట తప్పడం లేదు. చార్మినార్, ఖైరతాబాద్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి.. ఇలా ఏ ప్రాంతమైనా ఇదే సీన్. ఏటీఎంలు నగదు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. 'ఔటాఫ్ సర్వీస్', 'నో క్యాష్'బోర్డులు వెక్కిరిస్తున్నాయి. కేవలం బ్యాంకులకు అనుసంధానంగా ఉన్న చోట్ల మాత్రమే ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉంది. దాంతో వాటి ముందు జనం బారులు తీరుతున్నారు. మొత్తంగా మూడు వేల ఏటీఎంలు ఉండగా.. సగానికిపైగా ఖాళీయే. మిగతా వాటిలోనూ రోజూ రూ. లక్ష, రెండు లక్షలు మాత్రమే నింపుతున్నారు. ఈ నగదు రెండు మూడు గంటల్లోనే అయిపోతోంది. చాలా మంది నగదు కోసం ఏటీఎంల చుట్టూ తిరుగుతున్నారు. నగదు చేతిలో లేకపోవడంతో బస్సు, ఆటో చార్జీలు, చిల్లర సరుకుల కొనుగోళ్లకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఎంజీబీఎస్, జేబీఎస్, సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి తదితర ప్రధాన బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల వద్ద ప్రయాణికులు నగదు కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిలో ఉన్న ఏటీఎంలు పూర్తిగా ఖాళీగా ఉంటున్నాయి.


హజ్ యాత్రకు 4,066 మంది ఎంపిక

యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం: డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది హజ్ యాత్రకు 4,066 మంది ఎంపికయ్యారని ఉప ముఖ్య మంత్రి మహమూద్ అలీ వెల్లడించారు. 2017 లో ఘనంగా ఏర్పాట్లు చేసినందుకు తెలంగాణ హజ్ కమిటీని దేశంలోనే నంబర్ వన్ కమిటీ అని కేంద్ర హజ్ కమిటీ ప్రశంసించిందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి హజ్ హౌస్‌లో 2018 సంవత్సరానికి హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకున్న యాత్రికుల ఎంపిక డ్రా పద్ధతిలో జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు ఐదారువేల మంది వెళ్లేవారని, తెలంగాణ ఏర్పాటు అయ్యాక కేవలం రాష్ట్రం నుంచే 4,500 మంది యాత్రకు వెళుతున్నారని వివరించారు. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగి ఐదువేల వరకు చేరుతుందన్నారు. కోటా పెంచాలని సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ కూడా రాయనున్నారని తెలిపారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌదీ అరేబియా ప్రభుత్వంతో కూడా మాట్లాడతామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హజ్ కమిటీ వార్షిక బడ్జెట్ కేవలం రూ. 1.50 కోట్లుండేదని, వచ్చే ఏడాది నుంచి దాన్ని రూ. 5 కోట్లకు పెంచుతామన్నారు.

31 లోపు సర్టిఫికెట్లు సమర్పించాలి

2018 హజ్ యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా 17,130 దరఖాస్తులు వచ్చాయని.. ఇందులో 70 ఏళ్లకు పైబడినవారు ప్రత్యేక కేటగిరీలో నేరుగా 508 మంది ఎంపికయ్యారని రాష్ట్ర హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ఎస్ఏ షకూర్ చెప్పారు. మిగతా 16,622 మంది యాత్రికులలో డ్రా పద్ధతిలో 3,558 మంది ఎంపికయ్యారన్నారు. డ్రాలో ఎంపికైన యాత్రికులు ఈ నెల 31 లోపు



పాస్‌పోర్టు, మెడికల్ సర్టిఫికెట్లతో పాటు హజ్ యాత్ర తొలి కిస్తు రూ. 81 వేల డీడీని కూడా హజ్ కమిటీకి జమ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు ఏకే ఖాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, మైనార్టీ కమిషన్ చైర్మన్ ఖమ్రుద్దీన్, ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టండి: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నత విద్యా మండలికి గవర్నర్ నరసింహన్ సూచించారు. గురువారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్లు లింబాద్రి, వెంకట రమణ, కార్యదర్శి శ్రీనివాసరావు ఆయన్ను కలసి కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. 'ఛేంజింగ్ ప్యారడైమ్స్ ఇన్ మార్కెటింగ్ ఆఫ్ సర్వీసెస్ విత్ స్పెషల్ ఫోకస్ ఆన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ' పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం తాము చేపట్టిన కార్యక్రమాలను తెలిపారు. ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తూ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.


✦ బయ్యారం స్టీల్ ప్లాంట్‌పై కదలిక!

క్షేత్ర స్థాయిలో కేంద్ర బృందం పర్యటన

సాక్షి, హైదరాబాద్: విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కొత్తగూడెం జిల్లా బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు దిశగా ముందడుగు పడుతోంది. ఈ విషయమై కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఒత్తిడి ఫలిస్తోంది. కేంద్ర ఉక్కు శాఖ నియమించిన 'మికాన్ కన్సల్టెన్సీ'బృందం ఈ నెల 9న బయ్యారం, ఉల్వనూరు, అనిసెట్టిపల్లిలో పర్యటించి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. స్థానికంగా భూమి, విద్యుత్, నీటి లభ్యత తదితర అంశాలపై పరిశీలించింది. రెవెన్యూ, విద్యుత్, నీటిపారుదల, ఇతర శాఖల అధికారుల నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించింది. కర్మాగారం ఏర్పాటుకు 1,500–2,000 ఎకరాల భూమి కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రెవెన్యూ శాఖ ఈ బృందానికి నివేదించింది. ఈ మూడు ప్రాంతాల్లో కర్మాగారం ఎక్కడ ఏర్పాటైనా అవసరమైన 200 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు అవసరమైన వ్యవస్థ ఇప్పటికే అందుబాటులో ఉందని విద్యుత్ శాఖ తెలిపింది. ఈ నెల చివరి వారంలో రాష్ట్ర గనుల శాఖ అధికారులతో 'మికాన్'బృందం మరోసారి సమావేశం కానుంది. ఉల్వనూరు, అనిసెట్టిపల్లి, బయ్యారం ప్రాంతాల్లో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ఉన్న అనుకూల, ప్రతికూలతలను విశ్లేషిస్తూ ఈ నెలాఖరులోగా కేంద్ర ఉక్కు శాఖకు ఈ బృందం నివేదిక సమర్పించనుంది. దీని ఆధారంగా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రం తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముంది.

✦ చెన్నారెడ్డి జయంతి ఉత్సవాలకు మన్మోహన్

మాజీ గవర్నర్ రోశయ్య వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ హాజరవుతారని మాజీ గవర్నర్ కె.రోశయ్య గురువారం వెల్లడించారు. చెన్నారెడ్డి ఏ ఒక్క ప్రాంతానికో, వర్గానికో పరిమితమైన నాయకుడు కాదన్నారు. సమర్థత, వ్యూహం, నైపుణ్యం, పాలనా దక్షతతో దేశవ్యాప్తంగా పేరొందిన నేత అని కొనియాడారు. శతజయంతి ఉత్సవాలు శనివారం నుంచి ఏడాది పొడుగునా జరుగుతాయని తెలిపారు. వీటిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

✦ 'ఒక కుటుంబం చేతిలో తెలంగాణ బందీ'



ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అందెశ్రీ, చెరుకు సుధాకర్

హైదరాబాద్: కోట్లాది మంది ఒక కుటుంబంలా ఉద్యమించి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఒక నాయకుడి కుటుంబం చేతిలో పెట్టామని ప్రజాకవి, గాయకుడు అందెశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం వస్తే కాపలా కుక్కలా ఉంటానన్న నాయకుడు ప్రజలను కుక్కలుగా చేసి పాలిస్తున్నారని పరోక్షంగా సీఎం కె.చంద్రశేఖర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఇక్కడ 'తెలంగాణ సాంస్కృతిక సైన్యం' ఆవిర్భావ సభ పోస్టర్‌ను తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్, ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావుతో కలసి ఆయన ఆవిష్కరించారు. పార్టీకి అనుబంధంగా ఈ నెల 21న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాంస్కృతిక సైన్యం ఆవిర్భవించనుంది. 'తెలంగాణ మట్టి చాలామంది లెక్కలు తేల్చింది. నిజాం పైజామా ఊడగొట్టింది, గడీలకు అగ్గి పెట్టింది. రాచరికాన్ని మట్టిలో కలిపింది. త్వరలోనే ఈ ప్రభుత్వ లెక్కలను సైతం తేలుస్తుంది'అని అందెశ్రీ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సాంస్కృతిక సైన్యం ఇన్‌చార్జ్ గుండమల్ల శ్రీనివాస్, కవి, రచయిత విష్ణు, సందీప్, కృష్ణమాదిగ తదితరులు పాల్గొన్నారు.

✦ ఆరు నెలల్లోనే ఎత్తిపోతల పనులు

ఐడీసీ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం: ఈద శంకర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇకపై ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) ఆధ్వర్యంలో చేపట్టే ఎత్తిపోతల పథకాలను ఆరు నెలల్లోనే పూర్తి చేయాలని ఐడీసీ బోర్డు కీలక నిర్ణయం చేసింది. భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులను ప్రభుత్వం గరిష్టంగా రెండేళ్లు, కనిష్టంగా ఏడాదిలో పూర్తి చేస్తున్న నేపథ్యంలో చిన్న ఎత్తిపోతల పథకాల పనులను ఏళ్లకు ఏళ్లు కొనసాగించడం భావ్యం కాదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇకపై ఎలాంటి కొత్త ఎత్తిపోతల పథకం చేపట్టినా టెండర్ నోటిఫికేషన్‌లో ఆర్నెల్ల గడువునే పేర్కొనాలని, సరైన కారణాలుంటే తప్ప గడువు పొడిగింపు ఇవ్వొద్దని తీర్మానించింది. గురువారం ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అధ్యక్షతన బోర్డు సమావేశం సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఈఎన్‌సీ మురళీధర్, ఐడీసీ ఎండీ సురేశ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శంకర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. ప్రస్తుత ఎత్తిపోతల పథకాల కింద 1.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరంది స్తున్నామని, అదనంగా యాసంగిలో మరో 30 వేల ఎకరాలకు నీరిస్తామన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి మొత్తంగా 2 లక్షల ఎకరాలకు నీరిచ్చే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో రూ.257 కోట్లతో 6 పథకాలు, ధర్మపురి నియోజకవర్గంలో రూ.88.70 కోట్లతో 3 పథకాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చామన్నారు.

✦ మార్చి 11న అంబేడ్కర్ వర్సిటీ అర్హత పరీక్ష

హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన అర్హత పరీక్ష–2018 నోటిఫికేషన్‌ను వర్సిటీ గురువారం విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో మార్చి 11న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. అభ్యర్థులు వచ్చే నెల 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. డిగ్రీలో ప్రవేశానికి కనీస విద్యార్హత లేని అభ్యర్థులు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న తర్వాత డెబిట్, క్రెడిట్ కార్డు లేదా టీఎస్, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో ఫీజు చెల్లించవచ్చని సూచించింది. వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

✦ టీఆర్టీ ఎడిట్ ఆప్షన్ గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తుల్లోని పొరపాట్లను సరిచేసుకునేందుకు ఇచ్చిన టీఆర్టీ ఎడిట్ ఆప్షన్ గడువును 15 వరకు పొడిగించినట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

✦ ఫిబ్రవరి 16 నుంచి డీఎడ్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) ద్వితీయ సంవత్సర పరీక్షలు ఫిబ్రవరి 16న ప్రారంభమవుతాయని పరీక్షల విభాగం వెల్లడించింది. 16, 17, 19, 20, 21, 22 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొంది.

✦ ఈ నెల 30 నుంచి టీసీసీ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. 1వ తేదీ వరకు టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్, 2వ తేదీ వరకు డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఉంటాయని పేర్కొంది.

✦ టీచర్స్ ఫెడరేషన్ డైరీ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) డైరీని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ గురువారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

✦ 'అవకతవకలు లేకుండా కాంటాక్టు ప్రోగ్రాం'

సాక్షి, హైదరాబాద్: నేటి (12వ తేదీ) నుంచి జరగనున్న దూర విద్య డీఎడ్ పర్సనల్ కాంటాక్టు ప్రోగ్రాంను అవకతవకలకు తావులేకుండా సమర్థంగా నిర్వహించాలని పాఠశాల విద్య కమిషనర్ కిషన్ సూచించారు. టీచర్ల హాజరు పక్కాగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

విద్యుత్ భారం తగ్గినట్లే!

ఎత్తిపోతల పథకాల కరెంటు చార్జీలు తగ్గించాలని ఈఆర్సీని కోరిన డిస్కంలు

- యూనిట్ ధరను రూ.6.40 నుంచి రూ. 4.88కి కుదించాలని ప్రతిపాదన
- ఈఆర్సీ ఒప్పుకుంటే 19 లిఫ్టులపై 3,284 కోట్లు తగ్గనున్న చార్జీల వ్యయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగునీటి ఎత్తిపోతల పథకాలకు సరఫరా చేసే విద్యుత్ చార్జీలను తగ్గించాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)ని కోరాయి. ప్రస్తుతం రూ. 6.40గా ఉన్న యూనిట్ చార్జీని రూ. 4.88కు తగ్గించాలని ప్రతిపాదించాయి. ఈ అంశంపై ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు డిస్కంలు గత వారం ఈఆర్సీకి విన్నవించాయి. మార్చిలోగా ఈ సిఫారసులను ఈఆర్సీ ఆమోదించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తయితే వాటి నిర్వహణకు ఏటా దాదాపు 12 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం కానుండగా వాటికి ప్రస్తుత చార్జీలే వర్తిస్తే రూ. 13,824 కోట్ల వ్యయం కానుంది. ఒకవేళ చార్జీల తగ్గింపునకు ఈఆర్సీ అనుమతిస్తే చార్జీల వ్యయం ఏకంగా రూ. 3,284 కోట్లు తగ్గి రూ. 10,540 కోట్లకే విద్యుత్ చార్జీల భారం పరిమితం కానుంది.

ఏటా పెరుగుతున్న వినియోగం..

రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తయిన/కొనసాగుతున్న 19 ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా 58.78 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును అందుబాటులోకి తేవడంతో పాటు మరో 8.45 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మొత్తం ఎత్తిపోతల పథకాలు నిర్వహణలోకి వస్తే 11,495 మెగావాట్ల మేర విద్యుత్ అవసరం కానుంది. అయితే ప్రస్తుతం అలీసాగర్, గుత్పా, ఉదయ సముద్రం, దేవాదుల, ఎల్లంపల్లి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల ద్వారా నిర్దేశిత ఆయకట్టుకు నీటి సరఫరా జరుగుతోంది. నీటిని తీసుకునే సామర్థ్యాన్ని బట్టి ఒక్కో ప్రాజెక్టు పరిధిలో పంపు మోటార్లు, వాటికి అనుగుణంగా విద్యుత్ అవసరాలను గుర్తించారు. ప్రస్తుతం 14 ఎత్తిపోతల పథకాలు పని చేస్తుండగా వీటికై 1,359 మెగావాట్ల మేర విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఈ వినియోగం ఈ ఏడాది జూన్–జులై నాటికి 3,331 మెగావాట్లకు పెరగనుండగా 2018–19కల్లా 5,869 మెగావాట్లకు, 2019–20కల్లా 8,369 మెగావాట్లకు, 2020–21కల్లా 10,089, 2021–22కల్లా 11,495 మెగావాట్లకు పెరగనుంది. విద్యుత్ అవసరం పెరుగుతుండటం, దానికి తగట్లే యూనిట్‌కు రూ. 6.40పైసల మేర చెల్లించాల్సి ఉండటంతో నీటిపారుదలశాఖపై విద్యుత్ భారం పెరగనుంది. ఈ నేపథ్యంలో యూనిట్‌పై వసూలు చేస్తున్న చార్జీని రూ. 4.50 పైసలకు తగ్గించాలని డిస్కంలను కోరింది. అయితే దీనిపై ఈఆర్సీ నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో డిస్కంలు ఈ మేరకు ఈఆర్సీ ముందు ప్రతిపాదనలు పెట్టాయి. యూనిట్ చార్జీ తగ్గింపు అవసరాన్ని ఈఆర్సీ ముందు బలంగా వాదించేందుకు నీటిపారుదలశాఖ ప్రత్యేకంగా ఓ కన్సల్టెంట్‌ను సైతం నియమిస్తోంది. దీనికితోడు తగ్గింపు అంశంపై ఈఆర్సీ ముందు తొలిసారి పిటిషన్ కూడా దాఖలు చేయనుంది. సాధారణంగా డిస్కంలు చేసిన ప్రతిపాదనలను ఈఆర్సీ యథావిధిగా ఆమోదిస్తుందని, ఆ దృష్ట్యా ప్రస్తుత చార్జీల తగ్గింపు ప్రతిపాదన సైతం ఆమోదం పొందుతుందని విద్యుత్‌శాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఎత్తిపోతలపై విద్యుత్ వినియోగం, ఖర్చు ఇలా..

ప్రస్తుతం వరకు జరుగుతున్న వినియోగం:	1,359 మెగావాట్లు
యూనిట్‌కు రూ.6.40 చొప్పున అవుతున్న ఖర్చు:	1,565.57 కోట్లు
యూనిట్ చార్జీని రూ. 4.88కి తగ్గిస్తే అయ్యే ఖర్చు:	1,193.75 కోట్లు
ఎత్తిపోతల పథకాలపై తగ్గే భారం:	371.82 కోట్లు
ఈ ఏడాదికి అవసరమయ్యే విద్యుత్:	3,331 మెగావాట్లు
యూనిట్ చార్జీని ఈఆర్సీ తగ్గిస్తే నీటిపారుదలశాఖపై తగ్గే భారం:	911.36 కోట్లు

ఎత్తిపోతల పథకాల వివరాలు

మొత్తం ఎత్తిపోతల పథకాలు:	19
పరిపాలనా అనుమతుల విలువ:	1.74 లక్షల కోట్లు
అవసరమైన విద్యుత్:	11,495 మెగావాట్లు
ఆయకట్టు లక్ష్యం:	58.78 లక్షల ఎకరాలు
నీటి వినియోగం:	425.54 టీఎంసీలు

ప్రధాన ప్రాజెక్టుల పరిధిలో విద్యుత్ అవసరాలు (మెగావాట్లలో)

కాళేశ్వరం	4,627	నెట్టెంపాడు	119
పాలమూరు–రంగారెడ్డి	4,705	కల్వకుర్తి	450
సీతారామ	368	కోయిల్‌సాగర్	3
అలీసాగర్	25.48	ఏఎంఆర్‌పీ	116
గుత్పా	18	ఏఎంఆర్‌పీ–ఎల్ఎల్‌సీ	12
చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి	5.14	ఉదయ సముద్రం	32
భీమా	96	దేవాదుల	484

ఏపీకి తరలిపోయిన 'రైల్ నీర్'

- హైదరాబాద్‌లో ఏర్పాటుకు 2012లోనే సన్నాహాలు
- సరైన ప్రోత్సాహం లేక జాప్యం
- రోజుకు లక్ష లీటర్ల మంచినీటి శుద్ధి
- 10 వేల మందికి ఉపాధి
- ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికులకు అతి తక్కువ ధరల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందజేయాలన్న లక్ష్యంతో రూపొందిన రైల్ నీర్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోయింది. ఐదువేల మందికి ప్రత్యక్షంగా, మరో ఐదువేల మందికి పరోక్షంగా ఉపాధినివ్వగలిగే ఈ ప్రాజెక్టును హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు 2012లోనే సన్నాహాలు మొదలయ్యాయి. ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో రూ. 50 కోట్లకు పైగా అంచనాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇప్పటివరకూ భూమిని, వనరులను కేటాయించలేదు. దాంతో ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టు ఏపీకి తరలి వెళ్లింది. నూజివీడు దగ్గర దీన్ని నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం ఐఆర్‌సీటీసీకి ఎకరం భూమిని కేటాయించింది. దీంతో నగరంలో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టుపై ఆశలు వదులుకున్నట్టే అయింది.

ఇప్పటికైనా స్థలమిస్తే..

ఇటీవల రైల్ నిలయంలో జరిగిన సమావేశంలోనూ పలువురు ఎంపీలు రైల్ నీర్ ప్రాజెక్టును నిర్మించాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. ఈ అంశంపై రైల్వేబోర్డు సమావేశంలో చర్చించనున్నట్లు జీఎం స్పష్టం చేశారు. ఇప్పటికై నా రాష్ట్ర ప్రభుత్వం భూమిని, ఇతర వసరులను సమకూరిస్తే హైదరాబాద్‌లో మరో ప్రాజెక్టును నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని ఐఆర్‌సీటీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

స్వచ్ఛమైన మంచినీరే లక్ష్యం..

నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లు, 26 ఎంఎంటీఎస్ స్టేషన్ల నుంచి రోజూ 5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. నిత్యం వందలాది రైళ్లు నడుస్తాయి. దక్షిణమధ్య రైల్వేలోనే సికింద్రాబాద్ అతిపెద్ద రైల్వేస్టేషన్. ఇలాంటి పెద్ద స్టేషన్‌లో కూడా ప్రయాణికులకు తాగునీటిని అందజేసేందుకు రైల్వేకు ఎలాంటి సొంత ఏర్పాట్లూ లేవు. దీంతో ప్రయాణికులు అధిక ధర వెచ్చించి ప్రైవేటు మినరల్ వాటర్‌నే కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఈ క్రమంలో ప్రయాణికులకు తక్కువ ధరలో మినరల్ వాటర్‌ను అందజేసే ఉద్దేశంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఐఆర్‌సీటీసీ ముందుకొచ్చింది. రోజుకు లక్ష లీటర్ల మంచినీటిని శుద్ధి చేసే ప్లాంటు ఏర్పాటు చేస్తామని 2012లోనే అప్పటి ఉమ్మడి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది.

ఫ్యాబ్ సిటీ వద్ద ఏర్పాటుకు ప్రతిపాదన

ఫ్యాబ్ సిటీ వద్ద 4 ఎకరాల స్థలం ఇవ్వడంతో పాటు మంచినీటి పైపులైన్ కూడా ఏర్పాటు చేయాలని ఐఆర్‌సీటీసీ కోరింది. దీనికి అప్పటి ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. కానీ ఆ తరువాత తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు వెనక్కు వెళ్లింది. ఫ్యాబ్ సిటీ వద్ద ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తే రోజుకు అక్కడి నుంచి రైల్వే స్టేషన్లకు, రైళ్లకు వాటర్ బాటిళ్లను సరఫరా చేసేందుకు రవాణా వ్యవస్థ, సిబ్బంది అవసరమయ్యేవారు. వాటర్ బాటిళ్ల విక్రయంపైనా పలువురు ఉపాధి పొందే అవకాశం ఉండేది. ఈ ప్రాజెక్టును పలుమార్లు రైల్వే బడ్జెట్‌లో కూడా ప్రతిపాదించారు. కానీ దక్షిణమధ్య రైల్వే ఉదాసీనత, ప్రభుత్వ నిర్లక్ష్యం, మౌలిక సదుపాయాల లేమి తదితర కారణాల రీత్యా ఆ ప్రాజెక్టు ఏపీకి వెళ్లిపోయింది.

గుట్కాపై నిషేధం పొడిగింపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గుట్కా, పాన్ మసాలా అమ్మకంపై నిషేధాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆహార భద్రత కమిషనర్ శాంతికుమారి ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ శంకర్ ఈ ప్రకటన విడుదల చేశారు. నికొటిన్, పొగాకు ఆనవాళ్లు ఉండి, నోటి ద్వారా తీసుకునే అన్ని ఉత్పత్తులపైనా నిషేధం విధించినట్లు తెలిపారు. గుట్కా, పాన్‌మసాలా అమ్మకాలపై 2013 జనవరి 9 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధిస్తోంది. ప్రతిఏటా కొత్తగా ఉత్తర్వులు జారీ చేస్తోంది. గత ఏడాది జారీచేసిన ఉత్తర్వు గడువు బుధవారంతో ముగిసింది. కాగా, నిషేధం కొనసాగింపుపై పునరాలోచించాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ గత నెలలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. గురువారం జారీచేసిన ఉత్తర్వులతో ఈ అస్పష్టతకు తెరపడింది.

28 పార్టీలతో బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్

అధ్యక్షుడిగా నల్లా సూర్యప్రకాశ్, కన్వీనర్‌గా తమ్మినేని



సూర్యప్రకాశ్



తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: రాజ్యాధికారమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు అంకురార్పణ జరిగింది. ఈ నెల 25న 28 పార్టీలతో కలసి బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రారంభం కానుంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీ చేయాలని లెఫ్ట్, బహుజన నేతలు నిర్ణయించారు. హైదరాబాద్‌లో 25న భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసి ఈ వేదికను ప్రకటించనున్నారు. బహిరంగ సభకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్, ఎంసీపీఐ (యూ) జాతీయ నేత ఎం.డి.గౌస్ హాజరు కానున్నారు. గురువారం హైదరాబాద్‌లో ప్రత్యామ్నాయ రాజకీయ ఫ్రంట్ ఏర్పాటుపై సన్నాహక సమావేశం జరిగింది. ప్రొఫెసర్ కంచ ఐలయ్య, కాకి మాధవరావు, పి.ఎల్. విశ్వేశ్వరరావు, సాంబ శివరావు, గద్దర్, పటేల్ వనిత, మాజిదుల్లా ఖాన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. బీఎల్ఎఫ్ అధ్యక్షుడిగా నల్లా సూర్యప్రకాశ్, కన్వీనర్‌గా తమ్మినేని వీరభద్రం నియమితులయ్యారు.

పూలే, అంబేడ్కర్ ఆలోచనలతో..

పూలే–అంబేడ్కర్–మార్క్స్ ఆలోచనల మేళవింపుతో ఫ్రంట్‌కు రూపకల్పన చేశామని తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇప్పుడున్న రాజకీయాలకు ప్రత్యామ్నాయంగానే బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్ రూపుదిద్దుకుందన్నారు. ఫ్రంట్‌లో ఇప్పుడున్న 28 పార్టీలతో పాటు సీపీఐ, న్యూడెమోక్రసీతో పాటు ఇతర వామపక్ష పార్టీలను కూడా చేరాలని ఆహ్వానిస్తున్నామని తమ్మినేని తెలిపారు.

ఖాయిలా పరిశ్రమలకు చేయూతనివ్వండి

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఖాయిలా పడిన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమ (ఎంఎస్ఈ)ల పునరుద్ధరణకు బ్యాంకర్లు ముందుకు రావాలని పరిశ్రమల శాఖ మంత్రి కె. తారకరామారావు పిలుపునిచ్చారు. ట్రిపుల్ ఆర్ (రెక్టిఫికేషన్, రీస్ట్రక్చరింగ్, రికవరీ) సూత్రాన్ని అమలు చేసి ఎంఎస్ఈలకు చేయూతనివ్వాలని కోరారు. పరిశ్రమల సమస్యలు గుర్తించి, పరిష్కారం చూపి.. రుణాలు పునరుద్ధరించి తమ రుణాలు రికవరీ చేసుకోవాలని సూచించారు. తక్కువ మొత్తంలోని రుణాలను పునరుద్ధరిస్తే అనేక చిన్న తరహా పరిశ్రమలు తిరిగి కార్యకలాపాలు ప్రారంభిస్తాయన్నారు. గురువారం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ)తో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. ఎంఎస్ఈల సమస్యలు తెలుసుకోడానికి లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రతి నెలా జిల్లా కేంద్రాల్లో టౌన్ హాల్ సమావేశాలు ఏర్పాటు చేయాలని భేటీలో నిర్ణయించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలతో ముందుకు పోతోందని.. వాటికి సాయం అందించేందుకు ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో బ్యాంకర్లు భాగస్వాములు కావాలన్నారు.

నేతన్నకు ముద్ర రుణాలివ్వండి..

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధిలో బ్యాంకుల సహకారాన్ని గుర్తిస్తున్నామన్న మంత్రి.. రుణాలు, బకాయిలు చెల్లించడంలో ఆలస్యమైతే మొండి బకాయిల జాబితాలో చేర్చకుండా కొంత సమయమివ్వాలన్నారు. వృత్తుల ఆధారిత పారిశ్రామిక క్లస్టర్లలోని యూనిట్లకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని.. మహిళా పెట్టుబడిదారులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. రాష్ట్రంలోని నేతన్నలకు ముద్ర రుణాలివ్వాలన్నారు.

పరిశ్రమలకు ప్రోత్సాహకాలు..

గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, గ్రామాల్లో పరిశ్రమలు నెలకొల్పే వారికి అదనపు ప్రోత్సాహకాలు ఇస్తామని కేటీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పరిశ్రమల స్థాపనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, అలాగే అన్ని జిల్లాల్లో పరిశ్రమలను స్థాపించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా సీఐఐ దృష్టి పెట్టాలని కోరారు. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) రూపొందించిన 'వరంగల్ విజన్ డాక్యుమెంట్ 2028'ను మంత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం సీఐఐని విలువైన భాగస్వామిగా భావిస్తోందని కేటీఆర్ అన్నారు. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సీఐఐ తెలంగాణ చైర్మన్ వి.రాజన్న చెప్పారు.

మీ సీఎం బాగా పనిచేస్తున్నారా?

ప్రజాభిప్రాయ సేకరణలో అధికార టీఆర్ఎస్

- ముందస్తు ఎన్నికల నేపథ్యంలో కసరత్తు
- వేరే పార్టీ సీఎం అయితే ఇంత అభివృద్ధి జరిగేదా?
- టీఆర్ఎస్ వల్లే ఇంత అభివృద్ధి జరిగిందని భావిస్తున్నారా?
- మూడు శాతం ఓటర్లు శాంపిల్‌గా.. ఎనిమిది అంశాలపై సర్వే



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ బాగా పనిచేస్తున్నారా.. అసలు ప్రభుత్వ పాలనపై మీ అభిప్రాయం ఏమిటి.. సీఎం స్థానంలో కేసీఆర్ కాకుండా వేరే వారుంటే అతి తక్కువ కాలంలోనే ఇంత అభివృద్ధి జరిగేదని అనుకుంటున్నారా.. టీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరు ఎలా ఉంది.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి ఓటేస్తారు..?.. ఈ ప్రశ్నలేమిటో తెలుసా.. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడానికి అధికార టీఆర్ఎస్ స్వయంగా చేపట్టిన సర్వే ఇది. నవంబర్‌లోనే ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశముందన్న అంచనాల నేపథ్యంలో పార్టీ, ఎమ్మెల్యేలు, ఎంపీల పరిస్థితిని తెలుసుకునేందుకు... కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల పట్ల ప్రజల అభిప్రాయాన్ని సేకరించేందుకు ఈ సర్వే మొదలుపెట్టినట్లు టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో శరవేగంగా ఈ సర్వే జరుగుతున్నట్లు పేర్కొంటున్నాయి.

మూడు శాతం ఓటర్లు శాంపిల్‌గా..

ఒక్కో నియోజకవర్గంలోని ఓట్లలో 3 శాతం ఓటర్లను శాంపిల్‌గా తీసుకుని సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజల్లో జరుగుతున్న చర్చ, ఇది వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఎలా ఉపయోగపడుతుందనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఎన్నికలకు సంసిద్ధమవడంలో భాగంగా టికెట్ల ఖరారు మార్పులు, చేర్పులకు ఈ సర్వే ఫలితాలను ఉపయోగించుకునే అవకాశముందని టీఆర్ఎస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గత సర్వేలకు భిన్నంగా..

ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును మదింపు చేసేందుకు, నియోజకవర్గాల్లో లోటుపాట్లను సరిదిద్దేందుకు గతంలోనే మూడు సర్వేలు చేయించారు. రెండు సర్వేల ఫలితాలను ఆయా ఎమ్మెల్యేలు, ఎంపీలకు అందించారు. వారి పనితీరుకు ర్యాంకులు కూడా ఇచ్చారు. అయితే ఈసారి అలా కాకుండా.. మొత్తంగా పార్టీ విషయంలో, వ్యక్తిగతంగా సీఎంపై, ఎమ్మెల్యేలపై జనాభిప్రాయం ఎలా ఉందో తెలుసుకోవాలని... వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీని, ఎవరి నాయకత్వాన్ని కోరుకుంటున్నారనే దానిపై సర్వే చేపడుతున్నట్లు తెలిసింది. ఇలాంటి సర్వేలు మరికొన్ని జరిగే అవకాశాలున్నా.. ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చేందుకు, ప్రాథమ్యాలను నిర్ణయించుకునేందుకు ఈ సర్వే ఉపయోగపడేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం.

ఎనిమిది అంశాలతో..

రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ తక్కువ సమయంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టి బాగా అమలు చేస్తున్నారని భావిస్తున్నారా, ఒకవేళ వేరే పార్టీ సీఎం ఉండుంటే ఇంత తక్కువ సమయంలో ఇన్ని కార్యక్రమాలు జరిగేవని భావిస్తున్నారా, మళ్లీ టీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారా, తదుపరి సీఎంగా ఎవరిని కోరుకుంటున్నారు, మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది, ప్రస్తుత ఎమ్మెల్యేనే మళ్లీ ఎన్నుకోదలిచారా, ఒకవేళ ఇప్పుడు అసెంబ్లీకి ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి ఓటేస్తారు, పార్లమెంటు స్థానానికి ఏ పార్టీకి ఓటేస్తారు.. వంటి ఎనిమిది అంశాలపై ప్రధానంగా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నట్లు సమాచారం.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం, 12-1-2018



క్రాంతిభవ
యంగ్ ఐ.ఏ.ఎస్.
క్రాంతిరెడ్డి ఇంటర్వ్యూ
- పక్క పేజీలో



ఇంటికో ఫుట్‌బాల్

ఆడపిల్లలకు ఫుట్‌బాల్ ఏంటీ అంది ఆ ఊరు.
ఇప్పుడా ఊరే ఫుట్‌బాల్ గ్రౌండ్ అయింది!
ఒకప్పుడు అడ్రస్ లేకుండా ఉన్న అలఖ్‌పురా..
ఇప్పుడు ఫుట్‌బాల్ ఆడే అమ్మాయిల ఊరైంది!

కటక్‌లోని ఒడిశా పోలీస్ గ్రౌండ్స్‌లో కేరళ జట్టును ఓడించిన అలఖ్‌పురా జట్టు (తెల్ల డ్రెస్) : ఫైల్ ఫొటో

దాదాపు పదేళ్ల కిందట. హర్యానాలోని భివాని జిల్లా, అలఖ్‌పురా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల. పీఈటీ సర్ గోర్ధన్ దాస్.. గ్రౌండ్‌లో అబ్బాయిలకు కబడ్డీ నేర్పిస్తూ.. ఆడిస్తూ ఉండేవాడు. ఓ రోజు అదే స్కూల్ అమ్మాయిలు ''ఓ మాస్టర్.. మేం కూడా ఆటలు ఆడుతాం.. మాకూ నేర్పించండి'' అంటూ వెంటబడ్డారు. అలా ప్రతిరోజూ పడుతూనే ఉన్నారు. చివరికి వాళ్ల పోరు పడలేక ఎలాగైనా ఆటలంటే వాళ్లలో విముఖత తేవాలని ఒకరోజు స్పోర్ట్స్‌రూమ్‌లో పడి ఉన్న ఫుట్‌బాల్‌ను ఇచ్చాడు కోచ్... 'ఇదిగో.. ఆడుకోండి' అని!



పీఈటీ గోర్ధన్ దాస్

ప్రతి రోజూ స్కూల్ అయిపోయాక ఓ ఇరవైమంది అమ్మాయిలు గ్రౌండ్‌లో ఆ ఫుట్‌బాల్‌ను తన్నడం మొదలుపెట్టారు. ఓ వారంరోజుల్లో యాభైమందికి చేరింది ఆ సంఖ్య. వాళ్లలో వాళ్లే జట్లుజట్లుగా విడిపోయి, వంతుల వారీగా.. కొంతమంది ఆ బాల్‌ను తన్నుతుంటే.. ఇంకొంత మంది ఆ బాల్‌ను ఆపే ప్రయత్నం చేసేవారు. ఓ రోజు వాళ్ల ఆటతీరును గమనించాడు పీఈటీ సర్. ఆ లాఘవం, బాల్‌ను ఆపే టెక్నిక్ చూసి ఆశ్చర్యపోయాడు. వాళ్లను నిరుత్సాహపర్చాలనే తన ఆలోచనకు తానే సిగ్గుపడ్డాడు. శిక్షణ ఇస్తే అద్భుతమైన క్రీడాకారిణులవుతారు అనుకున్నాడు. వెంటనే కోచింగ్ మొదలుపెట్టేశాడు కూడా!

ఊరు తిరగబడింది!

కోచింగ్‌తో కొద్దికాలంలోనే అమ్మాయిలంతా మెరికల్లా తయారయ్యారు. టోర్నీలకూ పంపాలని నిశ్చయించుకున్నాడు గోర్ధన్ దాస్. అప్పుడు వచ్చింది ఊరి నుంచి నిరసన వెల్లువ! ''ఏం మాస్టర్? ఏం చేస్తున్నావ్? మగపిల్లల మీద దృష్టిపెట్టు. ఆడపిల్లల మీద కాదు. వాళ్లను బడికి పంపడమే ఎక్కువ అంటే ఫుట్‌బాల్ ఆటలు కూడానా? ఇవన్నీ నడవ్. నీ తీరు ఇలాగే ఉంటే ఉద్యోగం మానుకోవాల్సి వస్తుంది జాగ్రత్త'' అని హెచ్చరించారు. ఆ మాస్టర్ భయపడలేదు. ''ఈ పిల్లల్లో నా కూతురూ ఉంది. ఆటలు అందరికీ అవసరం. అవి ప్రాక్టికల్ పాఠాలు. ఆడనివ్వండి. దీనివల్ల ట్రోఫీలే కాదు.. స్కాలర్‌షిప్స్ కూడా వస్తాయి. అప్పుడు మీరు అమ్మాయిల చదువును భారం అనుకోవాల్సిన అవసరమూ ఉండదు. స్పోర్ట్స్‌కోటాలో ఉద్యోగాలూ వస్తాయి..'' అంటూ రెండు చేతులతో దండం పెట్టాడు. ఇలాంటి ప్రాధేయతలు అనేకం అయ్యాక ఊరు కాస్త నెమ్మదించింది. తర్వాత ఈ టీమ్ టోర్నీలకు వెళ్లి, ట్రోఫీలు తెచ్చింది! ఆ తర్వాత దాదాపు పన్నెండు మంది అమ్మాయిలను ఇంటర్నేషనల్ లెవెల్‌లో జరిగే పోటీలకు పంపాడు కోచ్!

మా నాన్న మారాడు

''ఆటలంటే ఇష్టం. అబ్బాయిల్లాగే మేమూ ఆడాలి. మాస్టర్ ఇచ్చిన ఫుట్‌బాల్‌ను కసిగా తన్నేవాళ్లం. మొదట్లో అసలు ఏ లక్ష్యమూ ఉండేది కాదు. కాని తర్వాత తర్వాత ఈ ఆటలో ఉన్న గొప్పతనం తెలిసింది. ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాం. ఇప్పుడైతే ఒకటే లక్ష్యం.. మా ఊరి కోసం, ఈ దేశం కోసం ఏదైనా చేయాలని. ఫుట్‌బాల్‌లో మన దేశం పేరు ప్రపంచం వినేలా చేయాలని. నేనిప్పుడు డిగ్రీ చదువుతున్నాను. ఈ ఆటతో స్పోర్ట్స్ కోటాలో జాబ్ తెచ్చుకోవాలని అనుకోవట్లేదు. ప్లేయర్‌గానే ఉండాలనుకుంటున్నాను. ఫుట్‌బాల్ తప్ప నా జీవితంలో నాకేదీ ఇంపార్టెంట్ కాదు'' అంటుంది పూనమ్ శర్మ. ఏషియన్ ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (ఏఎఫ్‌సీ)లో రెండుసార్లు పాల్గొంది పూనమ్. ''ఈ పదేళ్లలో మా ఊళ్లో, మా జీవితాల్లో చాలా మార్పు వచ్చింది. దీనికి మా ఇల్లే ఎగ్జాంపుల్. మేం ముగ్గురం అక్కచెల్లెళ్లం.. మాకొక తమ్ముడు. మా నాన్న మా ఇంటికి ఎవరు వచ్చినా.. ఆయన ఎక్కడికి వెళ్లినా.. 'నలుగురు ఆడపిల్లలు.. ఏం చేయను?' అని బాధపడేవారు. కాని ఇప్పుడు.. 'నలుగురు ఆడపిల్లలు' అని గర్వంగా చెప్పుకుంటున్నాడు. మేం నలుగురం ఫుట్‌బాల్ ఆడతాం. మా ఇద్దరు అక్కలు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం తెచ్చుకున్నారు'' అని మారిన వాళ్ల నాన్న మనస్తత్వం గురించి చెబుతుంటుంది పూనమ్ శర్మ.




పూనమ్ శర్మ

గోల్ కొట్టి చూపించారు

వెళ్లిన ప్రతిచోటా ప్రతిభను చూపించే వచ్చారు ఈ అమ్మాయిలు. ఇది అలఖ్‌పురా చుట్టుపక్కల ఊళ్లోని అమ్మాయిలకూ స్ఫూర్తినిచ్చింది. దాంతో వాళ్లూ ఆడటం మొదలుపెట్టారు. ఆ ఉత్సాహం చూసి 2012లో అలఖ్‌పురా ఫుట్‌బాల్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు అలఖ్‌పురా ఫిమేల్ ప్లేయర్స్. ఈ క్లబ్ తరఫున లీగ్ మ్యాచెస్ ఆడటం ప్రారంభించారు. సంజు యాదవ్ అనే అమ్మాయి సుబ్రొతో నేషనల్ చాంపియన్‌షిప్ ఫర్ స్కూల్స్ (అండర్ 17 కేటగిరి)లీగ్‌లో పాల్గొని 11 గోల్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. దీంతో అమ్మాయిలు ఆడటం పట్ల ఊళ్లో అభ్యంతరాలు సమసిపోయాయి. గోర్ధన్‌దాస్‌కు ఆదరణ ఎక్కువైంది.

గ్రౌండ్‌లోకి గవర్నమెంట్!

గోర్ధన్‌దాస్ ఆ ఊరి దగ్గర్లోనే ఉన్న బర్సీకి ట్రాన్స్‌ఫర్ అయ్యాక సోనికా బిజర్నియా అనే కొత్త కోచ్ దాస్ బాధ్యతలను స్వీకరించింది. అక్కడున్న గ్రౌండ్ చూసి అవాక్కయింది. ఇలాంటి గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేశా వీళ్లు ట్రోఫీలు కొట్టింది అనుకుంది. గ్రౌండ్ అంతా చెత్తాచెదారం, రాళ్లూరప్పలే. పిల్లల పాదాలు పరికించింది. కొట్టుకుపోయి, రాటుదేలి ఉన్నాయి. వెంటనే ప్రభుత్వానికి ఓ అర్జీ పెట్టింది. వారం రోజుల్లో ఆ గ్రౌండ్‌ను ఫుట్‌బాల్ ఆటకు అనువుగా తీర్చిదిద్దింది ప్రభుత్వం. అయితే ''ఇదంతా అలఖ్‌పురా అమ్మాయిల ఘనతే' అంటుంది సోనికా. స్టేట్‌లెవెల్‌లో ఆడిన చాలా మందికి స్కాలర్‌షిప్స్ అందాయి. ఇంకా చాలా మందికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు దొరికాయి. ఆ తల్లిదండ్రులకు ఆనందమే ఆనందం. ఆడబిడ్డల విలువను గ్రహించారు. ఫుట్‌బాల్ తమ జీవితంలోకి వచ్చినందుకూ అమ్మాయిలు హ్యాపీగా ఫీలయ్యారు. లేకపోతే అరకొర చదువుతోనే ఆపేసి పెళ్లి పీటల మీద కూర్చోవాల్సి వచ్చేది.



సోనికా బిజర్నియా

బాయ్స్ కంటే బెటర్

అబ్బాయిలు ఆటల్లో ఉంటే చదువులో ఉండరు.. చదువులో ఉంటే ఆటల్లో ఉండరు. రెండూ అంటే చాలా ప్రెషర్ ఫీలవుతారు. కానీ అమ్మాయిలు అలాకాదు.. కొన్నాళ్లుగా చూస్తున్నాను కదా.. ఫుట్‌బాల్ పట్ల ఎంత శ్రద్ధో.. ఆటయిపోయాక చదువు పట్లా అంతే శ్రద్ధ పెడతారు. అందుకే ఆటల్లో ఉన్న అమ్మాయిలే క్లాస్‌లోనూ ఫస్ట్.

- భూపేందర్ సింగ్,
ఫుట్‌బాల్ ట్రైనర్, అలఖ్‌పురా

ఇల్లు.. పొలం.. గ్రౌండ్

అలఖ్‌పురా అమ్మాయి రీతా బగారియా.. మలేషియాలో ఇటీవలే ఫ్రెండ్లీ మ్యాచ్‌లో పాల్గొని వచ్చింది ''నేను ఇప్పుడు బీఏ ఫైనలియర్‌లో ఉన్నా. చదువు, ప్రాక్టీస్‌తో పాటు ఇంటి పనుల్లో అమ్మకు సాయంగా ఉంటా. అలాగే టైమ్ ఉన్నప్పుడల్లా నాన్నతో పొలానికి వెళ్లి పొలం పనులూ చేస్తా'' అంటోంది. రీతూ గత తొమ్మిదేళ్లుగా ఫుట్‌బాల్ టోర్నీస్‌లో పాల్గొంటోంది. అమ్మానాన్నా ప్రోత్సహిస్తున్నా... వేరే ఊళ్లో ఉన్న బంధువులే దెప్పిపొడుస్తుంటారట. ''అవన్నీ మామూలే. తర్వాత వాళ్లే ఊరుకుంటారు'' అంటుంది ఈ మల్టీటాస్క్ యంగ్ గర్ల్ ఎంతో ఆత్మవిశ్వాసంతో.

ఈ పరిణామాలన్నిటినీ దగ్గరుండి చూసిన సోనికా బిజర్నియా.. '' ఈ గేమ్‌లో వీళ్లను అర్జెంటీనా, బ్రెజిల్ ప్లేయర్స్‌లా తయారు చేయాలన్నదే నా ధ్యేయం'' అంటారు. '' త్వరలోనే చిల్డ్రన్ ఫుట్‌బాల్ లీగ్‌కీ ప్లాన్ చేస్తున్నాం. ఇందులో అండర్ ఎయిట్, అండర్ టెన్, అండర్ ట్వల్వ్ పిల్లల కోసం మ్యాచెస్ ఉంటాయి' అని చెప్పారు.

అలఖ్‌పురాలోని అమ్మాయిలు ఇప్పటికీ తమ రాతను మార్చిన ఫుట్‌బాల్‌ను అభిమానంగా చూస్తారు. ఒకప్పుడు అమ్మాయి అంటేనే అరిష్టం అని నొసలు చిట్లించుకున్న అలఖ్‌పురా ఇప్పుడు అమ్మాయిల అడుగులకు మడుగులొత్తుతోంది. 'మా అమ్మే' అంటూ ప్రేమగా మెటికలు విరుస్తోంది. ప్రతి ఇల్లూ ఫుట్‌బాల్‌ను కొని తెచ్చుకుంది.

- శరాది

చెట్టు నీడ

పండ్లు కోసే కత్తి



నరేంద్రనాథ్ దత్త తొలిసారి విదేశీయానానికి సిద్ధం అవుతున్నాడు. తల్లికి బెంగ పట్టుకుంది. దేశం కాని దేశంలో ఎవరితో ఎలా ఉంటాడోనని! లోకం తెలియని యువకుడు లోకంతో నెగ్గుకు రాగలడా అని ఆమె చింత. రాత్రి భోజనం అయ్యాక.. పళ్లెంలో పండ్లు, వాటిని కోసుకోడానికి కత్తి పెట్టి కుమారుడికి అందించింది తల్లి. కొద్దిసేపటి తర్వాత వంటింట్లో ఉన్న తల్లికి కత్తి అవసరమై, ''నరేంద్రా.. కొద్దిగా ఆ కత్తి తెచ్చివ్వు నాయనా'' అని అడిగింది. ''ఇదిగోనమ్మా..'' అంటూ కత్తిని తెచ్చి ఇచ్చాడు నరేంద్ర. కుమారుడు తనకు కత్తిని ఇచ్చిన విధానం చూసి ఆ తల్లి ముఖంలో నిశ్చింత చోటు చేసుకుంది. కత్తి పదునుగా ఉండే వైపును తన చేతితో పట్టుకుని, కత్తిని పట్టుకోడానికి వీలుగా ఉండే భాగాన్ని తల్లి చేతికి అందించాడు నరేంద్ర. అది గమనించాక, తన కొడుకు ఎవరినీ నొప్పించే స్వభావంగలవాడు కాదని ఆమెకు అర్థమైంది! ఎవరినీ నొప్పించనివాడు ఎన్ని దేశాలనైనా నెగ్గుకు రాగలడు. ఆ నమ్మకంతోనే.. కొడుకు చికాగో బయల్దేరుతుంటే చిరునవ్వుతో వీడ్కోలు చెప్పగలిగింది ఆ తల్లి. ఆమె పేరు భువనేశ్వరీదేవి. ఆ కుమారుడే మనందరికీ తెలిసిన స్వామీ వివేకానంద. అతడి చిన్నప్పటి పేరే నరేంద్రనాథ్ దత్త.




సాధారణంగా మనం పక్కవారి గురించి ఆలోచించం. మన సౌకర్యాన్నే చూసుకుంటాం. మనం హాయిగా కూర్చుంటే చాలు. పక్కవాళ్లు చోటు సరిపోక ఇబ్బంది పడుతున్నా పట్టించుకోం. కొంచెం కూడా సర్దుకుని కూర్చోం. కొన్నిసార్లు వాళ్ల వాటాలోకి కూడా వెళ్లిపోయి, వాళ్ల చోటును కూడా ఆక్రమించుకుంటాం. నిత్య జీవితంలో ఇలా మనం ఎందరినో మన చేతలతో ఇబ్బంది పెడుతుంటాం. మన మాటలతో నొప్పిస్తుంటాం. ఇదంతా మనకు తెలియకుండానే చేస్తుండవచ్చు. కానీ మంచి పద్ధతి కాదు. పక్కవారి సౌకర్యం గురించి మొదట ఆలోచించాలి. తర్వాతే మన సౌకర్యం. అప్పుడే ఈ లోకానికి మనతో సఖ్యత కుదురుతుంది.

(నేడు స్వామీ వివేకానంద జయంతి. జాతీయ యువజన దినోత్సవం కూడా).

బంధం



మొక్కనైనా కాకపోతిని



మంజు బెహెన్;
పక్కన : క్వార్టర్స్‌లోని తోట

మొక్కల్తో పెనవేసుకున్న బంధం ఆమెను కదలనివ్వడం లేదు. కానీ భర్త రిటైర్ అయితే క్వార్టర్స్‌ని ఖాళీ చేసి వెళ్లిపోవాలి! తప్పదు.

పుణెలోని 'మహారాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' క్యాంపస్. అందులో ఓ విశాలమైన ఇల్లు. ఇంటి వెనుక అంతకంటే విశాలమైన తోట. ఆ తోటలో వందల యేళ్ల నాటి మహావృక్షాలు. వాటిల్లో ఒక మర్రి చెట్టు కొమ్మలకు, ఊడలతో పాటుగా ఒక ఊయల కూడా వేలాడుతుంటుంది. రోజూ ఉదయాన్నే 97 ఏళ్ల పెద్దాయన ఆ ఊయలలో కూర్చుని పేపర్ చదువుకుంటారు. సూర్య కిరణాలు ఒంటిని తాకింది ఇక చాలనిపించే వరకు అక్కడే కూర్చుని, కూతురు పెంచిన తోటను మురిపెంగా చూసుకుంటారు. ఆ పక్కనే మరో మర్రి చెట్టు చుట్టూ నేలపై వంద అడుగుల మేర రాళ్లు పరిచి, తొమ్మిది సిమెంట్ స్టూళ్లు వేసి ఉంటాయి. సాయంత్రం ఇరుగుపొరుగు క్వార్టర్ల వాళ్లు వచ్చి అక్కడ కూర్చుంటారు. గార్డెన్‌లో పెరిగిన క్రోటన్స్, గులాబీలు, వంకాయలు, టమాటాలు, బ్రోకలీ, కాకరకాయ తీగలు, గుమ్మడి పాదు, పాలకూర మడి, క్యాలిఫ్లవర్ తోపాటు అప్పుడెప్పుడో కాసిన నాలుగు అడుగుల సొరకాయ కూడా చర్చకు వస్తూనే ఉంటుంది. ఆవు పేడ, టీ డికాక్షన్‌తో పెరిగిన ఆర్గానిక్ గార్డెన్ అది.

ఇవన్నీ.. 60 ఏళ్ల మంజు బెహెన్ చేతితో పెరిగిన తోట విశేషాలు. క్యాంపస్‌లో మంజు బెహెన్ భర్తకు కేటాయించిన క్వార్టర్ చుట్టూ ఉన్న 15 వందల చదరపు అడుగుల నేలలో ఒక్క అడుగును కూడా వృథాగా వదల్లేదామె. మర్రిచెట్ల నీడన మరే మొక్కా మొలవదు కదాని మర్రి చెట్లనూ వదల్లేదు. చెట్ల నీడను సిట్టింగ్ ఏరియాగా మలిచింది.

మంజు బెహెన్‌ది ఎం.పి.లోని జబల్పూర్. తొమ్మిదేళ్ల వయసులో తల్లి ఆమెకు రోజూ రెండు పూటలా మొక్కలకు నీరు పోసే బాధ్యత అప్పగించింది. అలా మొదలైన అలవాటు ఆమెకు ఆరు పదులు నిండుతున్నా కొనసాగుతూనే ఉంది. 'మొక్కకు నీరు పోయని రోజు ఒక్కటీ లేదు' నా జీవితంలో అంటోందామె. అంత చక్కగా గార్డెన్ పెరిగితే పక్షులు ఊరుకుంటాయా? చిలుకలు ఆకుల్లో కలిసి తొంగి చూస్తుంటాయి. ఉడుతలు కిచకిచమంటూ కొమ్మల మధ్య విహరిస్తుంటాయి. 'పిల్లి, ఉడుత కలిసి పెరిగేది నా తోటలోనే' అంటుంది మంజు బెహెన్ గర్వంగా. ఆమె ఇరుగుపొరుగు వాళ్లు బయటి ఊళ్లకు వెళ్లేటప్పుడు వాళ్ల పెంపుడు కుక్కలు, పిల్లుల్ని ఈ తోటలోనే వదిలిపెడతారు. 'మా నాన్నకు, కూతురు, కోడలు, కొడుకు, మనుమలు, మనుమరాళ్లకు తోటలో ఒక్కొక్కరికి ఒక్కొక్క ఇష్టమైన ప్లేస్ ఉంది. ఇప్పుడు నా భర్త రిటైర్ అయితే క్వార్టర్‌ను ఖాళీ చేయాలి. ఈ తోటను వదిలి వెళ్లక తప్పదు' అంటోంది మంజు బెహెన్. అదే ఇప్పుడామె బెంగ.

- మను




ప్రిన్స్ హ్యారీ,
మేఘన్ మార్కెల్

అందరికీ ధన్యవాదాలు

రాజమాత క్వీన్ ఎలిజబెత్–2 మనవడు ప్రిన్స్ హ్యారీని (లేడీ డయానా చిన్న కొడుకు) ఈ మే నెలలో వివాహమాడబోతున్న అమెరికన్ నటి మేఘన్ మార్కెల్.. సోషల్ మీడియాలో ఇంత కాలం తనను ఫాలో అయిన వాళ్లందరికీ ధన్యవాదాలు తెలిపారు! ఆ వెంటనే ఆమె తన ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ అకౌంట్‌లను మూసి వేశారు. బ్రిటన్ రాచ కుటుంబపు నియమ నిబంధనలను గౌరవిస్తూ మేఘన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజప్రాసాదంలో ఎవరికీ వ్యక్తిగతంగా సోషల్ మీడియా అకౌంట్‌లు ఉండవు. వారి తరఫున ప్రత్యేకంగా ఒక మీడియా నిపుణుల బృందం అధికారికంగా ట్వీట్‌లు, ఇన్‌స్టాగ్రామ్‌లు, ఫేస్‌బుక్ పోస్టింగ్‌లు ఇస్తుంటుంది. ప్రిన్స్ హ్యారీ జీవిత భాగస్వామిగా మేఘన్ ఆ కుటుంబంలోకి అడుగు పెట్టాక అవసరమైతే ఆమె తరఫున కూడా ఆ ప్రత్యేక బృందమే ట్వీట్లు వగైరాలు ఇస్తుంది. 2017 డిసెంబర్ నాటికి మేఘన్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 19 లక్షల మంది, ట్విట్టర్‌లో 3 లక్షల 50 మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇక ఆమె ఫేస్‌బుక్ అకౌంట్‌కి 8 లక్షల లైకులు ఉన్నాయి. మెట్టినింటి సంప్రదాయాలకు మేఘన్ మెల్లిమెల్లిగా అలవాటు పడుతున్నట్లే ఉంది.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
శుక్రవారం
12-1-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నా.. మీరు బాగుండాలని, మాకు ఇలానే మంచి సలహాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. నేను ఒక అమ్మాయిని లవ్ చేశాను. తను ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. నాకు చదువంటే చాలా భయం. అందుకే ఎక్కువ సమయం చదువుకే కేటాయించేవాడ్ని. బీటెక్ అయ్యాక నేను తనని చూశాను. ఇద్దరి ఇళ్లు దగ్గరే కావడంతో ఫాలో అయ్యి, ప్రపోజ్ చేశాను. తను ఓకే అంది. నాలుగు నెలలు లవ్ చేసుకున్నాం. తను ఉన్నట్టుండి మారిపోయింది. నాకు నీ మీద ఎలాంటి ఫీలింగ్స్ లేవంది. నేనే తనని ఫాలో అవుతున్నానని వాళ్ల ఇంట్లో చెప్పింది. దాంతో వాళ్లు నన్ను బెదిరించారు. కానీ, తనంటే నాకు ప్రాణం. తను నాకు కావాలి భయ్యా.. ఏం చెయ్యాలో చెప్పండి ప్లీజ్. నా లైఫ్‌కి కొత్త టర్నింగ్ పాయింట్ చూపించండి.

- త్రినాథ్



వదిలెయ్ అన్నయ్యా...
ఆ ఆలోచన వదిలెయ్యి...
అమ్మాయి ఇంకా మైనర్...
ఇంటర్ ఫస్ట్ ఇయర్ అంటే పట్టుమని పదహారేళ్లు ఉండవు.

తనది ప్రేమంటే ఏంటో తెలియని వయసు..

చిన్న పిల్ల...!

నువ్వు ప్రేమించిన అమ్మాయికి నీ ప్రేమను తిరస్కరించేంత తెలివి ఉండాలి.

'అదేంటి సార్? ప్రేమను తిరస్కరిస్తే ఎందుకు ప్రేమిస్తుంది సార్?'

అదే లాజిక్ నీలూ..! ప్రేమ కాదనుకుని కూడా ప్రేమించిందనుకో అది నిజమైన ప్రేమ!

'సార్.. మీ వేదాంతం నాకు అర్థం కాదు కానీ, త్రినాథ్‌ని మెచ్యూర్డ్ లవ్ కోసం చూడమని సలహా ఇచ్చారు అనిపించింది. కరెక్టేనా సార్?'

100% కరెక్ట్!



లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

పాశుర ప్రభాతం



28వ పాశురం

**కఱవైగుళ్ పిన్ శెన్రు కానం శేర్‌న్దుణ్బోమ్
అఱివొన్రు మిల్లాద వాయ్‌క్కులత్తు, ఉన్దన్నై
పిఱవి పెఱున్దనై పుణ్ణియమ్ యాముడై యోమ్,
కుఱై వొన్రుమిల్లాద గోవిన్దా!, ఉన్దన్నోడు
ఉఱవేల్ నమక్కు ఇంగొళిక్క వొళియాదు,
అఱియాద పిళ్ళైగళోమ్ అన్బినాల్, ఉన్దన్నై
శిఱు పేరళైత్తనవుమ్ శీరి యరుళాదే,
ఇఱైవా నీతారాయ్ పఱై యేలో రెమ్బావాయ్.**

భావం: గుడ్డి ఉండే ప్రదేశానికి పశువులను మేపుటకైపశువుల వెనుక అడవికి పోయి, ఆ అడవిలోనే శుచి శుభ్రత చూడకుండా తిని జీవించియుండుటయే ప్రధాన ప్రయోజనంగా భావించి, ఇటు అటు తిరిగే వారము. ఏ కొంచెమైనా పుణ్యము కాని జ్ఞానము కాని లేని వంశంలో జన్మించిన మాతో, సమానంగా నీవు కూడా జన్మించావు. అదే మాకు కల పుణ్యము. మాలో ఎన్నో లోపాలు కలవు. ఆ లోపాలను అన్నింటిని తీర్చగలవాడవు నీవు ఏ లోపము లేనివాడవు కదా.

ఓ గోవిందుడా! ఓ స్వామీ! రనీతో మాకు ఉండే సంబంధము ఎప్పటికీ పోగొట్టుకొనటానికి వీలుకానట్టిది. మేము లోకమర్యాద తెలియని వారము. అందుచేత నీ మీద ప్రేమ కల్గిన మేము నిన్ను చిన్న పేరుపెట్టి పిలచినాము. కోపము తెచ్చుకోవద్దు. నీవు మమ్ములను తప్పక ఆదరించి, మేము కోరే వ్రతసాధనమైన పరను ఇవ్వుము అని గోపికలు ప్రార్థించారు.

- ఎస్. శ్రీప్రియ

కాసుకో సుడోకు

1						7	4	
9				3	1			
7				4		5		1
	1			6		9	8	
8		9	5		3	2		4
	4	7		9			6	
4		5		8				2
			6	5				7
	9	2						8

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	9	8	1	5	4	2	3	7
7	3	5	9	8	2	6	1	4
2	1	4	6	3	7	9	8	5
8	4	7	2	1	3	5	9	6
9	5	2	7	6	8	1	4	3
1	6	3	5	4	9	7	2	8
4	2	1	3	7	5	8	6	9
3	7	8	9	2	6	4	5	1
5	8	6	4	9	1	3	7	2

స్ఫూర్తి

క్రాంతీభవ

**● 24 ఏళ్లకే ఐఏఎస్ ● సానుకూల దృక్పథమే విజయ రహస్యం
● ఆటలన్నా.. తెలంగాణ పాటలన్నా ఇష్టం ● నిర్మలమైన జిల్లాకు ట్రైనీగా రావడం పట్ల సంతోషం**



**గురి తప్పడం మంచిదే.
మళ్లీ సరిగా గురి చూడటం తెలుస్తుంది.
ఒక్కసారి విఫలమైతే
అంతా అయిపోయినట్టు కాదు.
పర్వత పాదానికి చేరడం అంటే
శిఖరం అందినట్టు కాదు.
క్రాంతి ఐ.ఏ.ఎస్ కావాలనుకుంది.
రెండుసార్లు తక్కువ ర్యాంకులొచ్చి
రెండు పెద్ద ప్రభుత్వ ఉద్యోగాలొచ్చాయి.
కాని తను ఐ.ఏ.ఎస్ కాదల్చుకుంది.
మూడవసారి కచ్చితంగా అయ్యే తీరింది.
యంగ్ ఐ.ఏ.ఎస్. వల్లూరు క్రాంతిరెడ్డితో
సాక్షి ఎక్స్‌క్లూజివ్.**

వల్లూరు క్రాంతి ఎనిమిది నెలల కిందట తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లాకు వచ్చారు. వచ్చిన కొత్తలో ఎవరో ట్రైనీ కలెక్టరట అని అందరూ అనుకున్నారు కానీ నిత్యం జిల్లాలో ఏదో ఒక మండలానికి వెళ్తూ తన శిక్షణలో భాగంగా కొత్త అంశాలను నేర్చుకుంటూ స్థానిక ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కొత్త విషయాలను చెబుతున్న ఆమెను చూసి స్ఫూర్తి పొందుతున్నారు. ఐఐటీ చదివినా, పాతికేళ్లు నిండకముందే ఐఏఎస్ సాధించినా నిరాడంబరంగా కనిపిస్తూ వృత్తిగతమైన స్థిరచిత్తాన్ని ప్రదర్శిస్తున్న వల్లూరు క్రాంతిరెడ్డితో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు ఆమె మాటల్లోనే...

ముందుగా కుటుంబం గురించి..

నేను పుట్టి పెరిగింది కర్నూలులో. అమ్మ వల్లూరు లక్ష్మి, నాన్న రంగారెడ్డి. వీళ్లిద్దరూ డాక్టర్లే. మా అక్కయ్య నీలిమకూడా డాక్టరే. అమ్మ నాన్న కర్నూలులోనే ప్రాక్టీస్ చేస్తున్నారు. అక్కయ్య మాత్రం అమెరికాలో ఉంది. టెన్త్‌క్లాస్ వరకు కర్నూలులోనే. ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తిచేశాను. ఇంట్లో అందరూ వైద్యులే అయినా నేను ఆ వైపుగా ఆలోచించలేదు. నాన్న ఎప్పుడూ ప్రజలకు సేవ చేయాలంటే ఐఏఎస్ సాధించాలని చెబుతుండేవారు. ఆ క్రమంలో ఇంటర్‌లో ఐఐటీ ఫౌండేషన్ కోర్సులో చేరిపోయాను. అలా ఐఐటీలో సీటు సాధించడం.. ప్రతిష్టాత్మక ఢిల్లీ ఐఐటీలో చదవడం జరిగిపోయాయి.

నాన్న మాటలే నడిపించాయి..

ఐఐటీలో ఉన్నప్పుడే 'నెక్ట్స్ ఏంటీ..' అన్న నాన్న మాటలు గుర్తుకు వచ్చేవి. శ్రమిస్తే సాధించలేనిది ఏదీ లేదని అనేవారు. నాన్న మాటలే నన్ను ఐఏఎస్ ప్రిపరేషన్‌కు సిద్ధం చేశాయి. ఢిల్లీలో ఉన్నప్పుడే సివిల్స్‌కు ప్రిపరేషన్ మొదలు పెట్టాను. అక్కడి శ్రీరామ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆరునెలలు కోచింగ్ తీసుకున్నాను. అందులో చాలా అనుభవజ్ఞులైన మన తెలుగువాళ్లే ఎక్కువగా పాఠాలు చెప్పేవారు. ఆరునెలల్లో సివిల్స్‌పై ఓ అవగాహన వచ్చింది. ఆ తర్వాత కోచింగ్ మానేసి, సొంతగా ప్రిపరేషన్ మొదలు పెట్టాను.



అమ్మానాన్నలతో ఓ సెల్ఫీ

రెండుసార్లు ఓడిపోయినా..

తొలిసారి 2013లో రాసిన సివిల్స్‌లో 562 ర్యాంకు వచ్చింది. దీంతో ఐఆర్‌టీఎస్ (ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్)లో జాబ్ పొందాను. ఇందులో జాయిన్ కావడంతో పాటు వడోదర, లక్నోల్లో ట్రెనింగ్ కూడా పూర్తి చేశాను. మళ్లీ రెండోసారి 2014లో సివిల్స్ యుద్ధంలో పాల్గొన్నాను. ఈసారి 230 ర్యాంక్ సాధించాను. కానీ ఐఆర్‌ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్) వచ్చింది. లక్ష్యసాధనలో రెండుసార్లూ ఓడిపోయినా ఐఏఎస్ కోసం 2015లో మళ్లీ సిద్ధమయ్యాను. ఈసారి గురి తప్పలేదు. ఏకంగా 65వ ర్యాంకు వచ్చింది. నా లక్ష్యం నెరవేరింది. 2016లో ప్రకటించిన ఫలితాల్లో 24 ఏళ్లకే ఐఏఎస్‌గా ఎంపికయ్యాను. ఇక ఐఏఎస్ కోసం ముస్సోరిలో చేసిన శిక్షణ ఓ అద్భుతంగా చెప్పవచ్చు. జీవితంలో దేనినైనా ఎదుర్కొనే తత్వాన్ని నేర్పించారు. ప్రజాసేవలో ఎలా ముందుకు సాగాలో చూపించారు. కొండలు, గుట్టలు ఎక్కేందుకు ట్రెక్కింగ్ నేర్పించారు. పచ్చని అడవుల్లో గంటల పాటు నడవడం చేయించారు. ఇలా ఎన్నో అనుభవాల సమాహారం. 'భారత్ దర్శన్'లో భాగంగా ఎల్.ఓ.సికి వెళ్లి సైనికులను కలవడం గొప్ప అనుభవం.

జిల్లాకు రావడం అదృష్టం..

తెలంగాణ క్యాడర్ కేటాయించిన తర్వాత శిక్షణ కోసం నిర్మల్‌కు రావడం అదృష్టంగా భావిస్తుంటాను. కర్నూలులో పుట్టి పెరిగిన నాకు నిర్మల్ అంటే అప్పట్లో తెలియదు. శిక్షణ కోసం కేటాయించగానే నిర్మల్ గురించి తెలుసుకోవడం మొదలు పెట్టాను. పక్కనే ఉన్న మంచిర్యాలలో ఫ్రెండ్ జాబ్ చేస్తుండటంతో తన ద్వారా వివరాలు సేకరించాను. తను చెప్పినట్లుగానే ఇక్కడ నిర్మలత్వం కనిపిస్తోంది. ప్రజల సహకారం చాలా బాగుంది. సాదాసీదాగా తమ పని తాము చేసుకుంటూ కష్టపడేతత్వం ఆకట్టుకుంటుంది. మొత్తం శిక్షణలో భాగంగా జిల్లాలోని దాదాపు అన్ని మండలాలకు వెళ్తున్నాను. ఒక్కో వారం ఒక్కో డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన పనుల గురించి పరిశీలిస్తున్నాను. దాదాపు అన్ని శాఖలూ బాగానే ఉన్నాయి.

ఆటలన్నా.. తెలంగాణ పాటలన్నా..

నాకు చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఆటలు ఇష్టం. చిన్నప్పుడు ఎక్కువగా బాస్కెట్‌బాల్ ఆడేదాన్ని. ఆ తర్వాత టెన్నిస్.. ఇప్పుడు బ్యాడ్మింటన్ నేర్చుకుంటున్నాను. ఆటలతో పాటు ప్రముఖుల బయోగ్రఫీ పుస్తకాలను చదవడం ఇష్టం. నాకు చాలా నచ్చేవంటే తెలంగాణ పాటలు. ఉద్యమం నేపథ్యంలో, సంస్కృతిపైనా వచ్చిన జానపద పాటలు చాలా బాగుంటాయి. మా రాయలసీమ సంస్కృతికి ఇక్కడి వాతావరణానికి చాలా తేడా ఉంటుంది. తెలంగాణ మహిళలు ఆటపాటలతో ఆడే బతుకమ్మ చాలా బాగుంటుంది. నేను వరంగల్ వెళ్లినప్పుడు అక్కడ బతుకమ్మ ఆడాను.

బాలికావిద్య..వైద్యానికి ప్రాధాన్యం..

ఐఏఎస్ సాధించిన తర్వాత ప్రజాసేవలో భాగంగా నాకంటూ నిర్దేశించుకున్న లక్ష్యాలు బాలికావిద్య, వైద్యం, ఉపాధి కల్పన అంశాలు. బాలికలకు విద్యను అందించడం చాలా అవసరం. అలాగే ప్రజలందరికీ వైద్యం తప్పనిసరి. అలాగే యువతకు ఉపాధి చూపాలన్న లక్ష్యాన్నీ నిర్దేశించుకున్నాను. జిల్లాలో ప్రధానంగా పర్యాటకాభివృద్ధికి చాలా ఆస్కారం ఉంది.

పాజిటివ్ మైండ్‌సెట్‌తో చదవాలి..

రెండుసార్లు లక్ష్యసాధనలో ఓడిపోయినా.. నన్ను నిలబెట్టింది పాజిటివ్ మైండ్‌సెట్. సానుకూల దృక్పథం ఉంటేనే ఏదైనా సాధించగలం. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఇదే దృక్పథంతో ఉండాలి. ఓటమిని తట్టుకుని విజయం సాధించే వరకు మొండిగా పోరాటం సాగించాలి. ఆల్ ది బెస్ట్. సంక్రాంతి శుభాకాంక్షలు.

- రాసం శ్రీధర్, నిర్మల్

ఓ స్త్రీ... కల్ ఆనా



● శ్రద్ధా కపూర్



రాజ్‌కుమార్ రావ్

మా సినిమాకి టైటిల్ దొరికేసిందోచ్ అంటున్నారు శ్రద్ధా కపూర్. విషయం ఏంటంటే రాజ్‌కుమార్ రావ్, శ్రద్ధాకపూర్ జంటగా ఓ హర్రర్ కామెడీ సినిమా రూపొందుతోంది. గురువారం ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూట్ స్టార్ట్ అయింది. 'స్త్రీ' అని టైటిల్ ఫిక్స్ చేశామని అనౌన్స్ చేశారు. ''ఈ సినిమాలో మీరు భయపడుతూనే నవ్వేస్తుంటారు'' అంటూ క్లాప్ బోర్డ్ ఫొటోని షేర్ చేశారు శ్రద్ధా కపూర్. ఆ క్లాప్ బోర్డ్ వెనుక 'ఓ స్త్రీ కల్ ఆనా' అని రాసి ఉంది. అంటే.. 'ఓ స్త్రీ రేపు రా అని అర్థం'. ఈ హర్రర్ కామెడీ మూవీకి తెలుగు దర్శక-ద్వయం రాజ్-డీకే రచయితలుగా వ్యవహరించడంతో పాటు సహనిర్మాతలుగా కూడా చేస్తున్నారు. మాడాంక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజయ్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్నారు.

సార్ మనసు తంగమ్!

'మా సార్ మనసు తంగమ్' అని సూర్య అభిమానులు కాలరెగరేస్తున్నారు. అంటే.. మా సార్ మనసు బంగారం అని అర్థం. ఇంతకీ సూర్య సార్ అంతలా ఏం చేశారంటే... అభిమానుల కాళ్ల మీద పడ్డారు. వాటమ్మా వాటీజ్ దిస్సమ్మా... ఎక్కడైనా హీరోల కాళ్ల మీద అభిమానులు పడతారు కానీ, అభిమానుల కాళ్ల మీద హీరో పడతాడా? అంటున్నారా? పడ్డారండి. మరి.. సూర్య తంగమ్ కదా. ఈ హీరోగారు నటించిన 'తానా సేంద కూట్టమ్' (తెలుగులో 'గ్యాంగ్') ఇవాళ రిలీజ్ కాబోతోంది. చెన్నైలో సూర్య ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓ వేడుకకు అభిమానులు హాజరయ్యారు. కొందరు ఫ్యాన్స్ వేదిక ఎక్కి సూర్య కాళ్ల మీద పడబోయారు. వెంటనే సూర్య వాళ్ల కాళ్లను టచ్ చేశారు. ఇది ఊహించని ఫ్యాన్స్ షాక్ అయ్యారు. సూర్య అలా ఎందుకు చేశారంటే... ఇక ఎప్పుడూ ఫ్యాన్స్ తన కాళ్ల మీద పడకూడదని. అదే విషయం వాళ్లతో అన్నారు. ఇటీవల 'ఫ్యాన్స్ మీట్'లో రజనీకాంత్ కూడా ఇదే చెప్పారు. ''దేవుడు, అమ్మానాన్నల కాళ్ల మీద పడాలి. అంతేకానీ డబ్బున్నవారనో, పేరున్నవారనో, ఫేమస్ అనో, అధికారం ఉన్నవారనో.. ఇతరుల కాళ్ల మీద పడకూడదు'' అని రజనీ పేర్కొన్నారు. సూర్య కూడా అదే అన్నారు. కాకపోతే మరింత బలంగా తన మాటలు అభిమానుల మనసుల్లో నాటుకుపోవాలని తాను కూడా వాళ్ల కాళ్ల మీద పడ్డారు. ఫ్యాన్స్ కాళ్లను టచ్ చేయడం మాత్రమే కాదు.. వాళ్లతో కలిసి డ్యాన్స్ కూడా చేశారు సూర్య. ఇప్పుడు చెప్పండి.. సూర్యని ఆయన అభిమానులు 'తంగమ్' అనొచ్చు కదా. పైగా సూర్య పలు సేవా కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. అందుకే 'మా బాబు బంగారం' అని ఫ్యాన్స్ చెప్పుకుంటుంటారు.



● ఫ్యాన్స్‌తో సూర్య డ్యాన్స్



● సూర్య

ముగ్గు-ముచ్చట




23 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు - సరిచుక్క

ఎన్. అనూష
కనిగిరి, ప్రకాశం జిల్లా




24 చుక్కలు
12 వరుసలు
12 వచ్చేవరకు సరిచుక్క

ఎం. అనిత
హైదరాబాద్



గుత్తి కళావతి
గండిమైసమ్మ
హైదరాబాద్

ఒక కణంలో కోట్ల ప్రొటీన్ అణువులు!



మానవ శరీర నిర్మాణం సంక్లిష్టమైందని ఎవరైనా ఒప్పుకుంటారు. అందుకే దేని లెక్కా సరిగ్గా తేలదు. తాజాగా టొరంటో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాత్రం మన శరీర కణాల్లోని ప్రొటీన్ అణువుల సంఖ్యను కచ్చితంగా లెక్కకట్టారు. ఒక్కో కణంలో అక్షరాలా 4.2 కోట్లు ఉంటాయని తేల్చేశారు. ఈస్ట్ కణాలపై ఇప్పటికే జరిగిన పలు పరిశోధనల సారాంశాన్ని మరోసారి మథించడం ద్వారా తాము ప్రొటీన్ అణువుల సంఖ్యను లెక్కకట్టాం అంటున్నారు అనస్తాసియా బారిష్నికోవా. సరేగానీ.. ఇవి ఎన్ని ఉంటే మనకేంటి? అన్న డౌట్ వస్తోందా? అక్కడికే వస్తున్నాం. రకరకాల వ్యాధుల్లో ఈ ప్రొటీన్ల మోతాదు కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఇప్పటికే గుర్తించారు. అందుకే వ్యాధి నిర్ధారణలో సీ– రియాక్టివ్ ప్రొటీన్ పరీక్షలు చేసేదన్నమాట. అయితే ఇప్పటివరకూ ఈ పరిశోధనలన్నీ వేర్వేరు బృందాల శాస్త్రవేత్తలు, వేర్వేరు పద్ధతుల ఆధారంగా చేశారు. ఇది కాస్త గందరగోళానికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలో టొరంటో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈస్ట్ కణాలపై పరిశోధనలు చేపట్టారు. ఒక్కో ఈస్ట్ కణంలో దాదాపు ఆరువేల ప్రొటీన్లు ఉంటాయన్న సమాచారం ఆధారంగా వాటిల్లో అణువుల సంఖ్యను లెక్కకట్టారు. మానవ కణాలపై కూడా ఇలాంటి పరిశోధనలు నిర్వహించడం ద్వారా వ్యాధులకు అణుస్థాయిలో కారణాలు తెలిసే అవకాశముంటుందని.. తద్వారా మరింత మెరుగైన చికిత్సలు అందించవచ్చునని శాస్త్రవేత్తల అంచనా.

* * *

మళ్లీ మళ్లీ వాడుకోగల కాగితం...




కాగితం కోసం చెట్లు నరికివేసే అవసరాన్ని గణనీయంగా తగ్గించేందుకు చైనా శాస్త్రవేత్తలు ఓ వినూత్న టెక్నాలజీని ఆవిష్కరించారు. ఒకసారి తయారైన కాగితాన్నే మళ్లీమళ్లీ వాడుకునేందుకు ప్రత్యేకమైన సిరా, కాగితాలను సిద్ధం చేశారు వీరు. నాన్‌జింగ్ టెక్ యూనివర్సిటీ, నార్త్‌వెస్టర్న్ పాలిటెక్నికల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ వినూత్న టెక్నాలజీ అడవుల సంరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని అంచనా. కొత్త రకం కాగితం... ప్లాస్టిక్, కొన్ని ప్రత్యేక రసాయనాలతో తయారైంది. కొన్నిరకాల లవణాలు చేరినప్పుడు రంగులు పుట్టుకొస్తాయి. జింక్, ఐరన్, కోబాల్ట్ వంటి రసాయనాలతో కలిపి తయారుచేసిన సిరాతో ఈ ప్రత్యేక కాగితంపై ప్రింటింగ్ చేయవచ్చు. అవసరమైతే చెరిపేసి మళ్లీ ప్రింట్ చేయవచ్చు. ఇలా దాదాపు ఎనిమిది సార్లు మళ్లీమళ్లీ ప్రింట్ చేసుకోవచ్చునని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రత్యేక ఇంకుతో చేసిన ప్రింటింగ్ ఆరునెలలపాటు చెక్కు చెదరకుండా ఉందని శాస్త్రవేత్తలు చెప్పారు. కాగితం, ఇంకు తయారీల ఖర్చులను పరిగణనలోకి తీసుకున్నా సాధారణ పద్ధతుల కంటే ఇది ఐదురెట్లు చౌక అని వివరించారు.

* * *

ఇవి కొత్త రకం రోబోలు!

రకరకాల పనులు చక్కబెట్టే రోబోల గురించి మనం చాలాసార్లు విని ఉంటాం. కానీ ఈ వారం లాస్‌వెగాస్‌లో జరుగుతున్న సీఈఎస్ –2018లో కొత్త రకం రోబోలు అందుబాటులోకి వచ్చాయి. ఫొటోలో కనిపిస్తున్నది అలాంటిదే. పేరు ఫోర్‌ఫియస్. మీతో కలిసి టేబుల్ టెన్నిస్ వంటి ఆటలు ఆడుతుంది. ‘అంతేనా అనొద్దు’ ఇంకా చాలా చేయగలదు ఈ రోబో. మీ బాడీ లాంగ్వేజ్‌ను బట్టి ఆట ఆడేటప్పుడు మీ మూడ్ ఏమిటన్నది గుర్తిస్తుంది. ఎలాంటి షాట్లు కొడుతున్నారు? అందులో లోటుపాట్లేమిటి? ఎలా సరిదిద్దుకోవాలన్న సలహాలు కూడా ఉచితంగానే ఇచ్చేస్తుంది. జపాన్‌కు చెందిన ఒమ్రాన్ కంపెనీ తయారు చేసిన ఈ రోబోలు వాస్తవానికి ఆటలు ఆడేందుకు ఉద్దేశించినవి కాదట. టెక్నాలజీ అనేది మనుషులతో కలిసి ఎలా పనిచేయగలదో చూపేందుకే తాము దీన్ని తయారుచేశామని అంటున్నారు ఒమ్రాన్ కంపెనీ కీత్ కిర్‌స్టన్. రోజులు గడుస్తున్న కొద్దీ మనుషులకు, రోబోలకు మధ్య అంతరం తగ్గిపోతోంది. అనేందుకు ఫోర్‌ఫియస్ ఒక ఉదాహరణ. గతంలోనూ ఉద్వేగాలను గుర్తించే రోబోలు ఉన్నప్పటికీ ఇవి మరింత కచ్చితంగా వాటిని గుర్తించగలవని ఆయన చెప్పారు. సీఈఎస్–18లో హోండా కంపెనీ కూడా ఒక రోబోను ప్రదర్శిస్తోంది. ఇది మన అనుభూతులను, మన ముఖ కవళికల ద్వారా గుర్తించి అందుకు అనుగుణంగా వ్యవహరిస్తుంది.



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం
12-1-2018

ఓణీ చుడితేనే తెలుగింటి పండుగకు కళ
ఓణీ రెపరెపలాడితేనే పెళ్లింట సందడికి సంబరం
ఆధునిక డ్రెస్సులు ఎన్ని మెరిసినా
సంప్రదాయ లంగా ఓణీయే
సంక్రాంతికి ముచ్చటైన రంగవల్లిక.

పండుగ ఓణీ

ఫ్యాషన్



కంచిపట్టు ఫ్యాబ్రిక్ లంగా ఓణీకి మంచి అందం తెస్తుంది. శరీరాకృతికి తగ్గట్టు బ్లౌజ్‌కి పొడవు లేదా బుట్ట లేదా పొట్టి చేతులు పెట్టించుకోవాలి. సన్నని అంచు ఉన్న ప్లెయిన్ ఓణీ వేసుకుంటే ముచ్చటగా కనిపిస్తారు.





నేటి రోజుల్లో అమ్మాయిలతో పాటు అమ్మలు కూడా లంగా ఓణీ ధరించి మురిసిపోతున్నారు. హాఫ్ శారీ అనబడే లంగా ఓణీలో ఎన్నో డిజైన్స్ వచ్చాయి. వాటిలో..

- పట్టు ఎప్పుడూ అగ్రశ్రేణిలో ఉంటుంది. దీంట్లోనూ కంజీవరం, బెనారస్‌లు ముందుండగా మనవైన పోచంపల్లి ఇక్కత్, ధర్మవరం, ఉప్పాడ, నారాయణ్‌పేట.. పట్టు లంగాలు అమ్మాయిలను బుట్ట బొమ్మలుగా చూపుతున్నాయి.
- డిజైనర్ లెహెంగా కావాలనుకుంటే మాత్రం నెటెడ్ ఫ్యాబ్రిక్ నేటికీ ముందున్నది. చూడముచ్చటైన రంగుల హంగుల వల్ల నెటెడ్ లెహెంగాలను డిజైనర్లు తీరొక్కవిధంగా తీర్చిదిద్దుతున్నారు. నెటెడ్ ఫ్యాబ్రిక్ మీద ఎంబ్రాయిడరీ సొబగులు, లేసుల జతలు అల్లిబిల్లిగా చేరి అందంగా రూపుకడుతున్నాయి.





కంచిపట్టు లాగానే బెనారస్ ఫ్యాబ్రిక్‌తో లెహంగాలు రూపొందించుకోవచ్చు. అదే రంగు ప్లెయిన్ బ్లౌజ్ తీసుకొని, పూర్తి కాంట్రాస్ట్ ఓణీ జత చేసుకుంటే లుక్ సూపర్బ్‌గా ఉంటుంది. ఈ లెహెంగాకి ఆంధ్రాలో తయారైన పుట్టపాక శారీని ఎంచుకున్నాను. ప్లెయిన్ బ్లౌజ్ డిజైన్ చేసి, కలంకారీ దుపట్టా జత చేశాను. నగలు హెవీగా ఉండేలా ప్లాన్ చేయడంతో ఒక డిఫరెంట్ స్టైల్ వచ్చింది.



భార్గవి కూనమ్
ఫ్యాషన్ డిజైనర్



సాదా సీదా - డిజైనర్ బ్లౌజ్

- ప్లెయిన్‌ని ఇష్టపడేవారు పట్టు పావడాను అదే కాంబినేషన్‌లో ఉన్న పట్టు బ్లౌజ్ కుట్టేసి ఆ రెండింటినీ కూర్చుతున్నట్టు ప్లెయిన్ ఓణీని వేసుకుంటే పండుగ కళ రెట్టింపు అవుతుంది.
- డిజైనర్ బ్లౌజ్‌లలో కలర్ కాంబినేషన్స్‌తో పాటు ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, ప్యాచ్ వర్క్, మిర్రర్ వర్క్.. వంటివి ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇవి డిజైనర్ లెహెంగాలకే కాకుండా పట్టు లంగాలకు కూడా బాగా నప్పుతాయి.

ప్లెయిన్ ఫ్యాబ్రిక్ అదీ పట్టు, రా సిల్క్, నెటెడ్.. ఏదైనా తీసుకుంటే పెద్ద పెద్ద అంచులు జత చేయడానికి మార్కెట్‌లో విడిగా డిజైన్ చేసిన బార్డర్‌లు లభిస్తున్నాయి. కుచ్చులు కూర్చాక, బార్డర్‌ని జత చేస్తే చాలు చూడముచ్చటైన లెహెంగా రెడీ అవుతుంది.



పండుగకు నప్పే రంగులు

- పసుపు, పచ్చ, ఎరుపు రంగుల కాంబినేషన్‌తో రూపుదిద్దుకున్న లంగా ఓణీలు, చీరలు పండుగ కళను రెట్టింపు చేస్తాయి.
- వీటి మీదకు టెంపుల్ జువెల్రీ లేదంటే పాతకాలం నాటి యాంటిక్ జువెల్రీ బాగా నప్పుతాయి.
- పొడవాటి జడలు, పువ్వులతో అలంకరణ జడలు లంగాఓణీ కళకు జీవం పోస్తాయి.

నెట్ ఫ్యాబ్రిక్ వాడినప్పుడు ఆలోవర్ డిజైన్ తీసుకోవాలి. బ్లౌజ్ ఎంబ్రాయిడరీ హెవీగా ఉండాలి. వీటిలో ఫ్లోరల్ లేదా ప్రింటెడ్ ఫ్యాబ్రిక్ తీసుకున్నప్పుడు లెహెంగా ప్రింట్‌లో బాగా కనిపించే రంగు బ్లౌజ్ డిజైన్ చేయించుకోవాలి. రెండింటికీ నప్పేలా ఓణీని సెట్ చేసుకోవాలి. లెహెంగా మీద ఎంబ్రాయిడరీ వర్క్ హెవీగా ఉంటే బ్లౌజ్‌ని ప్లెయిన్‌గా స్టైలిష్‌గా డిజైన్ చేయించుకోవాలి. రాసిల్క్, వెల్వెట్ లెహెంగాల మీదా ఎంబ్రాయిడరీ గ్రాండ్‌గా తీర్చిదిద్దవచ్చు.

నిర్వహణ: ఎన్.ఆర్

ఆభరణం

దారం బంగారం




సిల్క్ దారాలను చుట్టి, పూసలు గుచ్చి, తీగలు అల్లి .. ఇలా అందమైన ఆభరణాలను రూపొందించుకోవచ్చు. పండుగకు స్వర్ణాభరణాలు ఎలాగూ ఉంటాయి. తేలికగా, అత్యంత ఆకర్షణీయంగా, సంప్రదాయ దుస్తులకు మ్యాచ్ అయ్యేలా దారాల ఆభరణాలు ఉంటే.. పండుగ కళ కొత్తగా శోభిల్లుతుంది. దారాలతో రూపొందించిన ఆభరణాల డిజైన్స్‌లో కొన్ని మోడల్స్..



తయారీకి కావల్సినవి

రంగుల సిల్క్ దారాలు, సన్నని ప్లాస్టిక్ ట్యూబ్(గాజులు, హారాల తయారీకి)/ టూల్స్, గ్లూ, టూల్స్ కట్టర్, పూసలు, బీడ్ క్యాప్స్, జుంకా బేస్, చెయిన్స్.... వంటివి ముందుగా సిద్ధం చేసుకోవాలి. (ఈ కిట్ మార్కెట్‌లోనూ, ఆన్‌లైన్‌లోనూ లభిస్తుంది). ఎక్కువ మొత్తంలో, నచ్చిన డిజైన్లను రూపొందించుకోవడానికి ఈ కిట్స్ ఉపయోగపడతాయి. నేరుగా సిల్క్ థ్రెడ్ ఆభరణాలు కొనుగోలు చేయాలంటే రూ.100 నుంచి వేలల్లో లభిస్తున్నాయి.



టూల్ కిట్





సంక్రాంతి పండుగ ఎప్పుడు?

13-01-2018 శనివారం : భోగి, 14-01-2018 ఆదివారం: మకర సంక్రాంతి, 15-01-2018 సోమవారం: కనుమ



జనవరి 14వ తేదీ మధ్యాహ్నం సూర్యభగవానుడు మకరరాశిలో ప్రవేశించడం వల్ల మకర సంక్రమణం సంప్రాప్తించింది. ఈ మకర సంక్రమణ పుణ్యకాలం పదహారు గంటలు. దీనినే ఉత్తరాయణ పుణ్యకాలం అంటారు. దృక్ సిద్ధాంతం ద్వారా పండుగలు, గ్రహగతుల సంచారం స్పష్టంగా తెలుస్తాయి. సాయన సిద్ధాంతం మనకు వర్తించదు. సూర్యుడు మిగిలిన రాశులలో ప్రవేశించినప్పుడు కూడా పుణ్యకాలాన్ని తెలియజేసినప్పటికీ మకర సంక్రమణానికి ఉన్నంత ఆదరణ మిగిలిన వాటికి లేదు. ఈ మకర సంక్రమణాన్ని అనుసరించే సంక్రాంతి పురుషుని నామం, వాహనం, గొడుగు, వస్త్రధారణ, ఆయుధ ధారణలు తెలియజేయడం జరుగుతుంది. వాటివల్ల కలిగే శుభాశుభ ఫలితాలు తెలియజేయడం ఆచారం. ఈ పండుగలలో వివాదాలు కొత్తగా వచ్చినవేమీ కాదు. గతంలో కృష్ణాపుష్కరాలు, గోదావరి పుష్కరాలు కూడా వివాదాస్పదమైనాయి. అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకుని పరిశీలించగా జనవరి 14వ తేదీనే మకర సంక్రాంతి అని స్పష్టంగా తెలియజేయడమైనది. అసలు పండుగలలో వివాదాలు రాకుండా దేవాదాయ శాఖ మంత్రి, దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, దేవాదాయ శాఖ కమిషనర్ సిద్ధాంతులందరినీ పిలిచి ఒక సమావేశం ఏర్పాటు చేసి, మెజారిటీ సిద్ధాంతుల అభిప్రాయాలను బట్టి పండుగ తేదీలను ప్రకటిస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

- ములుగు రామలింగేశ్వర వరప్రసాదు సిద్ధాంతి
శ్రీకాళహస్తి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి








సంక్రాంతి పండుగ 14న జరుపుకోవాలా? 15న జరుపుకోవాలా ? అని చాలామందికి సందేహం ఉత్పన్నమవుతున్నది. దానికి కారణం సాంఘిక మాధ్యమాలలో, పలు వార్తా పత్రికలలో వచ్చిన వార్తలు. సూర్యుడు ఏ రోజు మకర రాశిలో ప్రవేశిస్తాడో ఆ రోజును మకర సంక్రాంతిగా జరుపుకుంటాము. సూర్యుడు తేది: 14-01-2018, ఆదివారం మధ్యాహ్నం 01:46 నిమిషాలకు మకరరాశిలోకి ప్రవేశిస్తున్నాడు. కావున అదేరోజు అనగా తేది : 14-01-2018 నాడే మకర సంక్రాంతి పండుగను ఆచరించాలి.

- స్వామి శాంతానంద పురోహిత్, శక్తి పీఠం వ్యవస్థాపకులు

2018 జనవరి 14న మకర సంక్రాంతి పర్వదినం అని తూర్పుగోదావరి జిల్లా పొడగట్లపల్లికి చెందిన పిడపర్తి గంటల పంచాంగకర్తలు బ్రహ్మశ్రీ పిడపర్తి వీరేశ్వర శాస్త్రి, సోదరులు వారి క్యాలెండర్‌లోనూ, పంచాంగంలోనూ సూచించారు.

రాజమహేంద్రవరంలోని కోటగుమ్మంకు చెందిన మోహన్ పబ్లికేషన్స్ వెలువరించిన కాలచక్రం సూర్యసిద్ధాంత పంచాంగం ప్రకారం సిద్ధాంతి పొన్నలూరి శ్రీనివాస గార్గేయ జనవరి 14ననే మకర సంక్రమణం జరుగుతోందని చెప్పారు.

గుంటూరు జిల్లా నారాకోడూరుకు చెందిన వంగిపురపు వీరబ్రహ్మ దైవజ్ఞ కూడా జనవరి 14ననే సంక్రాంతి అని పేర్కొన్నారు.



• నాగార్జున

నాగ్ హిట్ లిస్ట్‌లో అతను!

ప్రేమ్ గీతాకృష్ణ టు కల్యాణ్ కృష్ణ నాగార్జున ఎంతోమంది కొత్త దర్శకులకు అవకాశం ఇచ్చారు. ఫర్ ఎగ్జాంపుల్ రామ్‌గోపాల్ వర్మ, దశరథ్, లారెన్స్... ఇలా నాగ్ పరిచయం చేసిన దర్శకులు పది మందికి పైనే ఉంటారు. జస్ట్ తాను హీరోగా నటించిన సినిమాల ద్వారానే కాదు.. నిర్మించిన చిత్రాల ద్వారా కూడా కొత్త దర్శకులకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడిదంతా ఎందుకు అంటే.. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం నాగ్ ఓ కొత్త దర్శకుడితో సినిమా చేయనున్నారట. అతని పేరు వంశీ అని తెలిసింది. ప్రస్తుతం రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో నాగ్ ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. అలాగే శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించనున్న మల్టీస్టారర్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ రెండు చిత్రాల తర్వాత కొత్త దర్శకుడు వంశీతో చేసే సినిమా మొదలవుతుందని భోగట్టా. సమ్మర్‌లో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉందట. నాగ్ ఇంట్రడ్యూస్ చేసిన దర్శకుల్లో ఆల్‌మోస్ట్ అందరూ సక్సెస్. సో.. వంశీ కూడా ఆ హిట్ లిస్ట్‌లో చేరతారని ఊహించవచ్చు.

ఆన్ సెట్ ఎమోషన్.. ఆఫ్ సెట్ సెలబ్రేషన్

అది 'రంగస్థలం' సినిమా సెట్! హీరో రామ్‌చరణ్, ఆది పినిశెట్టి, జగపతిబాబు, ప్రకాశ్‌రాజ్ అక్కడే ఉన్నారు. వీరందిరినీ డైరెక్టర్ సుకుమార్ చూస్తూనే ఉన్నారు. ఆయన స్టార్ట్ చెప్పారు. కానీ సీన్ అయినా కట్ చెప్పకుండా చెమర్చిన కళ్లతో చూస్తూ ఉండిపోయారు. యూనిట్ అందరి కళ్లల్లో కన్నీరు. చిట్టిబాబు ('రంగస్థలం'లో రామ్‌చరణ్ పేరు) అయితే పట్టరాని దుఃఖంలో ఉన్నాడు. ఏమైంది? ఎందుకలా? అంటే.. ఈ సినిమాలో ఓ కీలకమైన సెంటిమెంట్ సీన్స్‌ను ఇటీవల తెరకెక్కించారు. ఈ హై ఎమోషన్ సీన్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ పాట వస్తుంది. ఆ పాట, వీళ్ల వేదన చూస్తే ఎవరైనా ఇట్టే కరిగిపోవాల్సిందే. ఆ రేంజ్‌లో ఉందట. సీన్ నిజం కాదని తెలిసినా.. లొకేషన్లో అందరూ ఎమోషనల్ అయ్యారంటే.. రేపు థియేటర్లో ప్రేక్షకుల కళ్లు చెమర్చకుండా ఉండవు. ఆన్ సెట్ ఎమోషన్ అయినా ఆఫ్ సెట్ మాత్రం ఈ యూనిట్ సెలబ్రేషన్ మూడ్‌లోనే ఉంటున్నారు. నవీన్, వై. రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాను మార్చి 30న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



గురువారం సుకుమార్ బర్త్‌డే. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన ఫొటో

• రామ్‌చరణ్

ఎన్ని వింతలో...



• పూజా రామచంద్రన్, వినాయక్, రామమోహనరావు

దర్శకుడు వీవీ వినాయక్ శిష్యుడు వరప్రసాద్ వరికూటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. నందు, సౌమ్య వేణుగోపాల్ జంటగా పూజా రామచంద్రన్ కీలక పాత్రలో ఎస్. శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ని వినాయక్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''వరప్రసాద్ దర్శకుడిగా మారి, ఓ సినిమా చేస్తున్నాడని తెలిసి హ్యాపీగా ఫీల్ అయ్యా. ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా వరప్రసాద్‌కి మంచి హిట్ ఇచ్చి, పెద్ద హీరోలతో సినిమా తీసే రేంజ్‌కి ఎదగాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''ఉత్కంఠభరితమైన కథనంతో విభిన్నంగా ఉండే చిత్రమిది. ఫిబ్రవరిలో రిలీజ్ చేయాలనుకుంటున్నాం. వినాయక్‌గారు ట్రైలర్ రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది'' అని ఇప్పిలి రామమోహనరావు అన్నారు. నల్లవేణు, దువ్వాసి మోహన్, కౌశిక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత: డి.శ్రీనివాస్ ఓంకార్, కెమెరా: ఎస్. మురళీమోహన్ రెడ్డి, సంగీతం: యాజమాన్య.



• తమన్నా, కల్యాణ్ రామ్

వేసవికి నువ్వే

కల్యాణ్‌రామ్, మిల్కీ బ్యూటీ తమన్నా జంటగా ఓ సినిమా తెరకెక్కుతోంది. ప్రముఖ యాడ్ ఫిల్మ్ మేకర్ జయేంద్ర దర్శకత్వంలో కూల్ బ్రీజ్ సినిమాస్ నిర్మాణంలో ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ సమర్పణలో రూపొందుతోన్న ఈ చిత్రానికి 'నా.. నువ్వే' టైటిల్ ఖరారు చేశారు. నిర్మాతలు కిరణ్ ముప్పవరపు, విజయ్ వట్టికూటి మాట్లాడుతూ –''సరికొత్త కథాంశంతో, ఫ్రెష్ లుక్‌తో జయేంద్రగారు ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ నెలాఖరుకి షూటింగ్ దాదాపు పూర్తవుతుంది. 'నా.. నువ్వే' టైటిల్ కరెక్ట్‌గా సరిపోతుంది. కల్యాణ్ రామ్, తమన్నాల కాంబినేషన్ ఈ చిత్రానికే హైలైట్. పి.సి. శ్రీరామ్‌గారి కెమెరా వర్క్ ఈ సినిమాకి చాలా పెద్ద ఎసెట్'' అన్నారు. ''లవ్, యాక్షన్, ఎంటర్‌టైన్మెంట్ ప్రధానంగా రూపొందుతోన్న చిత్రమిది. పి.సి. శ్రీరామ్, జయేంద్ర వంటి టాప్ క్వాలిటీ టెక్నికల్ టీమ్‌తో ఈ చిత్రం నిర్మిస్తున్నాం. వేసవి సెలవుల్లో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని సమర్పకుడు మహేష్ కోనేరు అన్నారు. తనికెళ్ల భరణి, పోసాని కృష్ణ మురళి, 'వెన్నెల' కిశోర్, ప్రవీణ్, 'బిత్తిరి' సత్తి, ప్రియ, సురేఖ వాణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: షరెత్.

చిరు అల్లుడితో లై బ్యూటీ?

'బొమ్మోలే ఉన్నదిరా పోరి.. బొం బొంబాటుగుందిరా నారి.. లడ్డోలె ఉన్నదిరా కోరి.. లై లైలప్ప బుగ్గల్ది ప్యారి' అంటూ 'లై' సినిమాలో మేఘా ఆకాశ్ అందచందాల్ని వర్ణించారు నితిన్. రచయిత కాసర్ల శ్యామ్ రాసినట్లు నిజంగానే మేఘా ఆకాశ్ బాగుంటుంది. 'లై' సినిమా ద్వారా కథానాయికగా పరిచయమైన ఈ బ్యూటీ రెండోసారి నితిన్‌తో జోడీకట్టారు. నితిన్ హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వంలో పవన్‌కల్యాణ్, త్రివిక్రమ్ ఓ సినిమాతో పాటు ప్రస్తుతం తమిళ సినిమాల్లో యాక్ట్ చేస్తోంది. తాజాగా తెలుగులో ఓ క్రేజీ ఆఫర్ కొట్టేసిందని సమాచారం. చిరంజీవి చిన్న అల్లుడు కల్యాణ్ హీరోగా పరిచయం కానున్న సినిమాలో మేఘా ఆకాశ్‌ను హీరోయిన్‌గా సెలెక్ట్ చేశారట. 'జతకలిసే' ఫేమ్ రాకేశ్ శశి దర్శకత్వంలో కల్యాణ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనుల్లో ఉన్న చిత్రబృందం మరోవైపు నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపికపైనా దృష్టి సారించారట.



• మేఘా ఆకాశ్

చంపేస్తా.. భాయ్‌కు బెదిరింపులు

'సల్మాన్‌ని చంపేస్తాను' అంటూ రాజస్థాన్ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణాయి సంచలన వ్యాఖ్య చేశారు. కృష్ణ జింకలను వేటాడిన కేసులో సల్మాన్ ఖాన్ ఇంకా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అందులో భాగంగా జోధ్‌పూర్ కోర్టులో హాజరయ్యారు. ఆ తర్వాతి రోజే రాజస్థానీ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణాయి మర్డర్ కేసులు, కార్ జాకింగ్, కిడ్నాప్ వంటి ఆరోపణల మీద కోర్టుకు హాజరయ్యారు. ఆ సమయంలో సల్మాన్‌ను చంపేస్తాం అంటూ సెన్సేషనల్ కామెంట్ చేశారు. ఇంతకీ సల్మాన్ మీద బిష్ణాయికి ఎందుకంత కోపం అంటే.. ఓ కారణం ఉంది. లారెన్స్ వాళ్లు రాజస్థానీ తెగలకు చెందిన వాళ్లు. ఈ కమ్యూనిటీ వాళ్లు కృష్ణ జింకను దైవంగా కొలుస్తారట. అందుకే సల్మాన్‌ని చంపేస్తామని బెదిరించారు. ఈ బెదిరింపులను తేలికగా తీసిపారేయడానికి లేదని 'రేస్ 3' బృందం అంటోంది. ప్రస్తుతం సల్మాన్ నటిస్తోన్న చిత్రం ఇది. ఈ షూటింగ్ స్పాట్ చుట్టూ కొంతమంది అనుమానాస్పదంగా కనిపించారట. ఈ విషయాన్ని ముంబై పోలీసులు గ్రహించారట. వెంటనే రంగంలోకి దిగి, 'రేస్ 3' సినిమా షూటింగ్ లొకేషన్‌కి వెళ్లి, సల్మాన్, చిత్రనిర్మాతలను కలిసి షూటింగ్‌ని నిలిపివేయాలని కోరారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య సల్మాన్ ఖాన్‌ని బాంద్రాలోని అతని ఇంటి దగ్గర దింపారు. సల్మాన్ కొన్ని రోజులు పాటు తన నివాసంలో ఉండటమే క్షేమమని భావించిన ముంబాయి పోలీస్‌లు.. కొన్ని రోజులు పాటు షూటింగ్స్ కూడా నిలిపివేయాలని కోరారు. ఎక్కడ ఉంటున్నాడనే విషయాన్ని ఎవరి దగ్గరా చెప్పొద్దనీ, సోషల్ మీడియా ద్వారా పంచుకోవద్దని కూడా కోరారు. సల్మాన్ ఖాన్ వీలున్నప్పుడల్లా ముంబై వీధుల్లో సైకిల్ మీద షికార్లు చేస్తుంటారు. కొన్ని రోజుల పాటు సైక్లింగ్ వద్దన్నారు. ''సల్మాన్‌కు మాగ్జిమమ్ పోలీస్ ప్రొటెక్షన్ ఇస్తున్నాం'' అని ముంబై పోలీసులు పేర్కొన్నారు.



• సల్మాన్‌ఖాన్





ఫ్రాన్స్‌లోని వెర్సైన్స్‌లో 'డెమొక్రాట్ డి ఎల్ ఐజిన్' అనే పత్రికా కార్యాలయంలో 1927 నాటి రోటరీ ప్రెస్‌పై పనిచేస్తున్న సిబ్బంది. సీసంతో ప్రచురితమవుతోన్న ఏకైక యూరోపియన్ వార పత్రిక ఇదే. అదే కార్యాలయంలో లెటర్ ప్రెస్సింగ్ బోర్డుపై అక్షరాలను సర్దుబాటు చేస్తున్న ఉద్యోగి

గ్రీన్‌కార్డు కోటా పెంపు

ఏటా 1.75 లక్షల కార్డుల జారీ!

- ప్రతినిధుల సభలో సంబంధిత బిల్లు
- భారత ఐటీ నిపుణులకే అధిక ప్రయోజనం

వాషింగ్టన్: అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న ఆశావహులకు శుభవార్త. అక్కడ ఉద్యోగంతో పాటు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకునేందుకు దోహదపడే గ్రీన్‌కార్డు కోటాను గణనీయంగా పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. ప్రతిభ ఆధారిత వలస విధానాలను ప్రోత్సహించే ఈ బిల్లుకు ట్రంప్ ప్రభుత్వ మద్దతు కూడా ఉంది. ఇది చట్టంగా మారితే భారత్, చైనా లాంటి దేశాల సాఫ్ట్‌వేర్ నిపుణులకు అధిక ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. 'సెక్యూరింగ్ అమెరికాస్ ఫ్యూచర్ యాక్ట్' పేరిట రూపొందించిన ఈ బిల్లులో ఏటా ఇస్తున్న గ్రీన్‌కార్డుల కోటాను 45 శాతం.. అంటే ప్రస్తుతమున్న 1.20 లక్షల నుంచి 1.75 లక్షలకు పెంచాలని ప్రతిపాదించారు. అనధికారిక అంచనాల ప్రకారం..ప్రస్తుతం అమెరికాలో సుమారు 5 లక్షల మంది భారతీయులు గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తూ ఏటా హెచ్–1బీ వీసాలను పొడిగించుకుంటున్నారు. కొందరైతే దశాబ్దాలుగా గ్రీన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్నారు. హెచ్–1బీ వీసాపై అమెరికాకు వచ్చి, శాశ్వత నివాసం కోసం గ్రీన్‌కార్డు కోరుకునే అర్హులైన ఐటీ నిపుణులకు ఈ బిల్లు వరం కానుంది. ఏటా జారీచేసే ఈ కార్డుల సంఖ్య పెరిగితే వారు అందుకోసం ఎదురుచూసే సమయం తగ్గిపోతుంది.

తల్లిదండ్రులకు తాత్కాలిక వీసానే...

గొలుసుకట్టు వలస విధానాన్ని(చైన్ ఇమిగ్రేషన్) ఎత్తివేయాలని అందులో ప్రతిపాదించడం వల్ల జీవిత భాగస్వామి, మైనర్ పిల్లలు మినహా మిగతా కుటుంబ సభ్యులను అమెరికాకు తీసుకెళ్లడం కుదరదు. అయితే గ్రీన్‌కార్డు కలిగి ఉన్న పౌరులను కలుసుకునేలా వారి తల్లిదండ్రులకు పునరుద్ధరించడానికి వీలుపడే తాత్కాలిక వీసా కార్యక్రమాన్ని అమలుచేయనున్నారు. వ్యవసాయ కార్మికులు తాత్కాలికంగా అక్కడికి వెళ్లి పనిచేయడానికి వీలు కల్పించే కార్యక్రమాన్ని కూడా బిల్లులో ప్రతిపాదించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కోసం విదేశీ కార్మికుల సేవలు వాడుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

'వైట్‌హౌస్'కు అనుగుణంగానే..

ప్రతిభ ఆధారిత వలస విధానాల వల్ల మెరికల్లాంటి నిపుణులే దేశానికి వస్తారని, అక్రమంగా ప్రవేశించే వారికి అడ్డుకట్ట పడుతుందని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది. బిల్లును ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టిన వారిలో ఒకరైన హౌజ్ హోంల్యాండ్ సెక్యూరిటీ కమిటీ చైర్మన్ మైకెల్ మెక్‌కౌల్ స్పందిస్తూ దేశ సరిహద్దులను రక్షించేలా బిల్లు ఉందని అన్నారు. దేశ భద్రతకు సైన్యం చేస్తున్న కృషి, అంతర్గత చట్టాల అమలుకు మద్దతుగా నిలుస్తూ, వలస విధానాలను ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరించేలా నిబంధనలు చేర్చామని తెలిపారు.



భారతీయుల స్టోర్లపై దాడులు

అక్రమ వలసదారులకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అమెరికా అధికారులు భారతీయులకు చెందిన సుమారు 100 7–ఎలెవన్ రిటైల్ దుకాణాలపై దాడులు నిర్వహించి 21 మందిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా వలసొచ్చిన వారిని ఉద్యోగాల్లో నియమించుకోవద్దని నిర్వాహకులను హెచ్చరించారు. 18 రాష్ట్రాలు, డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియాలో ఈ దాడులు నిర్వహించారు. అరెస్టయిన వారు ఏ దేశస్తులో వెల్లడికాలేదు. అమెరికాలో ఇండో–అమెరికన్లే 7–ఎలెవన్ పేరిట ఎక్కువగా రిటైల్ దుకాణాలను నిర్వహిస్తున్నారు.

వేయని రోడ్లకూ సొమ్ము

భారత్‌లో రోడ్ల నిర్మాణంలో పెరుగుతోన్న అవినీతి ● తాజా అధ్యయనంలో వెల్లడి

వాషింగ్టన్: భారత్‌లో వేయని రోడ్లను నిర్మించినట్లు బిల్లులు చూపించి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచేశారు. ఇందుకు స్థానిక రాజకీయ నేతలు, వారి బంధువులు, అవినీతి పరులు కుమ్మక్కై ప్రజాధనాన్ని దిగమింగేశారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై)లో లొసుగుల ఆసరాగా స్థానిక ప్రజాపతినిధులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి భారీ అవినీతికి పాల్పడ్డారు. విస్తుగొలిపే ఈ అంశాలన్నీ అమెరికాలోని ప్రిన్స్‌టన్ వర్సిటీ, ఫ్రాన్స్‌లోని పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు చెందిన పరిశోధకులు చేసిన తాజా అధ్యయనంలో వెల్లడయ్యాయి. గ్రామీణ ప్రాంతాలను బాహ్య ప్రపంచానికి అనుసంధానిస్తూ చేపట్టే రహదారి నిర్మాణాల్లో భారీ అవినీతి



జరుగుతోందని అధ్యయనంలో తేలింది.

రాజకీయనేతల కనుసన్నల్లోనే

మారుమూల ప్రాంతాలను అనుసంధానిస్తూ గ్రామీణ రహదారులను నిర్మించినట్లు పీఎంజీఎస్‌వై సమాచార జాబితాలో పేర్కొన్నారు. వాటికి కేంద్రం నిధులు అందజేసినట్లు రాసేశారు. కానీ, అందులో పేర్కొన్న రోడ్లలో కనీసం ఒక్కరోడ్డు వేయలేదు. ఇలాంటివి 500 రోడ్లు ఉన్నట్లుగా పరిశోధక బృందం గుర్తించింది. కేంద్రం అందించిన నిధులు మాత్రం రహదారి నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు, పనులు కేటాయించిన స్థానిక రాజకీయనేతల ఖాతాల్లోకి వెళ్లిపోయాయని వెల్లడైంది. ఈ అవినీతి అంతటికీ స్థానిక ప్రజాప్రతినిధులే కారణమని పరిశోధకులు తేల్చారు. స్థానిక రాజకీయనేతలే ఈ అవినీతికి కారణమని నిర్ధారించేందుకు పరిశోధకుల బృందం శ్రమించాల్సి వచ్చింది. కాంట్రాక్టులను దక్కించుకున్న వారి ఇంటిపేర్లను స్థానిక ప్రజాప్రతినిధుల ఇంటిపేర్లతో సరిపోల్చాకే బృందం ఈ నిర్ణయానికొచ్చింది. రాజకీయనేతలు సిఫారసు చేసిన కాంట్రాక్టర్లకే రహదారి పనులు దక్కేలా చూసిన అధికారులు కూడా ఉద్యోగాలలో ప్రమోషన్లు పొందినట్లు పరిశోధకులు గుర్తించారు.

ఆధార్‌పై దుష్ప్రచారం

యూఐడీఏఐ మాజీ చైర్మన్ నీలేకని



సాక్షి, బెంగళూరు: ఆధార్ వ్యవస్థను అప్రతిష్టపాలు చేసేందుకు పద్ధతిప్రకారం దుష్ప్రచారం జరుగుతోందని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) మాజీ చైర్మన్ నందన్ నీలేకని పేర్కొన్నారు. గురువారం బెంగళూరులో ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న నీలేకని.. దేశంలో ఉన్న ప్రభుత్వ గుర్తింపు పత్రాల్లో అత్యంత విశిష్టమైన ఆధార్‌పై కావాలనే అవాస్తవాలను ప్రచారం చేస్తుండటం విచారకరమన్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఆధార్ వ్యవస్థకు భద్రత కల్పించామన్నారు. ఆధార్‌పై వ్యతిరేక ప్రచారం చేస్తే అదేరకమైన ఫలితాలుంటాయన్నారు. 'ఇదంతా ఆధార్ వ్యవస్థకు అపఖ్యాతిపాలు చేసేందుకు వంద శాతం పద్ధతిప్రకారం జరుగుతున్న దుష్ప్రచారం. ఆధార్ డేటా రక్షణకు ఎన్నో దశల భద్రత కల్పించాం. దీన్ని ఛేదించటం అంత సులభమేం కాదు' అని అన్నారు. కాగా, ఆధార్ డేటా తస్కరణకు గురైందంటూ వస్తున్న వార్తలతో ఆందోళన వద్దని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ గురువారం సూచించారు. ఢిల్లీలో జరిగిన 6వ వార్షిక అంతర్జాతీయ వాణిజ్య సదస్సులో పాల్గొన్న మంత్రి.. 'ఆధార్‌లో మీ మతం, సామాజికవర్గం, వైద్య, విద్య, ఆదాయ వివరాలేమీ ఉండవు. ఐరిస్, వేలి ముద్రలు మాత్రమే ఉంటాయి. వందలకోట్ల సార్లు ప్రయత్నించినా ఈ డేటాను చోరీ చేయలేరు. దేశంలో అత్యంత గోప్యమైన విషయాలు.. బ్యాంకు ఖాతాల వివరాలు, ఆరోగ్య వివరాలే' అని రవిశంకర్ అన్నారు.

నేడు నింగిలోకి వందో శాటిలైట్

శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో తన వందో ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు రంగం సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో శుక్రవారం ఉదయం 9.29 గంటలకు పీఎస్‌ఎల్వీ సీ–40 వాహక నౌక ద్వారా ఈ ప్రయోగం జరగనుంది. ఇందుకు సంబంధించి 28 గంటల కౌంట్‌డౌన్ గురువారం ప్రారంభమైంది. కార్టోశాట్–2 సిరీస్‌లోని మూడో ఉపగ్రహంతో పాటు మరో 30 ఉపగ్రహాలను పీఎస్‌ఎల్వీ సీ–40 ఒకేసారి నింగిలోకి మోసుకెళ్లనుంది. ఇందులో మూడు భారత్‌వి, కాగా మిగిలినవి విదేశాలకు చెందిన మైక్రో, నానో ఉపగ్రహాలు. దేశీయ అవసరాల కోసం భౌగోళిక పరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి కార్టోశాట్ ఉపగ్రహ వ్యవస్థను 2005లో ప్రారంభించారు. భూమికి 505 కిలో మీటర్ల ఎత్తులో పరిభ్రమిస్తూ నాణ్యమైన ఛాయాచిత్రాలను ఈ వ్యవస్థ పంపుతోంది. పట్టణ, గ్రామీణాభివృద్ధి, సముద్ర తీర ప్రాంతాల పర్యవేక్షణ, నీటి పంపిణీపై కీలక సమాచారాన్ని సమకూరుస్తోంది. భారత్‌కు చెందిన చివరి ఉపగ్రహం కక్ష్యలోకి చేరగానే ఇప్పటి వరకు ఇస్రో పంపిన స్వదేశీ ఉపగ్రహాల సంఖ్య వందకు చేరుతుంది. కౌంట్‌డౌన్ సందర్భంగా గురువారం రాకెట్‌కు నాల్గో దశలో 2.5 టన్నుల ద్రవ ఇంధనం నింపారు.




లాంచ్‌ప్యాడ్‌పై సిద్ధంగా ఉన్న రాకెట్

60 మంది బీజేపీ సిట్టింగ్‌లకు చెక్!

'మిషన్ 2019'పై గురిపెట్టిన అమిత్

- ప్రస్తుత ఎంపీల పనితీరుపై సమీక్ష షురూ



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, న్యూఢిల్లీ: 2019 సాధారణ ఎన్నికలపై బీజేపీ కసరత్తులు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఇప్పటికే సిట్టింగ్ ఎంపీల క్షేత్రస్థాయి పనితీరుపై నివేదికలు తెప్పించుకుని సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో వెల్లడైన అంశాల ద్వారా 60కిపైగా సిట్టింగ్ ఎంపీల పనితీరు దారుణంగా ఉందని నిర్ణయించారని పార్టీ వర్గాలంటున్నాయి. వీరికి వచ్చే ఎన్నికల్లో సీట్లు దక్కకపోవచ్చని తెలుస్తోంది. ఈ నివేదికల్లో నియోజకవర్గంలో పనితీరు, ప్రజాభిమానం, వ్యతిరేకత, ఎంపీల్యాడ్స్ నిధుల వినియోగం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ 60మందికి పైగా ఉన్న జాబితాలో సీనియర్ ఎంపీలతోపాటు పలువురు కేంద్ర మంత్రులు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలంటున్నాయి. ప్రదర్శన సరిగా లేని కారణంగా వచ్చే ఎన్నికల బరిలోనుంచి తప్పించే ఎంపీల జాబితాపై వార్తలు రావటంతో.. పలువురు ఎంపీలు అమిత్ షా వద్ద క్యూలు కడుతున్నారు. నియోజకవర్గంలో, బయటా తమ సమస్యలను షాతో ఏకరువు పెడుతున్నారు. ఇలాంటి వారందరికీ అమిత్ ప్రత్యేక సూచనలు ఇస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో పనితీరును మెరుగుపరుచుకునేందుకు ఏం చేయాలి, ఏం చేయకూడదనే అంశాలను బోధిస్తున్నట్లు తెలిసింది. మూడున్నరేళ్లుగా వివిధ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ ఎంపీలకు కొన్ని బాధ్యతలు కట్టబెట్టారు. ఇందులో చాలా మంది ఎంపీలు విఫలమయ్యారు. శీతాకాల సమావేశాల సందర్భంగా పలువురు ఎంపీలు ప్రధాని, అమిత్ షాలను కలిసి నియోజకవర్గాల్లో చేపట్టే పనులకు నిధులు కావాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల వేతనాలు పెంచిన సమయంలో చాలా మంది ఎంపీలు ఈ బిల్లును ఆమోదించేందుకు విముఖత వ్యక్తం చేశారని.. ముందుగా తమ వేతనాలు పెంచాలని అడిగారని తెలిసింది.

సీమాంతర ఉగ్రవాదాన్ని సహించం

- భారత్‌లో అమెరికా రాయబారి జస్టర్
- హిందూ–పసిఫిక్ సముద్ర ప్రాంతంలో 'భారత్ ప్రధాన శక్తి' అని వ్యాఖ్య



న్యూఢిల్లీ: భారత్‌ను హిందూ–పసిఫిక్ సముద్ర ప్రాంతంలో 'ప్రధాన శక్తి'గా అమెరికా పరిగణిస్తోందని భారత్‌లో ఆ దేశ రాయబారి కెన్నెత్ జస్టర్ పేర్కొన్నారు. అమెరికా వ్యాపార రంగానికి భారత్ ఓ కీలకమైన వాణిజ్య శక్తి అని అభివర్ణించారు. నవంబర్‌లో భారత రాయబారిగా జస్టర్ బాధ్యతలు తీసుకున్నప్పటికీ గురువారం తొలిసారిగా ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. భారత్‌పై అమెరికా విధానం గురించి కెన్నెత్ వివరించారు. సీమాంతర ఉగ్రవాదాన్ని అమెరికా ఎట్టిపరిస్థితుల్లో సహించబోదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఆయన ప్రసంగంలో ఎక్కడా పాకిస్తాన్ పేరును ప్రస్తావించలేదు. ఇటీవల పాకిస్తాన్‌కు అమెరికా ఇచ్చే సాయాన్ని నిలిపేసిన విషయం తెలిసిందే. అమెరికాకు సంబంధించి సున్నితమైన సాంకేతికత బదిలీ విషయంలో మొదట్లో భారత్, అమెరికా మధ్య సంబంధాలు కాస్త దెబ్బతిన్న సంగతి నిజమేనని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రధానమైన 4 ఎగుమతుల నియంత్రణ గ్రూపుల్లో భారత్ ఇప్పటికే రెండింటిలో (వాసెనార్, క్షిపణి సాంకేతికత నియంత్రణ గ్రూప్స్) సభ్యత్వం పొందిందని గుర్తుచేశారు. అలాగే ఆస్ట్రేలియా గ్రూప్ ఆన్ కెమికల్, బయలాజికల్ వెపన్స్ గ్రూపులో త్వరలోనే భారత్ చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అణు సరఫరాదారుల గ్రూపులో భారత్ సభ్యత్వం విషయంలో కూడా అమెరికా చాలా కృషి చేస్తోందని ఉద్ఘాటించారు.

ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

- ఇంటెలిజెన్స్, నిఘా, యుద్ధ విమానాల తయారీలో ఇరుదేశాలకు భారీ ఒప్పందాలు జరగనున్నాయి.
- భారత్‌తో ఆర్థిక, వాణిజ్య సంబంధాల బలోపేతానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్‌తో వాణిజ్యలోటు ఆందోళనకరమే.
- చైనాలో వ్యాపార నిర్వహణకు చాలా అమెరికన్ కంపెనీలు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ సంస్థలన్నీ ఆశగా ప్రత్యామ్నాయ వేదికలకోసం వెతుకుతున్నాయి.
- అమెరికా వ్యాపారాల నిర్వహణకు అసలైన ప్రాంతీయ కేంద్రం భారత్.
- రక్షణ, ఉగ్రవాద వ్యతిరేక రంగాల్లో దీర్ఘకాల సుస్థిర బంధాన్ని మరింత బలోపేతం చేసుకోనున్నాయి.
- వలసవాదుల దేశంగానే అమెరికా ఉండబోతోంది.
- భారత్, అమెరికా దేశాలు ఉగ్రబాధితులు. అందుకే ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయి.

ముల్లర్‌తో ఇంటర్వ్యూకు ట్రంప్ నో



వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల్లో విజయానికి రష్యాతో కలిసి కుట్రపన్నారన్న ఆరోపణలు అర్థరహితమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ వివాదంపై విచారిస్తున్న ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్, స్పెషల్ కౌన్సెల్ రాబర్ట్ ముల్లర్‌తో ముఖాముఖి ఇంటర్వ్యూ ఉండకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. 'అమెరికా, రష్యా మధ్య ఎలాంటి సంబంధాల్లేనపుడు దీనిపై విచారణ జరపాల్సిన పనేముంది. నాతో ఇంటర్వ్యూ అవసరమేంటి' అని ట్రంప్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత డెమొక్రాట్లు అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. 11 నెలలుగా వివిధమార్గాల్లో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 2016లో ఈ–మెయిల్ కేసుకు సంబంధించి హిల్లరీ క్లింటన్‌ను ఎఫ్‌బీఐ విచారణ జరిపిన విషయాన్ని మరిచిపోవద్దని ట్రంప్ తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే పలువురు ట్రంప్ కుటుంబ సభ్యులు, సన్నిహితులను ముల్లర్ విచారించారు. ట్రంప్‌ను ఇంటర్వ్యూ కోసం ముల్లర్ అపాయింట్‌మెంట్ కోరుతున్నారంటూ వార్తలొస్తున్న నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు చేశారు.

రఘునందన్‌కు 23న మరణశిక్ష!

చిన్నారి శాన్వీ హత్యకేసులో దోషిగా తేలిన తెలుగు వ్యక్తి

వాషింగ్టన్: అమెరికాలో పది నెలల చిన్నారి శాన్వీతో పాటు ఆమె నాయనమ్మ సత్యవతి(61)ని 2012లో అతి కిరాతకంగా హత్యచేసిన కేసులో భారత సంతతి అమెరికన్ రఘునందన్ యండమూరి(32)కి ఫిబ్రవరి 23న మరణశిక్ష అమలుచేయనున్నట్లు స్థానిక జైలు అధికారులు తెలిపారు. ఈ కేసులో రఘునందన్ డబ్బుకోసమే ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు కోర్టుకు చెప్పారు. తొలుత ఈ హత్యలు చేసింది తానేనని అంగీకరించిన రఘునందన్ తర్వాత మాట మార్చాడు. తాను కేవలం దొంగతనానికి మాత్రమే పాల్పడ్డాననీ, ఈ హత్యలకు తనకూ ఎలాంటి సంబంధం లేదని వాదించాడు. ఈ హత్యల్ని ఇద్దరు అమెరికన్లు చేశారని ఆరోపించాడు.



రఘునందన్ (ఫైల్)



శాన్వీ (ఫైల్)

ఈ నేపథ్యంలో కేసు విచారణ ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ నుంచి ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు బదిలీ అయింది. ఇరుపక్షాల వాదనలు విన్న పెన్సిల్వేనియా కోర్టు చివరికి 2014, అక్టోబర్ 14న రఘునందన్‌కు మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. అయితే పెన్సిల్వేనియా గవర్నర్ టామ్ వుల్ఫ్ 2015లో విధించిన మారిటోరియం కారణంగా ఈ శిక్ష అమలు వాయిదా పడే అవకాశముందని జైలు అధికారులు వెల్లడించారు. ఒకవేళ గవర్నర్ శిక్ష అమలు కోసం నిర్ణీత గడువులోగా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకుంటే జైళ్లశాఖ కార్యదర్శి 30 రోజుల్లోగా దోషికి విషపూరిత ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా మరణశిక్ష విధించాలని ఆదేశాలు జారీచేయవచ్చని అన్నారు. ప్రస్తుతం రఘునందన్‌కు శిక్ష అమలు విషయమై పెన్సిల్వేనియా టాస్క్ ఫోర్స్, సలహా కమిటీల నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. తాజా ఘటనతో అమెరికాలో మరణదండన ఎదుర్కొంటున్న తొలి భారత సంతతి అమెరికన్‌గా రఘునందన్ నిలిచాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రఘునందన్ హెచ్1బీ వీసాతో అమెరికాకు వెళ్లాడు. శాన్వీతో పాటు ఆమె నాయనమ్మను హత్యచేసిన ఇతను విచారణ సందర్భంగా తన లాయర్లు హిల్లెస్, హెక్మన్‌ల వ్యవహారశైలిపై అసహనం వ్యక్తం చేశాడు. ఫోన్లు చేసినప్పటికీ, లేఖలు రాసినప్పటికీ స్పందించడం లేదన్నాడు. మళ్లీ విచారణ కోరడానికి బదులుగా తనకు విధించిన మరణశిక్షను వెంటనే అమలు చేయాలని పలుమార్లు కోర్టు హాల్లోనే డిమాండ్ చేశాడు.

జస్టిస్ ధింగ్రా నేతృత్వంలో సిట్

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని ఇందిర హత్యానంతరం జరిగిన సిక్కుల ఊచకోత కేసుల దర్యాప్తుపై పర్యవేక్షణకు సిట్ ఏర్పాటైంది. విచారణ జరపకుండానే మూసేసిన ఆనాటి 186 కేసులపై ఈ సిట్ విచారణ జరపనుంది. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఎస్ఎన్ ధింగ్రా నేతృత్వంలో త్రిసభ్య బృందాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటుచేసింది. ఈ సిట్‌లో ఆయనతోపాటు అభిషేక్ దులార్ (2006 బ్యాచ్ ఐపీఎస్), రాజ్‌దీప్ సింగ్ (రిటైర్డ్ ఐజీ ర్యాంకు అధికారి) సభ్యులుగా ఉన్నారు. ఈ సిట్ రెండు నెలల్లో నివేదిక అందజేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేసింది. సిట్‌లో ఉండాల్సిన సభ్యులపై హోం మంత్రిత్వ శాఖతోపాటుగా పిటిషనర్ జీఎస్ కహ్లోన్ ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాతే సుప్రీం కోర్టు ఈ పేర్లను విడుదల చేసింది.

ఉత్తరాఖండ్ మదర్సాల్లో సంస్కృత పాఠాలు

డెహ్రాడూన్: మదర్సాల్లో సంస్కృతంతోపాటు కంప్యూటర్ సైన్స్‌ను బోధించాలనే ప్రతిపాదనకు ఉత్తరాఖండ్ మదర్సా ఎడ్యుకేషన్ బోర్డు (యూఎంఈబీ) ఆమోదం తెలిపింది. ప్రస్తుతం మదర్సాల్లో గణితం, సైన్స్, ఆయుష్, సాంఘిక శాస్త్రాలను ఐచ్ఛికాంశాలుగా బోధిస్తున్నారు. దీంతోపాటు సంస్కృతం, కంప్యూటర్ సైన్స్‌లను ఐచ్ఛికాంశాలుగా బోధించాలనే అంశాన్ని బోర్డు ఉన్నత స్థాయి కమిటీకి నివేదిస్తామని యూఎంఈబీ డిప్యూటీ రిజిస్ట్రార్ అఖ్లాక్ అహ్మద్ తెలిపారు. అక్కడ ఓకే అయితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి దీనిని రాష్ట్ర వ్యాప్తంగా మదర్సాల్లో అమలు చేయనున్నామన్నారు. సంస్కృతాన్ని మదర్సాల్లో బోధించాలంటూ ఉత్తరాఖండ్ మదర్సా సంక్షేమ సంఘం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎల్పీయూ విద్యార్థిని



జలంధర్: ఈ ఏడాది జనవరి 26న ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌కు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ(ఎల్పీయూ)కి చెందిన అంబికా మిశ్రా ఎంపికయ్యారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అంబిక ప్రస్తుతం ఎల్పీయూలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా ఏడాదిలో 145 గంటలు పనిచేయడంతో పాటు కథక్ నృత్యం, పాటలు, ఉపన్యాసం తదితర విభాగాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా అంబిక పరేడ్‌కు ఎంపికైనట్లు ఎల్పీయూ చాన్స్‌లర్ అశోక్ మిట్టల్ తెలిపారు.

మళ్లీ పారిస్ ఒప్పందంలోకి అమెరికా?

వాషింగ్టన్: తమకు ఆమోదయోగ్యమైన విధంగా 'పారిస్ పర్యావరణ ఒప్పందం'లో మార్పులు జరిగితే అందులో తిరిగి చేరడంపై యోచిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. 'నిజాయితీగా చెబుతున్నా. పారిస్ ఒప్పందంతో నాకెలాంటి సమస్య లేదు. కానీ అమెరికా ప్రయోజనాలు దెబ్బతీసేలా నాటి ఒబామా సర్కారు సంతకం చేయడం ఆందోళనకు గురిచేసింది. ఇది అమెరికాకు ఒక చెత్త డీల్. ఒప్పందంలో మాకు అనుకూలంగా మార్పులు జరిగితే తిరిగి అందులో చేరొచ్చు. పర్యావరణ కాలుష్యంపై నేనూ ఆందోళన చెందుతున్నా. స్వచ్ఛ జలం, స్వచ్ఛ గాలితో పాటు ఇతర దేశాలతో పోటీపడుతూ వ్యాపారాలు చేయడం ముఖ్యమే. కానీ పారిస్ ఒప్పందం మా పోటీతత్వ ప్రయోజనాన్ని హరిస్తోంది' అని ట్రంప్ అన్నారు.

వృద్ధాశ్రమంలో టీఎన్ శేషన్ దంపతులు



సాక్షి ప్రతినిధి, చెన్నై: దేశంలో ఎన్నికల సంస్కరణలకు ఆద్యుడిగా పేరుపొందిన కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి టీఎన్ శేషన్ చెన్నైలోని ఓ వృద్ధాశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. కేరళలోని పాలక్కాడులో శేషన్‌కు సొంతిల్లు ఉంది. అయితే, ఈయనకు సంతానం లేదు. దీంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న శేషన్, భార్య జయలక్ష్మితో కలసి చెన్నైలోని గురుకులం వృద్ధాశ్రమంలో చేరారు. డిసెంబర్ 15వ తేదీన వృద్ధాశ్రమంలోనే శేషన్ 85వ జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. 1996లో ఆయన మెగాసెసే అవార్డు అందుకున్నారు.

దావోస్ సదస్సులో షారుఖ్‌కు క్రిస్టల్ అవార్డు

న్యూఢిల్లీ/జెనీవా: దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో బాలీవుడ్ హీరో షారుఖ్‌ఖాన్ అరుదైన గుర్తింపు దక్కనుంది. సదస్సు సందర్భంగా ఈ నెల 22వ తేదీన హాలీవుడ్ హీరోయిన్ కేట్ బ్లాంచెట్, ప్రఖ్యాత గాయకుడు ఎల్టన్ జాన్‌తోపాటు షారుఖ్ క్రిస్టల్ అవార్డు అందుకోనున్నారు. షారుఖ్ ఖాన్ గత 30 ఏళ్లుగా భారతీయ చిత్ర పరిశ్రమలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారని డబ్ల్యూఈఎఫ్ తన ప్రకటనలో పేర్కొంది. దేశంలో స్త్రీలు, పిల్లల హక్కుల ఆయన సాగిస్తున్న పోరాటానికి ఈ అవార్డు ఇస్తున్నట్లు తెలిపింది. యాసిడ్ దాడి, అగ్ని ప్రమాద బాధితులను ఆదుకునేందుకు మీర్ ఫౌండేషన్‌ను నడుపుతున్నారని, కేన్సర్ బాధిత చిన్నారులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నారని వివరించింది. గతంలో ఈ అవార్డును అందుకున్న ప్రముఖుల్లో అమితాబ్ బచ్చన్, మల్లికా సారాభాయ్, ఏఆర్ రెహమాన్, షబానా అజ్మి తదితరులున్నారు.

'బీజేపీ, ఆరెస్సెస్‌లోనూ అతివాదులు'



బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య బీజేపీ, ఆరెస్సెస్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. బీజేపీతో పాటు ఆరెస్సెస్‌లో హిందుత్వ అతివాదులు ఉన్నారని ఆయన ఆరోపించారు. బీజేపీతో పాటు ఆరెస్సెస్, బజరంగ్‌దళ్‌లో ఉగ్రవాదులు ఉన్నారని ఆయన గతంలో వ్యాఖ్యానించడం తెలిసిందే. 'వాళ్లు(బీజేపీ, ఆరెస్సెస్) హిందుత్వ ఉగ్రవాదులని నేను చెప్పాను. నేను హిందువునే. కానీ నేను మానవత్వం ఉన్న హిందువును. కానీ వాళ్లు(బీజేపీ, ఆరెస్సెస్) మానవత్వం లేని హిందువులు' అని అన్నారు. అయితే ఖలిస్తాన్‌తో పాటు ఎల్టీటీఈకి అండదండలు అందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని బీజేపీ ఎంపీ శోభా కరంద్లాజే విమర్శించారు.

ఫడ్నవిస్‌కు మరోసారి తప్పిన ప్రమాదం



సాక్షి, ముంబై: మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ మరోసారి హెలికాప్టర్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. పైలెట్ అప్రమత్తతతో ఆయన సురక్షితంగా బయటపడ్డారు. ముంబై శివారు ఘోడ్‌బందర్‌లో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయాల్సి ఉంది. దీనికి గాను ఆయన బయలుదేరిన హెలికాప్టర్ ఓ పాఠశాల మైదానంలో దిగేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కానీ, మైదానం పైనుంచి సమీప భవనాలకు కేబుల్ వైరు ఉన్న విషయాన్ని అధికారులు గమనించలేదు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తుండగా కేబుల్ వైరు అడ్డు ఉన్నట్లు పైలెట్ గమనించాడు. దీంతో ఆయన ల్యాండ్ చేయకుండా మళ్లీ టేకాఫ్ చేశాడు. ఈ ఘటనకు బాధ్యుడైన గ్రౌండ్ ఇంజనీర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

Dwaraka

'నాలా' బిల్లుకు ఆమోదం

చట్టసభలు ఆమోదించిన బిల్లుపై సంతకం చేసిన గవర్నర్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూ వినియోగ మార్పిడి (నాలా) చట్ట సవరణ బిల్లుకు ఎట్టకేలకు గవర్నర్ నరసింహన్ ఆమోద ముద్ర వేశారు. శాసనసభ, శాసనమండలి గత నెలలో ఆమోదించి పంపిన నాలా బిల్లుపై గవర్నర్ గురువారం సంతకం చేశారని హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ వర్గాలు ధ్రువీకరించాయి. నాలా రుసుము తగ్గింపు, నిబంధనల సవరణపై ఆర్డినెన్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలల క్రితం పంపిన ప్రతిపాదనలపై గవర్నర్ పలు సందేహాలను వ్యక్తం చేయడమే కాకుండా పునఃపరిశీలించాలంటూ ఫైల్ వెనక్కి పంపటం తెలిసిందే. అయితే దీన్ని పట్టించుకోకుండా, సందేహాలను నివృత్తి చేయకుండా ఆర్డినెన్స్ ఫైల్‌ను పక్కన పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం అవే అంశాలతో చట్టసభల్లో బిల్లు ఆమోదించింది.

రాజకీయ విమర్శలవల్లే గవర్నర్ లేఖ: తెలంగాణలో నాలా బిల్లును ఆమోదించిన గవర్నర్ ఆంధ్రప్రదేశ్ చట్టసభలు ఆమోదించిన నాలా బిల్లును మాత్రం పక్కనపెట్టటం వివక్షకు నిదర్శనమంటూ బీజేపీ శాసన సభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు విమర్శలు చేయటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. విష్ణుకుమార్‌రాజుతో సీఎం చంద్రబాబే ఈ విమర్శలు చేయించినట్లు రాజ్‌భవన్‌కు వేగులు చేరవేశారు. తనపై రాజకీయ విమర్శలపై కలత చెందిన నరసింహన్ కొందరు ఉన్నతాధికారులతోనూ ఈ అంశాన్ని ప్రస్తావించారు.

సీఎంకు లేఖ రాసిన గవర్నర్: ఈ నేపథ్యంలో పూర్తి వివరాలు ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో నాలా ఆర్డినెన్స్, బిల్లు విషయాల్లో జరిగిన పరిణామాలను విశదీకరిస్తూ గవర్నర్ నేరుగా సీఎం చంద్రబాబుకే లేఖ రాశారు. ఈ పరిణామాల నేపథ్యంలో బిల్లుపై గవర్నర్ గురువారం సంతకం చేశారు. గవర్నర్ ఆమోదించిన నేపథ్యంలో త్వరలో నాలా సవరణ ఉత్తర్వులు జారీ కానున్నాయి. దీంతో విశాఖపట్నం, విజయవాడలో నాలా రుసుము 5 నుంచి 2 శాతానికి, మిగిలిన చోట్ల 9 నుంచి 3 శాతానికి తగ్గనుంది.

ఆరోపణల్లో నిజం లేదు: రాజ్‌భవన్ వర్గాలు: తెలంగాణ ప్రభుత్వం పంపిన నాలా బిల్లును ఆమోదించిన గవర్నర్ ఆంధ్రప్రదేశ్ చట్టసభలు ఆమోదించిన బిల్లును పక్కన పెట్టారంటూ కొందరు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని రాజ్ భవన్ వర్గాలు స్పష్టం చేశాయి. 'అసలు తెలంగాణ సర్కారు నుంచి నాలా బిల్లు ఇప్పటివరకూ రాజ్‌భవన్‌కే రాలేదని తెలిపాయి.

అగ్రిగోల్డ్ బాధితులకు బాసటగా వైఎస్సార్‌సీపీ కమిటీ

11 మందిని నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్

సాక్షి, హైదరాబాద్: అగ్రిగోల్డ్ బాధితుల తరపున అసెంబ్లీలోనూ, ప్రజాక్షేత్రంలోనూ తొలి నుంచీ పోరాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాజాగా వారికి అండగా నిలబడేందుకు అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో 11 మంది పార్టీ నేతలను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఈ కమిటీ ఆయా ప్రాంతాల వారీగా బాధితుల సమాచారం సేకరించడంతో పాటు వారికి అండగా నిలుస్తూ.. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తుందని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి విడుదలైన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కమిటీలో కొలుసు పార్థసారథి (కృష్ణా జిల్లా), ఆదిమూలపు సురేష్ (ప్రకాశం), పి.అనిల్‌కుమార్ యాదవ్ (నెల్లూరు), కురసాల కన్నబాబు (తూర్పు గోదావరి), ముదునూరి ప్రసాదరాజు (ప.గోదావరి), జోగి రమేశ్ (కృష్ణా), కొట్టమూడి సురేష్‌బాబు (వైఎస్సార్ జిల్లా), గౌరు వెంకటరెడ్డి (కర్నూలు), టీజేఆర్ సుధాకర్‌బాబు (గుంటూరు), మజ్జి శ్రీనివాసరావు (విజయనగరం), లేళ్ల అప్పిరెడ్డి (గుంటూరు) ఉన్నారు. కమిటీ కోఆర్డినేటర్‌గా అప్పిరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తారని ఆ ప్రకటనలో వివరించారు.

కోడి పందేల నిర్వహణపై నేడు విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: కోడి పందేల నిర్వహణపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు శుక్రవారం విచారించనుంది. పిటిషనర్ కనుమూరు రఘురామకృష్ణ రాజు తరపు న్యాయవాది గల్లా సతీష్ ఈ పిటిషన్‌ను గురువారం ప్రస్తావించగా సోమవారం విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. అయితే అప్పటికి పండుగ పూర్తవుతుందని న్యాయవాది నివేదించగా శుక్రవారం విచారణ చేపట్టేందుకు అనుమతిచ్చారు.

హైకోర్టు హెచ్చరించినా లెక్కేలేదు

కోళ్ల పందేలను ప్రారంభించిన అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే

పిఠాపురం: కోళ్ల పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కోర్టులు హెచ్చరిస్తున్నా అధికార పార్టీ నేతలు లెక్కచేయడం లేదు. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలే దగ్గరుండి కోళ్ల పందేలను నడిపిస్తున్నారు. గురువారం తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో కాకినాడ ఎంపీ తోట నరసింహం, పిఠాపురం ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ స్వయంగా కోళ్లను 'ఢీ'కొట్టించి పందేలకు శ్రీకారం చుట్టారు. కోళ్ల పందేలు అడ్డుకునేందుకు పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లు చేస్తుంటే... అధికార పార్టీ నేతల అండతో నిర్వాహకులు దర్జాగా పందేలకు సన్నాహాలు చేస్తున్నారు.

రైతులను ముంచిన ఈ పెద్దమనిషిని నిలదీద్దాం

చంద్రబాబుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మండిపాటు

- ధరల స్థిరీకరణ నిధి ఏమైందని నిలదీత
- గిట్టుబాటు ధరలు ఇవ్వకపోగా దళారీగా మారాడని ఆగ్రహం
- హెరిటేజ్ కోసం విజయ డెయిరీని మూసేయించాడు



నెమలిగుంటపల్లిలో నిర్వహించిన రైతుల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'ఆ రోజు నేను మూడు వేల కోట్ల రూపాయలతో రైతులకు ధరల స్థిరీకరణ నిధి పెడతానంటే.. అయితే తాను ఐదు వేల కోట్లతో పెడతానని ఈ పెద్దమనిషి అన్నాడు. మీరంతా గుండెల మీద చేతులు వేసుకుని ఒక్కసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఇవాళ మనం వేసే ఏ ఒక్క పంటకైనా గిట్టుబాటు ధర లభిస్తోందా? చంద్రబాబు రూ.ఐదు వేల కోట్లతో పెడతానన్న ధరల స్థిరీకరణ నిధి ఏమైంది? ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి వస్తుందని వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వకుండా రైతులను వేధిస్తున్నారు. తన హెరిటేజ్ సంస్థ లాభాల కోసం విజయా డెయిరీని మూయించాడు. ఒక్క హామీ నెరవేర్చకుండా అన్ని వర్గాల వారినీ మోసం చేసిన ఈ పెద్దమనిషిని నిలదీద్దాం' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 59వ రోజు గురువారం చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నెమలిగుంటపల్లిలో రైతుల ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనంలో జగన్ ఏం మాట్లాడారంటే..

కరువు, చంద్రబాబు కవలలు

చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఆయనతో పాటు కరువు కూడా తోడుగా వచ్చింది. చిత్తూరు జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాల్సిన పరిస్థితి. కరువు మండలాల కింద డిక్లేర్ చేస్తే ప్రభుత్వం ఏదైనా సాయం చేస్తుందని ఏ రైతైనా ఆశిస్తాడు. అంటే ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందని. బ్యాంకులకు కట్టాల్సిన రుణాల వడ్డీలు మాఫీ అయిపోతాయేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తారు. కాని ఈ నాలుగేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం రైతులకు ఎలాంటి సాయం చేయలేదు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సి వస్తుందేమోనని మంత్రివర్గ సమావేశం పెట్టి కరువు మండలాలను కూడా ప్రకటించని పరిస్థితి ఇవాళ చూస్తున్నాం.

నీళ్లకు.. పాలకు తేడా చెప్పిన ఓ అమ్మ

ఈ రోజు నా వద్దకు ఒక అమ్మ వచ్చింది. వస్తూ వస్తూ ఒక లీటరు పాలు, ఒక లీటరు నీళ్లు, బెల్లం ముద్ద తెచ్చింది. మొదట బెల్లం ముద్ద చూపించింది. 'అన్నా.. మా జిల్లాలో పండే పంట ఇదేనన్నా.. నల్లగా ఉంటే మేమేమి చెయ్యమంటరన్నా.. ఇది నల్లగా ఉందని చంద్రబాబు ఆంక్షలు పెడుతున్నడు. కొనేవాళ్లు కరువయి పోయారు. మాకు గత్యంతరం లేక ప్రైవేట్ ఫ్యాక్టరీల్లో ఏరేటు చెబితే ఆ రేటుకు చెరకును తోసేయాల్సొస్తోందన్నా.. ఇలా అయితే బతికేదెలా అన్నా' అని బాధపడింది. 'అన్నా.. ఇది ఒక లీటరు నీళ్ల బాటిలన్నా.. దీని రేటు రూ.20. అన్నా.. ఇది లీటరు పాల బాటిల్. దీని రేటు రూ.22. ఈ రోజు ఒక లీటరు నీళ్లు 20 రూపాయలు, ఒక లీటరు పాలు రూ.22 . ఎలా గిట్టుబాటవుతుం దన్నా.. ఎలా బతకాలన్నా' అని అంటుంటే బాధనిపించింది. దగ్గరుండీ చంద్రబాబు ఏమి చేశారు. తన హెరిటేజ్ ఫ్యాక్టరీకి పాలు కొనుగోలు చేసే దాంట్లో లాభాలు రావాలని పాల రేటు తగ్గించి, కో ఆపరేటివ్ రంగంలో ఉన్న చిత్తూరులోని విజయ డెయిరీని మూసేయించాడు. ఆ బాధలు భరించలేక రైతులు హెరిటేజ్‌కు పాలమ్మడం మొదలు పెట్టారు.

ముఖ్యమంత్రే దళారిగా మారి..

ఈ పెద్దమనిషి ఇంకో అడుగు ముందుకు వేసి హెరిటేజ్ ఫ్రెష్ షాపులు తెరిచాడు. ఆ షాపుల్లో కూరగాయలు అమ్మటం మొదలుపెట్టాడు. అంటే ఈయనే దగ్గరుండి మరీ దళారీ వ్యవస్థను ప్రోత్సహించడం మొదలు పెట్టాడు. దీంతో రైతుల దగ్గర ఉన్నప్పుడు రేటు తక్కువ ఉంటుంది. ఇదే దళారీల దగ్గరకు, చంద్రబాబు దుకాణం దగ్గరకు వెళ్లాక రేటు అమాంతం పెరిగి పోతుంది. ముఖ్యమంత్రి రైతుల గురించి ఎంత గొప్పగా ఆలోచన చేస్తున్నాడనేందుకు ఒక ఉదాహరణ ఏమిటంటే.. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లే. ఈ మధ్య కాలంలోనే నేను పాదయాత్ర మొదలుపెట్టిన తర్వాత రోజుకు కనీసం ఐదారుగురు రైతులు నాదగ్గరకొచ్చి ఈ ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని బాధపడుతున్నారు. అప్లికేషన్ పెట్టి రెండు మూడేళ్లయిందన్నా.. ఇంతవరకు మాకు కరెంటు కనెక్షన్ ఇవ్వటం లేదన్నా.. అని వాపోతున్నారు. కరెంటు కనెక్షన్ ఇస్తే ఉచితంగా కరెంటు ఇవ్వాల్సి వస్తుందని ఎగరగొట్టే కార్యక్రమం జరుగుతోంది. దేవుడి దయ, మీ అందరి ఆశీస్సుల వల్ల మనందరి ప్రభుత్వం రాగానే నవరత్నాలతో అందరినీ ఆదుకుంటాం'' అని వైఎస్ జగన్ అన్నారు.

రైతుల కోసం ఇలా..

- మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు పగటిపూటే ఉచిత విద్యుత్.
- గిట్టుబాటు ధరల కోసం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు. చిత్తూరు జిల్లా రైతులకు ఇంకొక మాట చెబుతున్నా.. నల్లబెల్లం మీద ఆంక్షలు పూర్తిగా తీసేస్తా.
- మనం అధికారంలోకి రాగానే చిత్తూరు డెయిరీ తెరిపిస్తాం. ప్రతి జిల్లాలో కో ఆపరేటివ్ రంగంలో పాలసేకరణ పెంచుతాం. డెయిరీకి పాలు పోసే ప్రతి రైతుకూ లీటరుకు రూ.4 సబ్సిడీ ఇస్తాం.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

జాడలేని కంపెనీలకు రూ. కోట్లలో రాయితీలు


సాక్షి, అమరావతి: కొత్త రాష్ట్రం కాబట్టి కంపెనీలకు రాయితీలు ఇవ్వడం సహజం. వాటిని రప్పించే కన్సల్టెన్సీకి కూడా ఫీజులు చెల్లించటం మామూలే. కానీ ఏ కంపెనీలు వస్తాయో తెలియదు... ఎప్పుడొస్తాయో అంతకన్నా తెలియదు. అయినా సరే వచ్చేస్తున్నాయంటే ముందే రాయితీలు ఇస్తారా? కార్యాలయాల కోసం రూ. కోట్లలో అద్దెలు చెల్లిస్తారా? రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడదే చేస్తోంది. గ్లోబల్ ఇన్‌హౌస్ (ఏపీజీఐసీ) పాలసీ కింద బెంగళూరుకు చెందిన ఏఎన్ఎస్ఆర్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి రూ. కోట్లలో ప్రయోజనం చేకూరుస్తూ గురువారం జీవో జారీ చేసింది. వివిధ దేశాలకు చెందిన ఐటీ కంపెనీలను ఏపీకి రప్పించి వందల మందికి ఉపాధి కల్పిస్తామని ఈ కన్సల్టెన్సీ పేర్కొంది. ఉద్యోగులను తామే నియమించుకుని, ఏవైనా కంపెనీలు వచ్చాక ఆ ఉద్యోగులను వారికి బదలాయిస్తామంది. అప్పటివరకూ వారు కన్సల్టెన్సీ ఆధ్వర్యంలోనే పనిచేస్తారు. ఈ సంస్థలో 200 మంది ఉద్యోగులు పనిచేయడానికి వీలుగా విశాఖలో అవసరమైన భవనాన్ని ప్రభుత్వమే అద్దె చెల్లించి సమకూరుస్తుంది.

ఏడాదిన్నర అద్దె ప్రభుత్వమే చెల్లిస్తుంది

ఎప్పుడో వచ్చే ఐటీ కంపెనీల కోసం ప్రైవేట్ వ్యక్తులు భవనాలు నిర్మిస్తారు. కంపెనీలు వచ్చే వరకూ వాటికి ప్రభుత్వమే అద్దె చెల్లిస్తుంది. దీనికోసం డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్క్ (డీటీపీ) అనే మరో పాలసీని ప్రవేశపెట్టారు. ఏఎన్ఎస్ఆర్ కన్సల్టెన్సీ ఆఫీస్‌కు అడుగు రూ. 80 చొప్పున 15,000 అడుగులకు అద్దె చెల్లిస్తారు. ఇలా ఊరూ పేరు లేని కంపెనీల కోసం నెలకు రూ.12 లక్షల చొప్పున 18 నెలల పాటు రూ. 2.16 కోట్లు అద్దెగా కన్సల్టెన్సీకి చెల్లించనున్నారు. అంతేకాదు వెయ్యి మంది ఉద్యోగుల కోసం అద్దెకోసం మరో రూ. 11 కోట్ల వరకూ అవుతుంది. అంతా కలిపి ఏడాదిన్నరలో రూ. 13 కోట్లకుపైగా కన్సల్టెన్సీకి చెల్లించనున్నారు. ఒకవేళ ఐటీ కంపెనీలను రప్పించటంలో కన్సల్టెన్సీ విఫలమైతే 18 నెలల తర్వాత ఉద్యోగులు రోడ్డున పడే ప్రమాదం ఉంది. అసలు ఐటీ కంపెనీలు వచ్చేవరకు వీరికి ఎలాంటి విధులు కేటాయిస్తారు? వేతనాలు ఎలా చెల్లిస్తారు? అనే అంశాలపై భరోసా ఇవ్వటం లేదు.

నేడు ప్రధానితో సీఎం భేటీ

ఏడాదిన్నర తర్వాత చంద్రబాబుకు అపాయింట్‌మెంట్

సాక్షి, అమరావతి/ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఎట్టకేలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. శుక్రవారం ఉదయం 10.40 గంటలకు ప్రధానితో సమావేశమయ్యేందుకు ఆయన కార్యాలయం చంద్రబాబుకు సమయం కేటాయించింది. మోదీతో భేటీ కోసం సీఎం ఏడాది నుంచి ఎదురు చూస్తున్నారు. అపాయింట్‌మెంట్ కోరినా మోదీ ఇవ్వడం లేదంటూ టీడీపీ నేతలు చాలా రోజులుగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా టీడీపీ ఎంపీలు ప్రధానిని కలినప్పుడు ఈ వ్యవహారాన్ని ప్రస్తావించారు. చంద్రబాబుకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంగీకరించి మోదీ 12వ తేదీన సమయం ఇచ్చారు. కాగా సీఎం చంద్రబాబు గురువారం రాత్రి 9.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు.

గతంలో ప్రయత్నాలన్నీ నిష్ఫలం

చంద్రబాబుతో ముఖాముఖి సమావేశానికి మోదీ దాదాపు ఏడాదిన్నర నుంచి అవకాశం ఇవ్వకపోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మోదీని కలిసేందుకు బాబు చేసిన ప్రయత్నాలు ఫలప్రదం కాలేదు. ప్రధానిని కలిసేందుకు బాబు పలుమార్లు యత్నించినాఅవి నిష్ఫలమే అయ్యాయి.దీంతో బాబును కలిసేందుకు మోదీ ఎందుకు ఇష్టపడడం లేదన్న విషయం చర్చనీయాంశంగా మారింది.

చంద్రబాబుపై ఫిర్యాదుల పరంపర

రాజధాని నిర్మాణంసహా రాష్ట్రంలో జరుగుతున్న పలు అవినీతి వ్యవహారాలపై ప్రధాని మోదీకి ఫిర్యాదులందడంతో ఆయన బాబుకు ప్రాధాన్యం ఇవ్వట్లేదనే వాదన వినిపించింది. అమరావతి పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపడం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇష్టారాజ్యం, రాష్ట్రంలో ఏమీ జరక్కపోయినా ఏదో అద్భుతం చోటుచేసుకుంటోందంటూ అసత్యాలు ప్రచారం చేస్తుండడంపై రాష్ట్ర బీజేపీ నేతలతోపాటు పలువురు మోదీకి నివేదికలు ఇచ్చారు. దీనికితోడు రాజకీయ పరమైన కారణాలు కూడా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. ఎన్డీఏలో ఉంటూనే మూడో ఫ్రంట్ కోసం చంద్రబాబు తెరవెనుక ప్రయత్నాలు చేశారనే ప్రచారం నేపథ్యంలో బాబును మోదీ దూరం పెట్టారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీపీఐ అగ్రనేతలు రాజా, నారాయణలు మోదీని కలిశారు. ఆ తర్వాత వెంటనే టీడీపీ ఎంపీలు బీజేపీ ఎంపీలను వెంటబెట్టుకుని వెళ్లి మోదీ అపాయింట్‌మెంట్ తమకూ ఇవ్వాలని కోరడంతో ఇచ్చారు. ఆ సమయంలో తమ అధినేత బాబుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని టీడీపీ ఎంపీలు కోరడంతో ప్రధాని అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది.

నేడు పుణేలో 'మినీ పోలవరం' సందర్శన

మహారాష్ట్రలోని పుణేలో సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్)లో ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మినీ పోలవరం ప్రాజెక్టును బాబు శుక్రవారం పరిశీలిం చనున్నారు. శుక్రవారం ప్రధానితో భేటీ ముగిశాక ప్రత్యేక విమానంలో సీఎం పుణేకు చేరుకుంటారు.

పంచాయతీలకు ప్రత్యేక ట్రిబ్యునల్

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు

సాక్షి, హైదరాబాద్: సర్పంచ్‌లు ఏ కారణంతోనైనా అనర్హతకు గురైతే అప్పిలేట్ అథారిటీగా పంచాయతీలకు ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం హైదరాబాద్‌లో వరుసగా నాలుగోరోజు గురువారం సమావేశమైంది. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరచాలనుకుంటున్న పలు కీలక అంశాలపై సమావేశంలో చర్చించారు. ఇప్పటివరకు సర్పంచ్‌లు ఏదైనా కారణంతో అనర్హతకు గురైతే అప్పిలేట్ అథారిటీగా పంచాయతీరాజ్ శాఖ మంత్రే వ్యవహరిస్తున్నారు. అయితే మంత్రిపై రాజకీయ ఒత్తిళ్లు, ఇతర సమస్యలు వస్తున్నాయనే కారణంతో పంచాయతీలకోసం ప్రత్యేకంగా ట్రిబ్యునల్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మరింత పారదర్శకంగా వ్యవహరించవచ్చని మంత్రివర్గ ఉపసంఘం భావిస్తోంది. చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఎవరైనా ప్రవర్తిస్తే జరిమానా విధించే హక్కును కూడా సర్పంచ్ నేతృత్వంలోని పాలకవర్గానికి కల్పించే అంశంపై చర్చించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలకు అధికారం...: రోడ్లపై చెత్తవేయడం, ఇంట్లోని మురుగునీటిని వీధుల్లోకి వదలడం, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంవంటి 22 అంశాల్లో నిర్ణయాలు తీసుకునే అధికారాలను గ్రామ పంచాయతీలకే ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం భావిస్తోంది. చట్టాన్ని ఉల్లంఘించే వారికి పంచాయతీ పాలకవర్గమే జరిమానా విధించే అంశంపై చర్చ జరిగింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అక్రమ నిర్మాణాల్లాంటివి చేపడితే వాటిని తొలగించేందుకు అయ్యే ఖర్చును కూడా కారకుల నుండే వసూలు చేసే అంశాన్ని సబ్ కమిటీ పరిశీలిస్తోంది. ఇప్పటివరకు పంచాయతీల్లో ఆడిటింగ్ ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు, దానిని సరిచేసేలా చట్టంలో మార్పులు చేయాలని సూచిస్తున్నారు. పంచాయతీల్లో జరుగుతున్న నిధుల వ్యయం, పన్నుల వసూళ్లు.. లాంటివన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనే నిబంధనను చట్టంలో పొందుపరిచే అంశంపైనా సబ్ కమిటీ చర్చించింది. ఇందుకోసం ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకోవాలనే అభిప్రాయాన్ని కమిటీ వ్యక్తం చేసింది. సరిగ్గా పనిచేయని కార్యదర్శులను సరెండర్ చేసే అధికారాన్ని పాలకవర్గానికి కట్టబెట్టే దిశగానూ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్, అదనపు అడ్వొకేట్ జనరల్ రాంచందర్‌రావు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలున్నా పోటీ అర్హత ఉండాలి: గాంధీ నాయక్ వినతి

ముగ్గురు పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హతగా ఉన్న నిబంధనను సవరించాలని గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ గాంధీ నాయక్ కోరారు. ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉన్నవారికి స్థానిక సంస్థల్లో పోటీచేయడానికి వీలులేదనే నిబంధనను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్‌పై రాష్ట్రపతికి ఫిర్యాదు

గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్నారు: రవీంద్రనాయక్

సాక్షి, హైదరాబాద్: ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయకుండా తప్పించుకోవడానికే గిరిజనుల మధ్య ముఖ్యమంత్రి కేసీఆర్ చిచ్చు పెడుతున్నాడని మాజీ ఎంపీ డి.రవీంద్రనాయక్ గురువారం ఆరోపించారు. ఎస్టీల మధ్య చిచ్చు పెడుతున్న సీఎం కేసీఆర్‌పై, గొడవలకు కారణమైన అధికారులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గవర్నర్ 15 రోజులు సమయం కావాలని అడిగారని, మేడారం జాతర ముగిసేదాకా వేచి చూసి తరువాత రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

తెలంగాణ

సంగీతకు కోర్టులో ఊరట

- భర్త ఇంట్లో ఉండేందుకు మియాపూర్ ఫ్యామిలీ కోర్టు అనుమతి
- ఆమె ఖర్చుల కోసం నెలనెలా రూ.20 వేలు ఇవ్వాలి



గురువారం బోడుప్పల్‌లోని భర్త ఇంటి తాళాలు పగులకొడుతున్న సంగీత

హైదరాబాద్: భర్త ఇంటి ముందు 54 రోజులుగా న్యాయపోరాటం చేస్తున్న సంగీతకు మియాపూర్ ఫ్యామిలీ కోర్టులో ఊరట లభించింది. గృహ హింస చట్టం కింద నమోదైన కేసు కొట్టేసేంత వరకు బోడుప్పల్‌లోని భర్త శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సంగీత ఉండేందుకు న్యాయస్థానం అవకాశం కల్పించింది. ప్రతి నెలా ఆమెకు ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఇవ్వాలని భర్త శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించింది. భర్త, అత్తమామలు తనను వేధిస్తున్నారంటూ సంగీత గృహహింస చట్టం కింద పెట్టిన కేసుపై మియాపూర్‌లోని 19వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో గురువారం వాదనలు జరిగాయి. సంగీత అవసరాల కోసం నెలకు రూ.20 వేల చొప్పున భర్త శ్రీనివాస్‌రెడ్డి చెల్లించాలని మధ్యంతర రక్షణ ఉత్తర్వులు (ఇంటిరియమ్ ప్రొటెక్షన్ ఆర్డర్)ను న్యాయస్థానం ఇచ్చింది. ఆమె జీవితం, స్వేచ్ఛకు ఎటువంటి ఆటంకం కలిగించొద్దని, అవసరమైన పక్షంలో భద్రత కోసం సంగీత పోలీసుల సహకారం తీసుకోవచ్చని సూచించింది. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి రజిని ఎదుట సంగీత, ఆమె భర్త శ్రీనివాస్‌రెడ్డి, అత్త ఐలమ్మ, మామ బాల్‌రెడ్డి హాజరయ్యారు. కాగా, సంగీత ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇచ్చినప్పుడు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదంటూ శ్రీనివాస్‌రెడ్డి కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు.

ఇంట్లోకి వెళ్లిన సంగీత

ఐదేళ్ల క్రితమే తనను ఇంటి నుంచి బయటకు గెంటేశారని, తనకు న్యాయం చేయాలని బోడుప్పల్‌లోని శ్రీనివాస్‌రెడ్డి ఇంటి వద్ద 54 రోజులుగా సంగీత దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. న్యాయస్థానం తనకు నుంచి అనుకూలంగా ఆదేశాలు రావడంతో సంగీత దీక్ష విరమించింది. గురువారం సాయంత్రం ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లింది. ఈ సందర్భంగా సంగీత విలేకరులతో మాట్లాడుతూ.. తనకు అన్యాయం చేసిన భర్త, అత్తమామలను కఠినంగా శిక్షించాలని, కోర్టు ఆదేశాలు తనలో మరింత నమ్మకం కలిగించాయని చెప్పారు. తన పాప అభిదతో కలసి ఇక సంతోషంగా ఉంటానని, తనకు పూర్తి న్యాయం జరిగే వరకు న్యాయస్థానం ద్వారా పోరాడతానన్నారు.

6 నెలలు.. రూ.18 వేల కోట్లు!

జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత పన్నుల శాఖ ఆదాయమిది

- గతేడాదితో పోలిస్తే పన్ను రాబడిలో 10 శాతం వృద్ధి
- కేంద్ర, రాష్ట్ర జీఎస్టీల కింద వచ్చింది రూ.8వేల కోట్లు
- వ్యాట్ ఆదాయం 10వేల కోట్ల పైమాటే
- కేంద్రం ఇచ్చిన పరిహారం మాత్రం రూ.338 కోట్లే..



సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన ఆరు మాసాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల శాఖ ద్వారా రూ.18వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. గత జూలై నుంచి డిసెంబర్ వరకు పన్నుల శాఖ గణాంకాల ప్రకారం మొత్తం రూ.18,081.25 కోట్లు ఖజానాకు చేరాయి. గతేడాది (2016–2017 ఆర్థిక సంవత్సరం) తో పోలిస్తే ఈ ఆరు నెలల్లో 10 శాతం వరకు పన్ను రాబడిలో వృద్ధి నమోదైంది. అయితే, జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత పన్నుల ఆదాయం తగ్గిపోతుందనే అనుమానాలు పటాపంచలయ్యాయి. కేంద్రం నుంచి ఆశించిన మేర పరిహారం రాకపోయినా.. పన్నుల ద్వారా ఆదాయం పెరగడం పట్ల ఆ శాఖ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

జీఎస్టీ లెక్క రూ.8వేల కోట్ల వరకు..

వాస్తవానికి మద్యం, పెట్రోలు తప్ప మిగిలిన అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ అమలవుతోంది. అయితే, పెట్రోల్ పన్నును కూడా వ్యాట్ కింద పన్నుల శాఖే వసూలు చేసి నమోదు చేస్తుంది. మద్యం ఆదాయాన్ని మాత్రం ఎక్సైజ్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ ఆదాయాన్ని మినహాయించి పన్నుల శాఖ వసూలు చేసింది ఈ ఆరు నెలల్లో 18 వేల కోట్ల రూపాయలపైనే ఉండటం గమనార్హం. ఇందులో రూ.10 వేల కోట్ల వరకు పెట్రో, ఇతర వ్యాట్ వర్తింపు వస్తువుల నుంచి వసూలైంది. కాగా, జీఎస్టీ పేరుతో రూ.8వేల కోట్ల వరకు వచ్చాయి. ఇందులో కూడా రాష్ట్ర జీఎస్టీ కింద రూ.3,969 కోట్లు, ఐజీఎస్టీ (వస్తు వినియోగ పన్ను) కింద రూ.3,438 కోట్లు వచ్చాయని గణాంకాలు చెబుతున్నాయి. దీనికి తోడు కేంద్రం నుంచి మూడు దఫాల్లో ఇప్పటివరకు రూ.338 కోట్లు పరిహారం కింద వచ్చింది. అయితే, రాష్ట్ర జీఎస్టీ జూలై నుంచి ప్రతి నెలా తగ్గుతుండగా, ఐజీఎస్టీలో ప్రతి నెలా వృద్ధి కనిపిస్తుండడం గమనార్హం.

గతేడాది రూ.16,220 కోట్లే..

గతేడాదితో పోలిస్తే జీఎస్టీ అమలు చేసిన ఈ ఏడాది పన్నుల శాఖ ఆదాయంలో పెరుగుదల కనిపిస్తోంది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో జూలై నుంచి డిసెంబర్ వరకు రూ.16,220 కోట్లు ఆదాయం రాగా, ఈసారి అది రూ.18వేల కోట్లకు చేరింది. అంటే గతేడాది కంటే 10 శాతం వృద్ధి నమోదైంది. మరో విశేషమేమిటంటే జీఎస్టీ అమల్లోకి వచ్చిన 2017 జూలైలో అత్యధికంగా రూ.3,251 కోట్ల పన్నులు వసూలయ్యాయి.

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పన్నుల శాఖ ఆదాయ వివరాలు

నెల	2016-17	2017-18 (రూ.కోట్లలో)
జూలై	2,292.1	3,251.38
ఆగస్టు	2,799.56	2,675.21
సెప్టెంబర్	2,815.44	2,976.59
అక్టోబర్	2,756.79	3,125.18
నవంబర్	2,880.8	3,075.93
డిసెంబర్	2,675.54	2,976.96
మొత్తం	16,220.23	18,081.25

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సాక్షి **భవిత** 15
స్పర్ధయా వర్ధతే విద్య
శుక్రవారం 12-1-2018

బులెటిన్ బోర్డ్

బీహెచ్‌ఈఎల్‌లో 25 ఖాళీలు

చెన్నైలోని భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)కు చెందిన పవర్ సెక్టార్-సదరన్ రీజియన్ విభాగం.. 25 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** ఎగ్జిక్యూటివ్ (ఎఫ్‌టీఏ-సివిల్)-12; సూపర్‌వైజర్ (ఎఫ్‌టీఏ-సివిల్)-13.
- **వేతనం:** ఎగ్జిక్యూటివ్-రూ.54,060; సూపర్‌వైజర్-రూ.26,920.
- **అర్హతలు:** ఎగ్జిక్యూటివ్‌కు కనీసం 60 శాతం (ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం) మార్కులతో సివిల్‌లో బీఈ/బీటెక్/ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/డ్యూయల్ డిగ్రీతోపాటు సంబంధిత రంగంలో కనీసం ఐదేళ్ల ఉద్యోగానుభవం; సూపర్‌వైజర్‌కు కనీసం 60 శాతం (ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం) మార్కులతో సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమాతోపాటు సంబంధిత రంగంలో కనీసం ఐదేళ్ల ఉద్యోగానుభవం. ❖ **వయసు:** 2018, జనవరి 1 నాటికి 37 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** అభ్యర్థుల సంఖ్యను బట్టి రాతపరీక్ష/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.200; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీకి ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్లు, సంబంధిత ధ్రువపత్రాల నకళ్లతో కలిపి పంపాలి. ❖ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 17, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 1, 2018.
- **వెబ్‌సైట్:** www.bhelpssr.co.in , careers.bhel.in

ఏఎల్ఐఎంసీవోలో 36 ఖాళీలు

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఉన్న ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఐఎంసీవో) ప్రధాన కార్యాలయం.. 36 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **శాఖల వారీ ఖాళీలు:** కాన్పూర్-5, న్యూఢిల్లీ-3, గువాహటి-7, చన్నలాన్-3, జబల్పూర్-3, బెంగళూరు-3, భువనేశ్వర్-3, కోల్‌కతా-3, హైదరాబాద్-3.
- **పోస్టు:** ఆడియాలజిస్ట్ (ప్రొఫెషనల్). ❖ **వేతనం:** రూ.40,000.
- **అర్హతలు:** ఆడియాలజీ, స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీలో బ్యాచిలర్/మాస్టర్ డిగ్రీ. అలాగే ఆర్‌సీఐ సెంట్రల్ రిహాబిలిటేషన్ రిజిస్టర్ (సీఆర్ఆర్) రిజిస్ట్రేషన్, ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి 34 ఏళ్లు ఉండాలి. ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** జనవరి 22, 2018. ❖ **వెబ్‌సైట్:** www.alimco.in

ఐటీఐ లిమిటెడ్‌లో 20 ఖాళీలు

బెంగళూరులోని ఐటీఐ లిమిటెడ్.. 20 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ❖ **పోస్టు-ఖాళీలు:** చీఫ్ మేనేజర్ (సీఎం), డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం), అడిషనల్ జనరల్ మేనేజర్ (ఏజీఎం), జనరల్ మేనేజర్(జీఎం)-20. ❖ **విభాగాలు:** డిఫెన్స్ నెట్‌వర్క్, భారత్ నెట్, ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్‌ఆర్. ❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బీఈ/బీటెక్/సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఎంబీఏ/పీజీ/పీజీ డిప్లొమా. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం. ❖ **వయసు:** జీఎంకు 52 ఏళ్లు; ఏజీఎం, డీజీఎం-50 ఏళ్లు; సీఎం-45 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 9, 2018. ❖ **వెబ్‌సైట్:** www.itiltd-india.com

నిమ్‌హాన్స్‌లో పీహెచ్‌డీ, పీజీ కోర్సులు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్: నిమ్‌హాన్స్).. 2018-19కి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సులు:** పీహెచ్‌డీ (ఇన్‌స్టిట్యూట్ ఫెలోషిప్, ఎక్స్‌టర్నల్ ఫెలోషిప్), సూపర్ స్పెషాలిటీ , పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ/డిప్లొమా, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్. ❖ **ఎంపిక:** ప్రవేశ పరీక్ష.
- **దరఖాస్తు రుసుం:** రూ.1,500; ఎస్సీ/ఎస్టీలకు రూ.1,000; దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. చివరి తేదీ: ఫిబ్రవరి 4, 2018. వెబ్‌సైట్: www.nimhans.ac.in

హయ్యర్ ఎడ్యుకేషన్



నాటా-2018

నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్

అబ్బురపరచే ఆకాశ హర్మ్యాలు, కళ్లు చెదిరే నిర్మాణాలను చూసినప్పుడు ఇంత అద్భుతంగా ఎలా కట్టారో! అనిపిస్తుంది కదా. ఎంతో నైపుణ్యం, కృషి, శ్రమ ఉంటేనే ఇలాంటి నిర్మాణాలు సాధ్యమవుతాయనడంలో సందేహం లేదు. అలాంటి కట్టడాల్లో సివిల్ ఇంజనీర్ల పాత్ర ఎంత ఉంటుందో అంతే స్థాయిలో ఆర్కిటెక్టుల సృజనాత్మకతా ఉంటుంది. నిర్మాణాలను అందంగా తీర్చిదిద్దడంలోను, వాటికి చూడచక్కని రూపమివ్వడంలోనూ ఆర్కిటెక్టులదే ప్రధాన భూమిక. ఇలాంటి ఆర్కిటెక్టులుగా ఉన్నత కెరీర్‌ను సుస్థిరం చేసుకోవాలంటే రాయాల్సిన పరీక్ష.. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా). 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి నాటా-2018కు నోటిఫికేషన్ విడుదలైంది. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ).. ఏటా నాటాను నిర్వహిస్తోంది. ఇందులో సాధించే స్కోర్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సులో చేరొచ్చు.

- **విద్యార్హత:** మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్/మూడేళ్ల డిప్లొమా/ఇంటర్నేషనల్ బ్యాకులరేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయోపరిమితి:** 2018, జూలై 31 నాటికి 17 ఏళ్లు పూర్తికావాలి.

పరీక్ష విధానం

- మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో 2 భాగాలు ఉంటాయి. పార్ట్-ఎ కు 120 మార్కులు కేటాయించారు. ఈ విభాగాన్ని 90 నిమిషాల్లో పూర్తిచేయాలి. ఇందులో మ్యాథమెటిక్స్ నుంచి 20, జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి 40 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. ఇది ఆన్‌లైన్ పరీక్ష.
- పార్ట్-బి కూడా 90 నిమిషాల వ్యవధిలోనే ఉంటుంది. దీనికి 80 మార్కులు కేటాయించారు. ఏ4 సైజు పేపర్‌పై రెండు ప్రశ్నలకు డ్రాయింగ్స్ గీయాలి. ఒక్కో చిత్రానికి 40 చొప్పున మార్కులు ఉంటాయి.

అర్హత మార్కులు

- మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల (ఎంసీక్యూ) విభాగంలో కనీసం 25 శాతం మార్కులు సాధించాలి. అంటే 120 మార్కులకు కనీసం 30 మార్కులు రావాలి.
- డ్రాయింగ్ విభాగంలో కనీసం 25 శాతం మార్కులు సాధించాలి. అంటే 80 మార్కులకు కనీసం 20 మార్కులు రావాలి.
- మొత్తంమీద అర్హత సాధించేందుకు 200 మార్కులకు పొందాల్సిన మార్కులను పరీక్ష తర్వాత ఆర్కిటెక్చర్ కౌన్సిల్ నిర్ణయిస్తుంది.
- నాటా-2018లో సాధించిన స్కోర్ 2018-19 విద్యా సంవత్సరానికి మాత్రమే చెల్లుబాటవుతుంది.

పరీక్ష సిలబస్

- పార్ట్- ఏలో మ్యాథ్స్, జనరల్ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. మ్యాథమెటిక్స్‌లో ఆల్జీబ్రా, లాగరిథమ్స్, మ్యాట్రిసెస్, ట్రిగనోమెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, 3 డైమన్షనల్ కోఆర్డినేట్ జామెట్రీ, థియరీ ఆఫ్ క్యాలిక్యులస్, అప్లికేషన్ ఆఫ్ క్యాలిక్యులస్, పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ అధ్యాయాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- జనరల్ ఆప్టిట్యూడ్ సెక్షన్‌లో మ్యాథమెటికల్ రీజనింగ్, సెట్స్ అండ్ రిలేషన్స్ (సెట్స్, సబ్‌సెట్స్, పవర్‌సెట్, వెన్‌డయాగ్రమ్, డీమోర్గాన్స్ లాస్ తదితర అంశాలు) నుంచి ప్రశ్నలుంటాయి. వీటితో పాటు ప్రఖ్యాత ఆర్కిటెక్చరల్ క్రియేషన్స్‌పై జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలూ ఉంటాయి. అనలిటికల్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ (విజువల్, న్యూమరికల్, వెర్బల్)పై కూడా ప్రశ్నలు ఎదురవుతాయి.

డ్రాయింగ్ టెస్ట్

అభ్యర్థిలోని సృజనాత్మకతను పరీక్షించేలా ఈ టెస్ట్ ఉంటుంది. ఇందులో నిర్ణీత ఆకారం లేదా వస్తువును అభ్యర్థి ముందుంచి.. దాని ఆధారంగా ఊహాశక్తితో డ్రాయింగ్ గీయమంటారు. ఒక వస్తువును పలు కోణాల్లో చిత్రించమనడం, నిర్ణీత ఆకారానికి ఆకట్టుకునే రంగులు వేయడం వంటి ప్రశ్నలు ఎదురవుతాయి. నిజజీవితంలో ఎదురైన సంఘటనలను ఊహించుకుంటూ వాటికి సంబంధించిన పెన్సిల్ చిత్రాలను గీయమని అడుగుతుంటారు.

ఈ పేపర్‌ను ఒకరి కంటే ఎక్కువ ఎగ్జామినర్లు దిద్దుతారు. వారు ఇచ్చిన మార్కులను సగటు చేసి తుది మార్కులు కేటాయిస్తారు. అంతిమంగా ఈ సెక్షన్ అభ్యర్థిలోని చిత్రణా నైపుణ్యం, ఊహా శక్తి, అబ్జర్వేషన్ స్కిల్స్‌ను అంచనా వేసే పరీక్ష.

పరీక్ష కేంద్రాలు

- **తెలంగాణ:** హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
- **ఆంధ్రప్రదేశ్:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.

ముఖ్య తేదీలు


- ఆన్‌లైన్‌లో దరఖాస్తు: 2018, జనవరి 16 నుంచి మార్చి 2 వరకు.
- పరీక్ష రుసుం: ఎస్సీ/ఎస్టీలకు రూ.1,500; మిగిలిన వారికి రూ.1,800.
- పరీక్ష తేదీ: 2018, ఏప్రిల్ 29 (ఆదివారం) ఉదయం 10.30 గంటల నుంచి 1.30 వరకు
- ఫలితాల విడుదల: 2018, జూన్ 1.
- వెబ్‌సైట్: www.nata.in

పరీక్ష వివరాలు


సబ్జెక్టు		ప్రశ్నలు	మార్కులు	పరీక్ష విధానం
మ్యాథమెటిక్స్ అండ్	మ్యాథమెటిక్స్	20	40	ఎంసీక్యూ (ఆన్‌లైన్)
జనరల్ ఆప్టిట్యూడ్	జనరల్ ఆప్టిట్యూడ్	40	80	ఎంసీక్యూ (ఆన్‌లైన్)
డ్రాయింగ్ టెస్ట్		2	80	పేపర్, పెన్సిల్

నాటా ద్వారా పరీక్షించే అంశాలు

- సునిశిత పరిశీలన నైపుణ్యాలు.
- సంబంధసామ్యం లేదా అనుపాతాలపై అవగాహన.
- డ్రాయింగ్ నైపుణ్యాలు.
- క్రిటికల్ థింకింగ్.
- కళాసౌందర్యాత్మక దృష్టి.



జీకే కరెంట్ అఫైర్స్



సూపర్ కంప్యూటర్ ప్రత్యూష్

ప్రత్యూష్.. భారతదేశపు అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్ 2018, జనవరి 8న దేశంలోని అత్యంత వేగవంతమైన, తొలి "బహుళ-పెటా ఫ్లాప్స్" సూపర్ కంప్యూటర్ ప్రత్యూష్‌ను దేశానికి అంకితం చేశారు. ప్రత్యూష్ అంటే సూర్యుడు. దీన్ని పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటీఎం)లో ఏర్పాటు చేశారు. వాతావరణ మార్పులను స్పష్టంగా గుర్తించగలిగే సామర్థ్యం ఈ సూపర్ కంప్యూటర్ వల్ల కలుగుతుంది.



ప్రత్యూష్ 6.8 పెటా ఫ్లాప్స్ సామర్థ్యమున్న సూపర్ కంప్యూటర్. కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పెటాఫ్లాప్స్‌లో కొలుస్తారు. ఒక పెటా ఫ్లాప్ అనేది మిలియన్ బిలియన్ ఫ్లోటింగ్ పాయింట్ ఆపరేషన్స్/సెకనుకు సమానం. వాతావరణ పరిశోధనలకు వినియోగించే సూపర్ కంప్యూటర్‌లలో ప్రపంచంలోనే నాలుగో అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్‌గా ప్రత్యూష్ గుర్తింపు సాధించింది. భారత్ కంటే ముందు వరుసలో యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఉన్నాయి.

- ప్రత్యూష్ హై పెర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్‌పీసీ) ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యచంద్రరావు. ప్రత్యూష్ పై కేంద్రప్రభుత్వం రూ.450 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో అత్యాధునిక ఇంటెల్ జియాన్ ప్రాసెసర్లను ఉపయోగించారు.
- ప్రత్యూష్ సూపర్ కంప్యూటర్ సునామీలు, తుపాన్లు, భూకంపాలు, వేడి, అతిశీతల గాలులు, వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తులను ముందే పసిగట్టి, హెచ్చరికలు జారీ చేస్తుంది. అంతేకాక వాతావరణంలో తేమశాతం, సముద్రాల్లో మార్పులు, రుతుపవనాల గమనం తదితర ఎన్నో అంశాలను స్పష్టంగా గుర్తించవచ్చు.
- విపత్తులను ముందే అంచనా వేయడం వల్ల తగిన జాగ్రత్తలు తీసుకోగలిగితే ప్రాణ, ఆస్తినష్టాలను తగ్గించగలిగే అవకాశం ఉంటుంది. కేవలం వరదలు, తుపాను హెచ్చరికలకే పరిమితం కాకుండా రైతులకు మేలుచేసే రుతుపవనాల కదలికలు, వర్షపాతం వివరాలను చెప్పగలుగుతుంది.

- **ప్రస్తుతం వాతావరణ పరిశోధనలకు ఉపయోగించే సూపర్ కంప్యూటర్లున్న దేశాలు, వాటి కంప్యూటింగ్ (గణన) సామర్థ్యం (పెటా ఫ్లాప్స్‌లో)..**

దేశం	సామర్థ్యం
యునైటెడ్ కింగ్‌డమ్	20.4
జపాన్	20.0
యునైటెడ్ స్టేట్స్	10.7
దక్షిణ కొరియా	4.8
ఫ్రాన్స్	4.4
చైనా	2.6
భారత్	6.8

భారత్‌లో సూపర్ కంప్యూటర్లు

భారత్ తొలి సూపర్ కంప్యూటర్‌ను 1991, జూలై 1న ఆవిష్కరించింది. దీనిపేరు పరమ్ 8000. దీన్ని తయారుచేసిన సంస్థ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డ్యాక్). ఈ సంస్థ ప్రధాన కార్యాలయం పుణెలో ఉంది. ప్రఖ్యాత కంప్యూటర్ శాస్త్రవేత్త విజయ్ భట్కర్‌ను భారత్‌లో తొలి సూపర్ కంప్యూటర్ ఆవిష్కర్తగా పేర్కొంటున్నారు. ఆయన ప్రస్తుతం బిహార్‌లోని నలందా విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా పనిచేస్తున్నారు.

- పరమ్ శ్రేణిలోని సూపర్ కంప్యూటర్లు: పరమ్ 8000, పరమ్ 8600, పరమ్ 9900/ఎస్ఎస్, పరమ్ 9900/యూఎస్, పరమ్ 9900/ఏఏ, పరమ్ 10,000, పరమ్ పద్మ, పరమ్ యువ, పరమ్ యువ-2, పరమ్ కాంచన్ జంగ, పరమ్ శావక్, పరమ్ ఇషాన్.
- 2016, సెప్టెంబర్ 20న పరమ్ ఇషాన్ ఆవిష్కరణ జరిగింది. దీని గణన సామర్థ్యం 250 టెరాఫ్లాప్స్. దీన్ని సీ-డాక్, ఐఐటీ గువాహటి సంయుక్తంగా రూపొందించాయి.

ప్రపంచంలోని టాప్ 5 సూపర్ కంప్యూటర్లు

1. సన్‌వే తైహులైట్ - నేషనల్ సూపర్ కంప్యూటింగ్ సెంటర్, ఉక్సి, చైనా.
2. తియాన్హే-2- నేషనల్ సూపర్ కంప్యూటింగ్ సెంటర్, గ్వాంగ్‌జా, చైనా.
3. పిజ్ డెయింట్ - స్విస్ నేషనల్ సూపర్ కంప్యూటింగ్ సెంటర్, స్విట్జర్లాండ్.
4. గైకొ - జపాన్ ఏజెన్సీ ఫర్ మెరైన్ ఎర్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జపాన్.
5. టైటాన్ -ఓక్రిడ్జ్ నేషనల్ లేబొరేటరీ, యూఎస్ఏ.

కంప్యూటర్ గణన సామర్థ్యం-యూనిట్లు, విలువలు

ఫ్లాప్స్ **(FLOPS)**: ఫ్లోటింగ్ పాయింట్ ఆపరేషన్స్ పెర్ సెకండ్.

పేరు	యూనిట్	విలువ
కిలో ఫ్లాప్స్	KFLOPS	10^{3}
మెగా ఫ్లాప్స్	MFLOPS	10^{6}
గిగా ఫ్లాప్స్	GFLOPS	10^{9}
టెరా ఫ్లాప్స్	TFLOPS	10^{12}
పెటా ఫ్లాప్స్	PFLOPS	10^{15}
ఎక్సా ఫ్లాప్స్	EFLOPS	10^{18}
జెట్టా ఫ్లాప్స్	ZFLOPS	10^{21}
యొట్టా ఫ్లాప్స్	YFLOPS	10^{24}

మోడల్ ప్రశ్నలు

1. 2018, జనవరి 12 నాటికి భారతదేశ అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్?
   1) పరమ్ యువ 2) ఆదిత్య 15
   3) పరమ్ ఇషాన్ 4) ప్రత్యూష్
2. భారత్‌లో తొలి సూపర్ కంప్యూటర్ ఆవిష్కర్త?
   1) ఎల్.సి.గోయల్ 2) లల్లన్ ప్రసాద్‌సింగ్
   3) విజయ్ భట్కర్ 4) వి.కె.దుగ్గల్
3. పరమ్ సూపర్ కంప్యూటర్ శ్రేణిలో అధునాతన సూపర్ కంప్యూటర్?
   1) పరమ్ ఇషాన్ 2) పరమ్ యువ
   3) పరమ్ పద్మ 4) పరమ్ 8600
4. ప్రపంచంలో వేగవంతమైన సూపర్ కంప్యూటర్ ఏది?
   1) సన్‌వే తైహులైట్ 2) తియాన్హే-2
   3) పిజ్ డెయింట్ 4) గైకొ
5. భారతదేశ తొలి సూపర్ కంప్యూటర్?
   1) పరమ్ 1000 2) పరమ్ 8000
   3) అపోలో 4) పరమ్ పద్మ

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 1; 5) 2.



ఎన్.విజయేందర్‌రెడ్డి
విజయేందర్ అకాడమీ
హైదరాబాద్.

కెరీర్ కౌన్సెలింగ్

సోషియాలజీ కోర్సులు పూర్తిచేసిన వారికి ఎలాంటి అవకాశాలు ఉంటాయి?
- రామ్‌మనోహర్, హైదరాబాద్.



ఒక మనిషి వ్యవహారశైలిని సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించే సబ్జెక్టు సోషియాలజీ. రాష్ట్రంలోని దాదాపు అన్ని యూనివర్సిటీల్లోనూ బీఏలో సోషియాలజీ ఒక సబ్జెక్టుగా అందుబాటులో ఉంది. అంతేకాకుండా సోషియాలజీలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను కూడా ఆఫర్ చేస్తున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ తదితర ప్రముఖ విద్యాసంస్థలు, సెంట్రల్ యూనివర్సిటీలు పీజీ స్థాయిలో సోషియాలజీని అందిస్తున్నాయి. ఐఐటీలు కూడా సోషియాలజీని కోర్ సబ్జెక్టుగా లేదా ఇంటర్ డిసిప్లినరీ కోర్సుగా పలు స్థాయిల్లో (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ) అందుబాటులో ఉన్నాయి. సోషియాలజీలో ఉమెన్ డెవలప్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్, ట్రైబల్ డెవలప్‌మెంట్ తదితర స్పెషలైజేషన్లలో రీసెర్చ్ చేయడం ద్వారా అద్భుత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. సోషియాలజీ కోర్సు పూర్తిచేసిన వారు అకడమిక్ అండ్ రీసెర్చ్ సంస్థల్లో అధ్యాపకులుగా అవకాశాలను దక్కించుకోవచ్చు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) విభాగాల్లో, ప్రభుత్వ పథకాల్లో వివిధ హోదాల్లో అవకాశాలుంటాయి. ఆఫీస్‌లో వర్క్ ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ కల్పించడం ద్వారా ఉద్యోగులతో మరింత ప్రభావవంతంగా పని చేయించుకునేందుకు ఎంఎన్‌సీలు కూడా సోషియాలజీ అభ్యర్థులను నియమించుకుంటున్నాయి. ప్రభుత్వాలు సామాజిక అభివృద్ధి కోణంలో విద్య, ఆహార భద్రత, ఆరోగ్యం తదితర విషయాల్లో వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు సక్రమంగా అంది, సత్ఫలితాలు వచ్చేలా చేసే సుశిక్షితులైన నిపుణుల అవసరం ఉంది. ఈ క్రమంలో సోషియాలజీలో కోర్సులు పూర్తిచేసిన వారికి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రారంభంలో నెలకు కనీసం రూ.20 వేల వేతనం ఖాయం. సోషియాలజీలో కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు స్వయం ఉపాధి దిశగా ఆలోచించవచ్చు. ఫ్యామిలీ కౌన్సిలర్లుగా, కమ్యూనిటీ కౌన్సిలర్లుగా మారొచ్చు.

సాక్షి బిజినెస్
శుక్రవారం 12-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
70 ▲	19 ▲
34,503	10,651

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,183	▲ 30
డోజోన్స్	25,491	▲ 122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,763	▲ 14
డాక్స్	13,203	▼ 78
షాంఘై	3,426	▲ 4
నికాయ్	23,710	▼ 78

అమెరికా · బ్రిటన్ · జర్మనీ · చైనా · జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.42	64.55
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.29	87.47
€	యూరో	ఎస్‌బీఐ	77.30	77.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.96	58.07
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.89	50.99
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.53	48.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.41	18.27
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.77	18.44
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.91	11.23

పీడబ్ల్యూసీకి సెబీ షాక్!

- దేశంలో రెండేళ్లు ఆడిట్ చేపట్టకుండా నిషేధం
- రూ.13 కోట్లు తిరిగి చెల్లించాలంటూ ఆదేశం
- సత్యం కేసులో తొమ్మిదేళ్ల తర్వాత ఉత్తర్వులు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆడిటింగ్ దిగ్గజం ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్‌కు (పీడబ్ల్యూసీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గట్టి షాకిచ్చింది. సత్యం కంప్యూటర్స్ ఖాతాలను ఈ సంస్థే ఆడిట్ చేసినా... కంపెనీ లాభనష్టాలకు సంబంధించి వాస్తవాలు బయటకు వెల్లడికాలేదు. చివరకు ప్రమోటర్ రామలింగరాజు వెల్లడించాకే విషయాలన్నీ బయటికొచ్చాయి. సత్యం ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయిన ఈ వ్యవహారంలో... దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత పీడబ్ల్యూసీని సెబీ దోషిగా తేల్చింది. ఫలితంగా పీడబ్ల్యూసీ నెట్‌వర్క్ సంస్థలు రెండేళ్ల పాటు భారత్‌లోని లిస్టెడ్ కంపెనీలకు ఆడిట్ సర్టిఫికెట్లు జారీ చేయకుండా నిషేధం విధించింది. అలాగే సత్యం కంప్యూటర్స్ ఖాతాలు ఆడిటింగ్ ద్వారా పీడబ్ల్యూసీ, గతంలో దాని రెండు భాగస్వామ్య సంస్థలు అక్రమంగా ఆర్జించిన రూ.13 కోట్లకు పైగా మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాలని 108 పేజీల ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, పీడబ్ల్యూ నెట్‌వర్క్ సంస్థలు 2017–18కి సంబంధించి ఇప్పటికే చేపట్టిన ఆడిటింగ్ అసైన్‌మెంట్స్‌పై దీని ప్రభావం ఉండదని తెలిపింది. సెబీ ఆదేశాలపై తాము స్టే తెచ్చుకుంటామని ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్ ధీమా వ్యక్తం చేయగా, ఉత్తర్వులను పరిశీలించనున్నట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి పి.పి.చౌదరి చెప్పారు. ఆడిటర్లకు సంబంధించి ఇప్పటికే కఠిన నిబంధనలు ఉన్నాయని, వాటిని అమలు మాత్రమే చేయాల్సి ఉందని తెలిపారు.

దేశీ కార్పొరేట్ రంగాన్ని కుదిపేసిన రూ. 7,000 కోట్ల సత్యం కంప్యూటర్స్ కుంభకోణం 2009లో బయటపడింది. ఆ తర్వాత కంపెనీ చైర్మన్ రామలింగరాజు జైలుకెళ్లడం, సంస్థను టెక్ మహీంద్రా టేకోవర్ చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవధిలో పీడబ్ల్యూసీ రెండు సార్లు రాజీ యత్నాలకు ప్రయత్నించినా విఫలమయింది. అయితే, అమెరికాలో మాత్రం రాజీ చేసుకోగలిగింది. బిగ్ ఫోర్‌గా పరిగణించే నాలుగు దిగ్గజ ఆడిటింగ్ కంపెనీల విషయంలో ఇంత తీవ్రమైన ఆదేశాలు జారీ కావడం దేశంలో ఇదే ప్రథమం.

గోపాలకృష్ణన్, శ్రీనివాస్ తాళ్లూరిలకు 3 ఏళ్లు..

ప్రైస్ వాటర్‌హౌస్ మాజీ భాగస్వాములు గోపాలకృష్ణన్, శ్రీనివాస్ తాళ్లూరి మూడేళ్ల పాటు లిస్టెడ్ సంస్థలకు ఆడిట్ సర్టిఫికెట్లు జారీ చేయరాదని సెబీ స్పష్టంచేసింది. 2000–2008 మధ్య కాలంలో ప్రైస్ వాటర్‌హౌస్ సంస్థలు ఆడిటింగ్ సేవలకు గాను సత్యం నుంచి రూ. 23 కోట్లు ఫీజుగా పొందగా.. ఇందులో రూ. 13 కోట్లు పీడబ్ల్యూ బెంగళూరుకి లభించాయని సెబీ పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రైస్ వాటర్‌హౌస్ బెంగళూరు విభాగంతో పాటు ఎస్ గోపాలకృష్ణన్, శ్రీనివాస్ తాళ్లూరి అనుచితంగా లబ్ధి పొందిన మొత్తం రూ. 13 కోట్లు, 2009 జనవరి 7 నుంచి 12 శాతం వార్షిక వడ్డీ రేటుతో తిరిగి చెల్లించాల్సి ఉంటుందని సెబీ ఆదేశించింది. ఇందుకు 45 రోజుల గడువు ఇచ్చింది.

స్టే తెచ్చుకుంటాం: పీడబ్ల్యూసీ

సెబీ విచారణ, తీర్పు తమను నిరాశపరిచినట్లు పీడబ్ల్యూసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చే లోగా స్టే తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తామని పేర్కొంది. 'గతంలో ఎన్నడూ చూడని విధంగా సత్యం యాజమాన్యం చేసిన మోసంలో పీడబ్ల్యూ సంస్థలు ఉద్దేశపూర్వకంగా ఎటువంటి తప్పూ చేయలేదనే 2009 నుంచీ చెబుతున్నాం. తాజా తీర్పు 2011లో బాంబే హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఉంది. దీనిపై స్టే తెచ్చుకోగలమని భావిస్తున్నాం' అని వెల్లడించింది.

కొత్త ఆడిటర్ల వేటలో కంపెనీలు..

ప్రైస్ వాటర్‌హౌస్ నెట్‌వర్క్ సంస్థలపై సెబీ నిషేధం విధించిన నేపథ్యంలో ప్రస్తుతం వాటి సర్వీసులు ఉపయోగించుకుంటున్న అనేక లిస్టెడ్ కంపెనీలు కొత్త ఆడిటర్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పీడబ్ల్యూసీ నెట్‌వర్క్ కింద భారత్‌లో ప్రస్తుతం 11 సంస్థలు ఉండగా.. 3,000 పైచిలుకు ఉద్యోగులున్నారు. దేశీయంగా 75 లిస్టెడ్ కంపెనీలకు ఈ సంస్థలు ఆడిటింగ్ సేవలు అందిస్తున్నాయి. 2017–18 ఏడాది ఆడిటింగ్‌పై తీర్పు ప్రభావం ఉండదని సెబీ చెప్పినప్పటికీ.. తర్వాతైనా సరే ఈ లిస్టెడ్ కంపెనీలు మరో ఆడిటర్‌ను వెతుక్కోవాలి. మరోవైపు, సెబీ ఆదేశాల నేపథ్యంలో పరోక్షంగానైనా.. అన్‌లిస్టెడ్, ఇతర సంస్థలకు ప్రైస్ వాటర్‌హౌస్ అందించే ఆడిటింగ్ సేవలపైనా ప్రశ్నలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

భారత్‌లోకి లంబోర్గిని 'ఉరుస్'



ముంబై: ఇటలీకి చెందిన సూపర్ స్పోర్ట్స్ కార్ల తయారీ కంపెనీ 'లంబోర్గిని' తాజాగా తన తొలి సూపర్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ 'ఉరుస్'ను భారత మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.3 కోట్లు. కంపెనీ విక్రయాల్లో ఇండియా కీలక పాత్ర పోషిస్తోందని, తాజా మోడల్ ఆవిష్కరణతో అమ్మకాలు 2.5– 3 రెట్లు పెరగొచ్చని సంస్థ జనరల్ మేనేజర్ (ఆసియా–పసిఫిక్) ఆండ్రియా బల్డి తెలిపారు. 'ఉరుస్ మాకు అతిముఖ్యమైన ప్రొడక్ట్. ఇది ఇండియాలో కంపెనీకి కొత్త కస్టమర్లను తీసుకురానుంది' అని లంబోర్గిని ఇండియా హెడ్ శరద్ అగర్వాల్ పేర్కొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ 'హిమాలయన్ స్లీట్' @ 2.13 లక్షలు



న్యూఢిల్లీ: రాయల్ ఎన్‌ఫీల్డ్ అడ్వెంచర్ టూరింగ్ మోడల్ 'హిమాలయన్'లో కొత్త వెర్షన్ 'స్లీట్'ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.2.13 లక్షలు (ఆన్–రోడ్ చెన్నై). తొలి 500 వాహనాలకు కంపెనీయే ఎక్స్‌ప్లోరర్ కిట్‌ను అందిస్తోంది. ఈ బైక్‌పై ఆసక్తి ఉన్నవారు జనవరి 12 నుంచి 30 వరకు కంపెనీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. విక్రయాలు జనవరి 30న ప్రారంభమౌతాయి' అని కంపెనీ తెలియజేసింది.

కార్పొరేట్ పన్నుకు కోత?

- హామీ మేరకు తగ్గించాలని ఒత్తిళ్లు
- 25 శాతానికి తీసుకొస్తామని లోగడ జైట్లీ ప్రకటన



న్యూఢిల్లీ: కార్పొరేట్ పన్ను తగ్గించాలంటూ కేంద్ర ప్రభుత్వంపై దేశ కార్పొరేట్ రంగం నుంచి ఒత్తిడి పెరుగుతోంది. పన్ను రేటు 30 శాతంగా ఉండగా దాన్ని 25 శాతానికి తగ్గిస్తామని మూడేళ్ల క్రితం కేంద్రం హామీ ఇచ్చింది. దాన్ని ఇప్పటికైనా నెరవేర్చాలని కార్పొరేట్ రంగం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కోరుతోంది. అమెరికాలో కార్పొరేట్ పన్నును గణనీయంగా తగ్గించినందున అంతర్జాతీయ స్థాయిలో మన పన్ను రేటు సైతం పోటీపడేలా మార్పులు చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. 2015–16 బడ్జెట్ సందర్భంగా జైట్లీ కార్పొరేట్ పన్నును 30% నుంచి 25%కి నాలుగేళ్లలో తగ్గిస్తామని ప్రకటించారు. ఇది పెట్టుబడులకు, అధిక వృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఇప్పటికీ అది తగ్గగక పోవటంతో కనీసం 28 శాతానికైనా తగ్గించాలని పరిశ్రమల సమాఖ్యలు కోరుతున్నాయి.

ఈ బడ్జెట్‌లో చేస్తారని ఆశిస్తున్నాం: ఫిక్కీ

దీనిపై ఫిక్కీ ప్రెసిడెంట్ రశేష్‌షా స్పందిస్తూ... ఆర్థిక ప్రతికూలతల నేపథ్యంలో మంత్రి జైట్లీ కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గిస్తారని ఆశించడం లేదన్నారు. కనీసం 28 శాతానికైనా తీసుకొచ్చేలా కృషి చేయాలని, అది ఈ బడ్జెట్లో చేస్తారని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

18 శాతం చేయాలి... సీఐఐ: సీఐఐ మాత్రం కార్పొరేట్ పన్నును ఏకంగా 18 %కి తగ్గించేయాలని డిమాండ్ చేసింది. అంతేకాదు, పన్ను తగ్గింపు ప్రయోజనాన్ని పార్టనర్‌షిప్ సంస్థలు, ఎల్‌ఎల్‌పీలు, ఏవోపీలు, కో–ఆపరేటివ్ సొసైటీలకు కూడా వర్తింపజేయాలని, దీంతో భిన్న సంస్థల మధ్య సమాంతర వాటా ఉంటుందని సూచించింది.

సమీక్షించాల్సిన అవసరం ఉంది...

మనదేశ కార్పొరేట్ పన్ను అంతర్జాతీయంగా ఉన్న రేట్లతో పోలిస్తే పోటీపడేట్లుగానే ఉందన్నారు శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ పార్ట్‌నర్ అమిత్ సింఘానియా. అయితే, ఇటీవల అమెరికాలో కార్పొరేట్ పన్నును గణనీయంగా తగ్గించినందున 2018 బడ్జెట్‌లో ఇక్కడా సమీక్షించాల్సి ఉందని, ఎందుకంటే ఇది అమెరికా ఇన్వెస్టర్లపై ప్రభావం చూపిస్తుందని చెప్పారాయన.

టీసీఎస్ బోణీ బాగుంది..!

క్యూ3 లాభం రూ.6,531 కోట్లు

- జోరుగా 'డిజిటల్' వృద్ధి
- ఒక్కో షేర్‌కు రూ.7 మధ్యంతర డివిడెండ్
- టీసీఎస్ సీఈఓ రాజేశ్ గోపీనాథన్ వెల్లడి



ముంబై: ఐటీ దిగ్గజం టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు దాదాపు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. నికర లాభం సీక్వెన్షియల్‌గా 1.3 శాతం పెరగ్గా... గత ఏడాదితో పోలిస్తే 4 శాతం తగ్గింది. సీజనల్‌గా బలహీనంగా ఉండే డిసెంబర్ క్వార్టర్లో ఈ స్థాయి పనితీరు తక్కువేమీ కాదని నిపుణులంటున్నారు. పన్నులు, సిబ్బంది వ్యయాలు తక్కువగా ఉండటం, ఇతర ఆదాయం అధికంగా ఉండటంతో కంపెనీ ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. ఆదాయం 4 శాతం చొప్పున వృద్ధి చెందగా, ఒక్కో షేర్‌కు రూ.7 డివిడెండ్‌ను ఇవ్వనున్నట్లు కంపెనీ పేర్కొంది. మార్కెట్ ముగిసిన తర్వాత టీసీఎస్ ఫలితాలు వెలువడ్డాయి.

గత డిసెంబరుతో పోలిస్తే లాభం తగ్గుదలే...

గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.6,778 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో 4 శాతం తగ్గి రూ.6,531 కోట్లుగా నమోదైందని టీసీఎస్ సీఈఓ, ఎండీ, రాజేశ్ గోపీనాథన్ చెప్పారు. మార్జిన్ తగ్గడం, అధిక ఆదాయాన్నిచ్చే బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలు మందకొడి వృద్ధి సాధించడం వల్ల ఈ తగ్గుదల చోటు చేసుకుందన్నారు. బ్యాంకింగ్ రంగం రికవరీ కావడానికి కనీసం మరో ఆరునెలలైనా పడుతుందని చెప్పారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్లో వచ్చిన నికర లాభం రూ.6,446 కోట్లతో పోలిస్తే 1.3 శాతం వృద్ధి సాధించామని చెప్పారాయన. "క్వార్టర్ ఆన్ క్వార్టర్ ప్రాతిపదికన ఇతర ఆదాయం 6 శాతం పెరిగింది. పన్ను వ్యయాలు 8 శాతం, సిబ్బంది వ్యయాలు 1 శాతం చొప్పున తగ్గాయి. గత క్యూ3లో రూ.29,735 కోట్లుగా ఉన్న ఆదాయం 4 శాతం పెరిగి ఈ క్యూ3లో రూ.30,904 కోట్లకు చేరింది. ఈ క్యూ2 ఆదాయంతో పోలిస్తే మొత్తం ఆదాయంలో 1.2 శాతం వృద్ధి సాధించాం. డాలర్ల పరంగా ఆదాయం 1 శాతం వృద్ధితో 479 కోట్ల డాలర్లకు (సీక్వెన్షియల్‌గా) పెరిగింది. డిజిటల్ డిమాండ్ పెరుగుతుండడం, పటిష్టమైన డీల్స్‌ను సాధించడంతో ఈ స్థాయి ఆదాయం ఆర్జించాం'' అని గోపీనాథన్ వివరించారు. రూ.30,960 కోట్ల ఆదాయంపై రూ.6,460 కోట్ల నికర లాభం రాగలదని సీఎన్‌బీసీ–టీవీ 18 నిర్వహించిన పోల్స్‌లో నిపుణులు అంచనా వేశారు.

మూడో మధ్యంతర డివిడెండ్..: రూ.1 ముఖ విలువ గల షేర్‌కు 700 శాతం (రూ.7) డివిడెండ్‌ను టీసీఎస్ ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఇస్తున్న మూడో మధ్యంతర డివిడెండ్ ఇది. తొలి రెండు క్వార్టర్లలో రూ.7 చొప్పున డివిడెండ్‌ను ఇచ్చింది. దీంతో ఈ ఏడాది ఇప్పటిదాకా కంపెనీ రూ.21 డివిడెండ్‌ను ప్రకటించినట్లయింది. తాజా డివిడెండ్‌ను ఈ నెల 31న వాటాదారులకు చెల్లిస్తామని పేర్కొంది.

తొలి 5 కోట్ల డాలర్ల డిజిటల్ డీల్

ఈ క్వార్టర్లోనే డిజిటల్ సెగ్మెంట్లో తొలి 5 కోట్ల డాలర్ల డీల్‌ను సాధించామని రాజేశ్ గోపీనాథన్ పేర్కొన్నారు. 5 కోట్ల డాలర్ల డీల్స్‌ను మూడు సంస్థల నుంచి సాధించామని వివరించారు. డిజిటల్ విభాగం 40 శాతం, సీక్వెన్షియల్‌గా అయితే 14 శాతం చొప్పున వృద్ధి చెందిందని, ఈ సెగ్మెంట్లో 150కు పైగా డీల్స్ సాధించామని పేర్కొన్నారు. మొత్తం ఆదాయంలో 22 శాతం ఈ విభాగానిదేనని వివరించారు. డిసెంబర్ క్వార్టర్లో మంచి పనితీరుతో గత ఏడాదిని సంతృప్తికరంగా ముగించామని చెప్పారు. తమ పోర్ట్‌ఫోలియోలో బలహీనంగా ఉన్న విభాగాలన్నీ టర్న్ అరౌండ్ అవుతున్నాయని, మంచి వృద్ధి సాధించే దిశగా కదులుతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కొత్త డీల్స్, డిజిటల్ సెగ్మెంట్లో జోరు పెరుగుతోందని, రిటైల్ విభాగంలో డిమాండ్ పుంజుకుంటోందని టీసీఎస్ సీఓఓ ఎన్. గణపతి సుబ్రమణ్యం తెలిపారు.

తగ్గిన ఆట్రిషన్ రేటు: ఈ క్యూ3లో ఆట్రిషన్ (ఉద్యోగుల వలస) 0.2 శాతం తగ్గి 11.1 శాతానికి చేరిందని, 12,534 కొత్త ఉద్యోగాలిచ్చామని టీసీఎస్ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్ నాటికి తమ మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,90,880కు పెరిగిందని పేర్కొంది.

క్యూ3లో 11 శాతం పెరిగిన షేర్ ధర

ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ క్వార్టర్లో టీసీఎస్ షేర్ 11 శాతం లాభపడింది. ఫలితాల వెల్లడికి ముందు రోజుల వరకూ లాభాల్లో ఉన్న ఈ షేర్ ఇంట్రాడేలో తాజా ఏడాది గరిష్ట స్థాయి, రూ.2,822ను తాకింది. చివరకు 0.6 శాతం నష్టపోయి రూ.2,788 వద్ద ముగిసింది. కాగా, 2–3 నెలల్లో ఈ షేర్ 8–10 శాతం పెరగవచ్చని ఐడీబీఐ క్యాపిటల్ అంచనా వేస్తోంది.

3,500 కోట్ల బినామీ ఆస్తులు జప్తు

ఆదాయపు పన్ను శాఖ



న్యూఢిల్లీ: ఫ్లాట్లు, దుకాణాలు, ఆభరణాలు, వాహనాలతో కూడిన 900 బినామీ ఆస్తులను జప్తు చేసినట్లు ఆదాయ పన్ను విభాగం వెల్లడించింది. వీటి విలువ రూ.3,500 కోట్ల పైగా ఉంటుందని తెలిపింది. 2016 నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన బినామీ ఆస్తి లావాదేవీల నిరోధక చట్టం కింద మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీ విభాగం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ చట్టం కింద బినామీ ఆస్తులను (స్థిర, చరాస్తులు) ముందు తాత్కాలికంగా... ఆ తర్వాత పూర్తిగా జప్తు చేసే అధికారాలుంటాయి. అలాగే అనుచిత లబ్ధి పొందిన యజమాని, బినామీగా వ్యవహరించిన వారు, లావాదేవీలకు కారకులైన వారిపై న్యాయ విచారణ జరపవచ్చు. దోషులుగా తేలిన పక్షంలో ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ప్రాపర్టీ మార్కెట్ విలువలో 25 శాతం దాకా జరిమానా కూడా విధించే అవకాశాలుంటాయి. ఒక రియల్ ఎస్టేట్ సంస్థ రూ.110 కోట్లు విలువ చేసే 50 ఎకరాల స్థలాన్ని బినామీ పేర్లతో రిజిస్టర్ చేసిందని విచారణలో వెల్లడైనట్లు ఐటీ విభాగం పేర్కొంది. మరో కేసులో పెద్ద నోట్ల రద్దు అనంతరం ఇద్దరు అసెస్సీలు తమ ఉద్యోగులు, సంబంధీకులకు చెందిన ఖాతాల్లో దాదాపు రూ. 39 కోట్లు జమచేసినట్లు బయటపడిందని తెలియజేసింది.

హోండా కార్స్ స్పెషల్ ఎడిషన్స్



న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'హోండా కార్స్ ఇండియా' (హెచ్‌సీఐఎల్) తాజాగా సిటీ, అమేజ్, డబ్ల్యూఆర్–వీ మోడళ్లలో స్పెషల్ ఎడిషన్స్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. హోండా సిటీ 20వ వార్షికోత్సవం ఎడిషన్, అమేజ్ ప్రైడ్ ఎడిషన్, డబ్ల్యూఆర్–వీ ఎడ్జ్ ఎడిషన్ అనేవి వీటి పేర్లు. ఇవన్నీ టాప్–ఎండ్ వేరియంట్ల రూపంలో, కొన్ని అదనపు ఫీచర్లతో కస్టమర్లకు అందుబాటులో ఉంటాయి. వీటి ఎక్స్ షోరూమ్ ధరలివీ...

మోడల్	పెట్రోల్ ధర(రూ.లలో)	డీజిల్ ధర
(హోండా సిటీ 20వ వార్షికోత్సవం ఎడిషన్)	13,74,532	13,82,382
హోండా అమేజ్ ప్రైడ్ ఎడిషన్	6,29,900	7,83,486
డబ్ల్యూఆర్–వీ ఎడ్జ్	8,01,017	9,04,683

ఐటీ కాంగ్రెస్‌కు మోదీ, సోఫియా!

- ఫిబ్రవరి 19–21 తేదీల్లో డబ్ల్యూఐటీసీ
- ఇదే వేదికగా నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరం కూడా..
- 30 దేశాల నుంచి 2,500 మంది ప్రతినిధులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ సదస్సులకు హైదరాబాద్ మరోసారి వేదిక కానుంది. ఫిబ్రవరి 19–21 తేదీల్లో మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో 22వ వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కాంగ్రెస్ (డబ్ల్యూఐటీసీ) సదస్సు జరగనుంది. ఇండియాలో తొలిసారిగా అది కూడా హైదరాబాద్‌లో నిర్వహించటం ప్రత్యేకత. డబ్ల్యూఐటీసీతో అనుసంధానంగా ఇదే వేదికగా నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరం (ఎన్‌ఐఎల్‌ఎఫ్) కూడా జరగనుంది. 25 ఏళ్లుగా ప్రతి ఏటా ముంబైలో నిర్వహించే ఈ ఎన్‌ఐఎల్‌ఎఫ్ తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు నాస్కామ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారమిక్కడ మంత్రి కేటీ రామారావుతో కలిసి రెండు సదస్సుల వివరాలను విలేకరులకు తెలిపారు.

నరేంద్ర మోదీ, సోఫియా హాజరు..

ఏడాదిన్నర క్రితం నుంచే డబ్ల్యూఐటీసీ సదస్సు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 3 రోజుల ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశముందని.. రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ తరఫున ప్రధాని కార్యాలయానికి ఆహ్వాన పత్రిక పంపించామని, అయితే పీఎంఓ ఇంకా ధ్రువీకరించలేదని మంత్రి కేటీఆర్ తెలిపారు. సౌదీ అరేబియా పౌరసత్వాన్ని పొందిన కృత్రిమ మేధ ఆధారిత రోబో సోఫియా కూడా హాజరవుతుందని చంద్రశేఖర్ తెలిపారు. హాంగ్‌కాంగ్‌కు చెందిన హన్సన్ రోబోటిక్స్ ఈ రోబోను అభివృద్ధి చేసింది.



విలేకరుల సమావేశంలో మంత్రి కేటీఆర్‌తో నాస్కామ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్

30 దేశాలు; 2,500 ప్రతినిధులు..

డబ్ల్యూఐటీసీకి 30 దేశాల నుంచి 2,500 మంది ప్రతినిధులు హాజరవుతారని, ఇందులో 500 మంది విదేశీ ప్రతినిధులుంటారని చంద్రశేఖర్ తెలిపారు. కెనడా, అమెరికా, తైవాన్, అర్మేనియా, మెక్సికో, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లోని ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధుల హాజరు ఖరారైందన్నారు. హనీవెల్ టెక్నాలజీస్, ఎన్‌ఈసీ, హన్సన్ రోబోటిక్స్, నోవార్టిస్, ఫెడెక్స్, అడోబ్, పిరమల్ గ్రూప్ వంటి ప్రముఖ ఐటీ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. వీరితో పాటూ ప్రపంచ దేశాల్లోని ఐటీ లీడర్లు, విశ్లేషకులు, పెట్టుబడిదారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొంటారు.

2019లో అర్మేనియాలో..

1978 నుంచీ ప్రతి రెండేళ్లకోసారి వరల్డ్ ఐటీ కాంగ్రెస్ జరుగుతోంది. గత ఏడాది పలు దేశాలు నిర్వహణ కోసం పోటీ పడటంతో... ప్రతి ఏటా నిర్వహించాలని నిర్ణయించారు. 2017లో తైవాన్‌లో జరగ్గా... ఈ ఏడాది హైదరాబాద్ వేదిక కానుంది. 2019లో అర్మేనియా, 2020లో మలేషియా, 2021లో బంగ్లాదేశ్‌లో జరగనున్నట్లు వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ (డబ్ల్యూఐటీఎస్‌ఏ) చైర్మన్ వ్యోనీ చీ తెలిపారు.

డబ్ల్యూఐటీఎస్‌లో పెట్టుబడుల ప్రకటన..

డబ్ల్యూఐటీఎస్ వేదికగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ రంగాల్లో పలు కంపెనీలు తమ పెట్టుబడుల ప్రణాళికల్ని ప్రకటించే అవకాశమున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఏఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ప్రపంచీకరణ, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ, క్రీడలు–సాంకేతికత, డిజిటల్ రెవెల్యూషన్స్ వంటి ప్రధాన విభాగాల్లో ప్రపంచ దేశాల్లోని నిపుణులు, విశ్లేషకులు 22 సెషన్స్‌లో బృంద చర్చలుంటాయని చంద్రశేఖర్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, హైదరాబాద్ భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చిస్తారు. మన దేశం నుంచి 60 ఇన్నోవేషన్ కంపెనీలు పాల్గొంటాయి.

'ఇండస్ ఇండ్' లాభం రూ.936 కోట్లు



ముంబై: ప్రైవేట్ రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 25 శాతం వృద్ధితో రూ.936 కోట్లకు పెరిగింది. గత క్యూ3లో లాభం రూ.751 కోట్లు. కోర్ ఆదాయం అధికంగా ఉండటంతో ఈ స్థాయి నికర లాభం సాధించామని బ్యాంక్ చీఫ్ రమేశ్ సోబ్తి చెప్పారు. మొత్తం ఆదాయం రూ.4,716 కోట్ల నుంచి 16% వృద్ధితో రూ.5,474 కోట్లకు పెరిగిందని చెప్పారు.

నికర వడ్డీ ఆదాయం 20 శాతం అప్...

డిపాజిట్లు 23 శాతం, రుణాలు 25 శాతం చొప్పున వృద్ధి చెందాయని రమేశ్ సోబ్తి తెలిపారు. నికర వడ్డీ ఆదాయం 20 శాతం వృద్ధితో రూ.1,895 కోట్లకు ఎగసిందని పేర్కొన్నారు. ఫీజు ఆదాయం 22 శాతం పెరిగి రూ.1,077 కోట్లకు వృద్ధి చెందిందన్నారు. స్థూల మొండి బకాయిలు 0.94% నుంచి 1.16%కి, నికర మొండి బకాయిలు 0.39% నుంచి 0.46%కి పెరిగాయని సోబ్తి తెలిపారు. ఫలితాల నేపథ్యంలో ఇండస్ ఇండ్ షేరు 2 శాతం నష్టంతో రూ.1,699 వద్ద ముగిసింది.

హైదరాబాద్‌లో నాస్కామ్ ఏఐ కేంద్రం

- కృత్రిమ మేధపై అవగాహన, నైపుణ్యానికి
- నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సాఫ్ట్‌వేర్ పరిశ్రమల సమాఖ్య నాస్కామ్... హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వంతో చర్చలు మొదలుపెట్టామని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ తెలియజేశారు. ఫిబ్రవరిలో జరగనున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో దీనికి సంబంధించి ప్రకటన వెలువడే అవకాశమున్నట్లు తెలియవచ్చింది. ఇప్పటికే నాస్కామ్ ఏఐ సెంటర్ ఒకటి బెంగళూరులో ఉందని.. దేశంలో మరో రెండు మూడు ఏఐ కేంద్రాల అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని.. వీటిల్లో ఏఐతో పాటూ డేటా అనలిటిక్స్, మిషన్ లెర్నింగ్, త్రీడి ప్రింటింగ్ వంటి 8 విభాగాలను గుర్తించామని, వీటిలో నైపుణ్యమున్న ఉద్యోగుల అవసరముందని వివరించారు. ఈ ఏఐ సెంటర్ల ద్వారా ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి టెక్నాలజీల్లో శిక్షణ, నైపుణ్యాలు అభివృద్ధి చేయటం వంటివి ఉంటాయని తెలిపారు. వీటితో పాటు ఈ ఏఐ సెంటర్ స్థానిక స్టార్టప్ సంస్థలు, మెంటార్లు, విద్యావేత్తలు, వెంచర్ క్యాపిటలిస్టులతో అనుసంధానమై ఉంటుందని.. స్థానిక సమస్యలకు టెక్నాలజీతో పరిష్కార మార్గాలను అన్వేషిస్తుందని వివరించారు.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ. 4,750 (కనిష్టం) రూ. 5,060 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ. 5,000(కనిష్టం) రూ. 9,050(గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	-- --
ఉల్లి (కర్నూలు)	రూ.2,050 (కనిష్టం) రూ.3,720 (గరిష్టం)
చక్కెర (చెన్నై)	రూ.3,600
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

సహారా లైఫ్‌కు ఊరట

ముంబై: సహారా గ్రూపులో భాగమైన సహారా లైఫ్ బీమా వ్యాపారాన్ని ఐసీ ఐసీఐ ప్రుడెన్షియల్‌కు బదలాయించాలని బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్డీఏ) జారీ చేసిన ఆదేశాలను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) రద్దు చేసింది. పూర్తిగా కంపెనీ వాదనను విని, ఆ తరవాతే ఆదేశాలు వెలువరించాలని ఐఆర్డీఏకి సూచించింది. సహజ న్యాయ సూత్రాలను ఐఆర్డీఏ చర్యలు ఉల్లంఘించినట్టు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. అయితే, అదే సమయంలో సహారా లైఫ్ నిర్వహణను చూసేందుకు ఓ నిర్వహణ అధికారిని నియమించాలన్న ఐఆర్డీఏ నిర్ణయాన్ని సమర్థించింది. పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణ కోణంలో సమస్యలను ఎదుర్కొంటున్న సహారా లైఫ్ బీమా పోర్ట్‌ఫోలియోను ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు బదలాయించాలని గతేడాది జూలై 28న ఐఆర్డీఏ ఆదేశించింది. అయితే, సహారా లైఫ్ ఆస్తులను మరో సంస్థకు బదలాయించాలంటూ అడ్మినిస్ట్రేటర్ ఇచ్చిన నివేదిక కాపీని కంపెనీకి ఇవ్వలేదన్న శాట్... ఐఆర్డీఏ ఆదేశాలను రద్దు చేస్తూ దీనిపై తాజా వాదనలు వినాలని ఉత్తర్వులు జారీ చేసింది. అడ్మినిస్ట్రేటర్ నివేదికపై సహారా లైఫ్ స్పందన అందిన తేదీ నుంచి మూడు నెలల్లోపు విచారణ ముగించి తాజా ఆదేశాలు వెలువరించాలని పేర్కొంది. దీనిపై ఐఆర్డీఏ తరపు న్యాయవాది మాట్లాడుతూ ఆదేశాలను నియంత్రణ సంస్థ అధ్యయనం చేసి తదుపరి చర్యలు తీసుకుంటుందని, ఎందుకంటే ఇది విధానపరమైన ప్రక్రియపై ఎదురైన ప్రశ్నగా పేర్కొన్నారు. శాట్ ఆదేశాలు పెద్ద ఉపశమనంగా సహారా లైఫ్ అభివర్ణించింది.

మార్చి వరకు ఎయిర్‌టెల్‌కు అవకాశం

న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్ తన మొబైల్ కస్టమర్ల గుర్తింపును ఆధార్ సాయంతో రీ వెరిఫికేషన్ చేసుకునేందుకు ఇచ్చిన తాత్కాలిక అనుమతిని యూఐడీఏఐ మార్చి 31 వరకు పొడిగించింది. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ ఈకేవైసీ లైసెన్స్‌పై ఉన్న నిషేధాన్ని తొలగించలేదు.ఆర్‌బీఐ, టెలికం శాఖ ఆడిటర్ ఇచ్చే నివేదిక అనుగుణంగా ఫిబ్రవరి 10న తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

బోర్డ్ మీటింగ్స్

ఇన్ఫోసిస్, కర్ణాటక బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రా, సింటెక్స్ ఇండస్ట్రీస్, వీడియోకాన్ ఇండస్ట్రీస్.

ప్యాసింజర్ వాహన విక్రయాల రికార్డ్

- గతేడాది తొలిసారి 30 లక్షల మార్క్‌పైకి
- వార్షిక ప్రాతిపదికన 8.85% వృద్ధి
- ఇది ఐదేళ్ల గరిష్ట స్థాయి
- సియామ్ గణాంకాల వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా ప్యాసింజర్ వాహనాలు 2017లో రికార్డ్ స్థాయిలో అమ్ముడయ్యాయి. తొలిసారి 30 లక్షల మార్క్‌ను అధిగమించాయి. వృద్ధిలో ఇది ఐదేళ్ల గరిష్ట స్థాయి. యుటిలిటీ వాహనాలకు అధిక డిమాండ్ ఉండటమే దీనికి ప్రధాన కారణం. సియామ్ గణాంకాల ప్రకారం..

- ప్యాసింజర్ వాహన (పీవీ) విక్రయాలు 2017లో 32,29,109 యూనిట్లు. ఇవి 2016లో 29,66,603 యూనిట్లు. 8.85 శాతం వృద్ధి కనిపించింది. పీవీ విక్రయాల్లో 2012 తర్వాత మళ్లీ ఇంతటి వృద్ధి ఇప్పుడే. 2012లో వృద్ధి 9.77 శాతంగా ఉంది.
- కార్ల విక్రయాలు 5.13 శాతం వృద్ధితో 20,62,357 యూనిట్ల నుంచి 21,68,151 యూనిట్లకు ఎగశాయి. యుటిలిటీ వాహన అమ్మకాలు 20.09 శాతం వృద్ధితో 7,24,522 యూనిట్ల నుంచి 8,70,060 యూనిట్లకు పెరిగాయి.
- టూవీలర్ విక్రయాలు 8.43% వృద్ధితో 1,91,76,905 యూనిట్లకు ఎగశాయి.
- ఇక 2016–17 ఆర్థిక సంవత్సరంలో పీవీ విక్రయాలు 9.23%, సీవీ అమ్మకాలు 4.16 శాతం, టూవీలర్ల విక్రయాలు 6.89 శాతం పెరిగాయి.

డిసెంబర్‌లో చూస్తే: డిసెంబర్‌లో పీవీ విక్రయాలు 5.22% వృద్ధితో 2,27,823 యూనిట్ల నుంచి 2,39,712 యూనిట్లకు ఎగశాయి. దేశీ కార్ల విక్రయాలు మాత్రం 1,58,617 యూనిట్ల నుంచి 1,58,326 యూనిట్లకు తగ్గాయి. మారుతీ సుజుకీ ఇండియా విక్రయాలు 11.44% వృద్ధితో 1,18,560 యూనిట్లకు, హ్యుందాయ్ విక్రయాలు స్వల్ప వృద్ధితో 40,158 యూనిట్లుకు ఎగశాయి. మహీంద్రా అమ్మకాలు 6.99% క్షీణతతో 15,531 యూనిట్లకు తగ్గాయి. టాటా మోటార్స్ విక్రయాలు 33.94% వృద్ధితో 16,089 యూనిట్లకు పెరిగాయి. ఇక మొత్తం టూవీలర్ విక్రయాలు 41.45% వృద్ధితో 12,87,592 యూనిట్లకు ఎగశాయి. మోటార్‌సైకిల్ అమ్మకాలు 40.31% వృద్ధితో 7,88,156 యూనిట్లకు పెరిగాయి. హీరో మోటొకార్ప్ దేశీ అమ్మకాలు 42.71% వృద్ధి చెందాయి. 3,98,816 యూనిట్లుగా నమోదయ్యాయి. స్కూటర్ల అమ్మకాలు 52.05% వృద్ధితో 4,32,429 యూనిట్లకు చేరాయి. హెచ్ఎంఎస్ఐ విక్రయాలు 57.36% వృద్ధితో 2,38,820 యూనిట్లకు పెరిగాయి. వాణిజ్య వాహన (సీవీ) విక్రయాలు 52.62% వృద్ధితో 82,362 యూనిట్లకు పెరిగాయి.

వృద్ధి అంచనాలు పెంపు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు త్రైమాసికాల్లో అమ్మకాలు సానుకూలముగా ఉండటంతో.. సియామ్ 2017–18కి సంబంధించి ప్యాసింజర్ వాహన విభాగపు వృద్ధి అంచనాలను 7–9% నుంచి 9%కి పెంచింది. ఇక వాణిజ్య వాహన విభాగపు వృద్ధి అంచనాలను 4–6 % నుంచి 13%కి, టూవీలర్ల వృద్ధి అంచనాలను 9–11% నుంచి 12%కి సవరించింది.

ఎగుమతులు స్థిరం

దేశీ ప్యాసింజర్ వాహన ఎగుమతులు 2017లో స్థిరంగానే నమోదయ్యాయని సియామ్ తెలిపింది. ఇవి 7,38,894 యూనిట్లుగా ఉన్నాయని పేర్కొంది. 2016లో పీవీ ఎగుమతులు 7,38,137 యూనిట్లుగా నమోదయ్యాయని తెలిపింది. జీఎస్టీ రిఫండ్ అంశం ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపిందని పేర్కొంది. 'డిసెంబర్‌లో ఐదారు గురు టాప్ ఎగుమతిదారులతో సమావేశం నిర్వహించాం. ఇందులో దాదాపు రూ.2,000 కోట్ల రిఫండ్ అమౌంట్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది' అని సియామ్ వెల్లడించింది.

శ్రీ సిమెంట్స్ లాభం 42% అప్

ఒక్కో షేర్‌కు రూ.20 డివిడెండ్

న్యూఢిల్లీ: శ్రీ సిమెంట్స్ కంపెనీ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 42 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.235 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.333 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తెలియజేసింది. ఆదాయం అధికంగా రావడంతో నికర లాభం ఈ స్థాయిలో వృద్ధి చెందిందని వెల్లడించింది. మొత్తం ఆదాయం రూ.2,227 కోట్ల నుంచి 7 శాతం వృద్ధి చెంది రూ.2,384 కోట్లకు పెరిగిందంటూ... సిమెంట్ విభాగం ఆదాయం రూ.2,085 కోట్ల నుంచి రూ.2,194 కోట్లకు, విద్యుత్తు విభాగం ఆదాయం రూ.246 కోట్ల నుంచి రూ.350 కోట్లకు పెరిగిందని వివరించింది. నిర్వహణ లాభం రూ.490 కోట్ల నుంచి 16 శాతం వృద్ధితో రూ.570 కోట్లకు, నిర్వహణ మార్జిన్ 26.3 శాతం నుంచి 24.8 శాతానికి పెరిగాయి. ఒక్కో షేర్‌కు రూ.20 డివిడెండ్‌ను ఇవ్వనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో శ్రీ సిమెంట్ షేర్ స్వల్పంగా లాభపడి రూ.19,512 వద్ద ముగిసింది.

కయాక్ నుంచి ట్రావెల్ గైడ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్రావెల్ సెర్చ్ ఇంజిన్ కయాక్.. పర్యాటకుల కోసం ట్రావెల్ హ్యాకర్ గైడ్‌ను విడుదల చేసింది. దేశంలోని ప్రముఖ, తక్కువ ధరల్లో పర్యటించే పర్యాటక ప్రాంతాలు, స్థానిక విశేషాలు, ఏ సమయంలో ట్రావెల్ చేయాలి? ఎప్పుడు విమాన టికెట్లను బుకింగ్ చేసుకోవాలి? స్థానిక హోటళ్లు, టూరిస్టుల వివరాలు, టిప్స్ అందిస్తుంది.

డాలర్ ఇండస్ట్రీస్ వింటర్ కలెక్షన్

కోల్‌కతా: డాలర్ ఇండస్ట్రీస్ తాజాగా వింటర్ కలెక్షన్‌ను ఆవిష్కరించింది. ఇందులో డాలర్ అల్ట్రా మ్యాజిక్, డాలర్ అల్ట్రా థర్మల్స్, డాలర్ ఎస్టీమ్, డాలర్ వింటర్ కేర్ అనే నాలుగు ఉత్పత్తుల శ్రేణి ఉన్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. వీటి ధర రూ.120 నుంచి ప్రారంభమౌతుంది.

బజాజ్ కార్ప్‌కు వ్యయాల సెగ

న్యూఢిల్లీ: బజాజ్ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో స్టాండ్ అలోన్ ప్రాతిపదికన రూ.55 కోట్ల నికర లాభాన్ని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం రూ.58 కోట్లతో పోలిస్తే లాభం 5% క్షీణించింది. గత క్యూ3లో రూ.201 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 6% పెరిగి రూ.213 కోట్లకు చేరింది. రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు రూ.12 (1200 శాతం) డివిడెండ్‌ను ఇవ్వనున్నామని, ఈ నెల 31 నుంచి డివిడెండ్ చెల్లింపులు ప్రారంభిస్తామని తెలిపింది.

34,500 పాయింట్ల పైకి సెన్సెక్స్

- క్లోజింగ్‌లో రికార్డ్ సృష్టించిన సూచీలు
- ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైకి నిఫ్టీ



ముంబై: కంపెనీల క్యూ3 ఫలితాలు బాగా ఉంటాయన్న అంచనాలతో గురువారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. ఐటీ, రియల్టీ షేర్లు లాభపడడంతో స్టాక్ సూచీలు ముగింపులో జీవిత కాల గరిష్ట స్థాయిల వద్ద ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ తొలిసారిగా 34,500 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,650 పాయింట్లపైకి ఎగబాకాయి. ఈ ఏడాది వేగంగా వృద్ధి చెందనున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే అవకాశాలు అధికంగా ఉన్నాయన్న ప్రపంచ బ్యాంక్ నివేదిక సానుకూల ప్రభావం చూపించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 70 పాయింట్ల లాభంతో 34,503 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 19 పాయింట్ల లాభంతో 10,651 పాయింట్ల వద్ద ముగిశాయి.ఇంట్రాడేలో సెన్సెక్స్ 34,559 పాయింట్లు, నిఫ్టీ 10,665 పాయింట్ల గరిష్ట స్థాయిలను తాకాయి.ఇది నిఫ్టీకి ఆల్‌టైమ్‌హై.

నేడు(శుక్రవారం) క్యూ3 ఫలితాలు వెల్లడి కానుండడటంతో ఇన్ఫోసిస్ షేర్ 2.2 శాతం లాభంతో రూ.1,076 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా పెరిగిన షేర్ ఇదే. ఇంట్రాడేలో ఈ షేర్ ఏడాది గరిష్ట స్థాయి, 1,083ని తాకింది. ఈ షేర్‌తో పాటు టెక్ మహీంద్రా కూడా 52 వారాల గరిష్ట స్థాయిని తాకింది. భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఏషియన్ పెయింట్స్, యస్ బ్యాంక్, సన్ ఫార్మా, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, ఐటీసీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఓఎన్‌జీసీ షేర్లు లాభపడ్డాయి.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్ఈ	5,254
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	35,306
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	10,20,260
ఎఫ్ఐఐ	- 624
డీఐఐ	770

మొబైల్ కొంటే.. ఎయిర్ అంబులెన్స్ సేవలు

కస్టమర్లకు సంగీతా మొబైల్స్ ఆఫర్

బనశంకరి (బెంగళూరు): సంగీతా మొబైల్స్ స్టోర్లలో ఫోన్ కొన్నవారికి సంస్థ వినూత్న ఆఫర్‌ను ప్రకటించింది. కస్టమర్లు ఏడాదిలోగా గుండెపోటు, లేక తీవ్ర అనారోగ్య సమస్యలకు గురైతే వారిని తక్షణం ఆస్పత్రులకు తరలించడానికి ఉచితంగా అవసరాన్ని బట్టి అంబులెన్స్ లేదా ఎయిర్ అంబులెన్స్ సేవలందిస్తామని స్పష్టంచేసింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని కస్టమర్లకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఇందుకోసం బెంగళూరు ఎయిర్ అంబులెన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నట్లు సంగీతా వ్యవస్థాపక డైరెక్టర్ ఎల్.సుభాష్‌చంద్ర గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. తమ స్టోర్లలో ఆన్‌లైన్ ధరలతో సమానంగా స్మార్ట్ ఫోన్లను విక్రయిస్తున్నట్లు చెప్పారు. జనవరి 26న గుజరాత్‌లో 6, యూపీలోని వారణాసిలో 10 స్టోర్లను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.



ఎయిర్ అంబులెన్స్ సేవలను గురించి వివరిస్తున్న ఎల్.సుభాష్‌చంద్ర

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	29,745	▼	65
బంగారం (99.5, 10గ్రా)	29,595	▼	65
వెండి (కిలో)	38,595	▼	290
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	- -		
బంగారం (22 క్యారెట్లు)	28,330	▲	70
వెండి (కిలో)	- -		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,300	▲	210
బంగారం (22 క్యారెట్లు)	28,330	▲	190
వెండి(కిలో)	39,110	▲	185
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	30,450	▲	100
బంగారం (22 క్యారెట్లు)	28,240	▲	110
వెండి(కిలో)	39,900	▲	300
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	30,900		
బంగారం (22 క్యారెట్లు)	28,330		
వెండి(కిలో)	38,500		
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	30,700	▼	50
బంగారం (22 క్యారెట్లు)	28,250	▼	250
వెండి(కిలో)	39,900	▼	100
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	30,640	▲	80
బంగారం (22 క్యారెట్లు)	28,330	▲	190
వెండి(కిలో)	39,800		0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	బుధవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	64.58	$63.57
బ్రెంట్	69.77	$69.20

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 12-1-2018

విశాఖ	404-00
చిత్తూరు	398-00
వరంగల్	404-00
ముంబై	447-00
చెన్నై	405-00
విజయవాడ	404-00
గోదావరి	404-00
నమక్కల్	395-00
11-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	405-00
ఢిల్లీ	425-00
కోల్‌కతా	445-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	425.5	423.45
AMBUJA C	271.75	276.1
ASIAN PA	1188.95	1177.4
AXIS BAN	558.75	562.8
BAJAJ AU	3193.4	3207.4
BAJAJ FI	1780.35	1802.2
BHARTI A	514.75	506.4
[illegible]		

A B C D

20 MICRO	61.1	60.95
3M INDIA	18091.3	18468.55
5PAISA C	373.9	356.1
63 MOONS	116.95	115.75
8K MILES	864.85	846.25
AARTI DR	762.85	763.95
AARTI IN	1128	1121
AARVEE D	52.15	51.5
ABAN OFF	268.1	251.45
ABBOTT I	5397.4	5263.35
BANSWARA	141.4	142.3
BASF IND	2244.7	2258.1
BATA IND	749.7	753.95
BAYER CR	4729.55	4703.3
BEARDSEL	69	68.9
BEML LIM	1556.85	1554.1
BERGER P	267.65	262.1
BETA DRU	196.45	200.7
BF INVES	397.7	396.35
BF UTILI	582.35	574.25
BGR ENER	148.75	139.5
BHAGERIA	310.55	304.4
BHAGYANA	49.1	49.9
DIC INDI	597.95	599.3
DILIP BU	991.35	994.75
DISH TV	83.75	84.7
DISHMAN	329.9	336.85
DIXON TE	3900.75	4026.8
DOLLAR I	493.45	496.95
DOLPHIN	147.95	148.2
DR. LAL	879.55	883.05
DUCON IN	52.35	47.6
DWARIKES	51.9	51.95
DYNACONS	56.7	53.45
DYNAMATI	2131.85	2173.1
[illegible]		

E F G H

GUJ IND	134.7	135.8
GUJ NAR	484.05	472.55
GUJ STAT	158.6	150.2
GUJ. APO	242.85	229.45
GUJARAT	145.95	143.05
GUJARAT	169.1	169.5
GUJARAT	220.25	218.1
GUJARAT	274.2	235.7
GUJARAT	873.95	860.75
GUJARAT	853.7	868.2
GUJARAT	897.8	894.85
GULF OIL	973.2	980.35
GULSHAN	95.15	90.9
[illegible]		

I J K L

JET KNIT	130.5	139
JHS SVEN	71.7	72
JIND POL	79.7	78.35
JINDAL D	220.9	225.1
JINDAL P	428.4	417.6
JINDAL S	125.15	123.5
JINDAL S	168.8	161.35
JINDAL S	231.5	241.85
JINDAL S	267.35	262.4
JINDAL W	585.15	576.3
JK CEMEN	1136.05	1144.9
JK LAKSH	449.4	446.5
JK PAPER	161.65	163.75
JK TYRE	169.6	168.75
[illegible]		

M N O P

MANPASAN	483.2	482.8
MANUGRAP	60.05	58.85
MARAL OV	51	51.35
MARATHON	635.05	641.5
MAS FINA	626.15	627.2
MASTEK L	424.1	420.85
MATRIMON	936.45	914.65
MAWANA S	79.45	80.2
MAX FINA	574.95	574.45
MAX INDI	121.4	122.5
MAX VENT	92.2	92.8
MAYUR UN	535.35	533.1
MAZDA LI	479.25	475.2
MCDOWELL	50.65	49.3
PETRON E	141.3	142.45
PFIZER L	2013.5	2047.3
PG ELECT	422.85	422.1
PHILIPS	1458.75	1424.6
PI INDUS	995.1	1016.2
PIONEER	222.95	217.8
PLASTIBL	259	264.85
PNB GILT	46.9	47.15
PNB HOUS	1325.15	1328.35
PNC INFR	198	198.1
PODDAR H	1318.65	1338.3
PODDAR P	336.3	336.65
POKARNA	263.6	261.3
POLY MED	286.1	290
[illegible]		

R S T U

SESHASAY	979.2	976.1
SETCO AU	71.55	64.55
SHAKTI P	506.5	500.75
SHALBY L	245.35	251.35
SHALIM P	207.5	197.75
SHANKARA	1708.7	1712.65
SHANTHI	172.2	167.35
SHARDA C	463.95	463.45
SHARDA M	2523.6	2529.7
SHEELA F	1680.7	1693.8
SHEMAROO	457.1	429.9
SHILPA M	622.4	600.6
SHIPPING	96.4	97.55
THE GE S	454.75	465.85
THE GROB	2161.85	2058.95
THE HI-T	572.5	567.05
THE INDI	143.55	143.15
THE INDI	192.05	193
THE MAND	178.55	175.85
THE NEW	631.3	627.15
THE P K	440	366.7
THE PHOE	606.65	589.5
THE RAMC	797.45	809.5
THE RUBY	410.15	415.7
THE TINP	297	311.55
THEMIS M	665.65	618.35
[illegible]		

V W X Z

[illegible]

బీఎస్ఈలో ఎఫ్, టీ గ్రూప్ షేర్లు

[illegible]

మహిళారైతు ఆత్మహత్య

ములుగు రూరల్: జయశంకర్ జిల్లా ములుగు మండలం దేవగిరిపట్నంకు చెందిన బి.కల్యాణి(50) అప్పులబాధతో గురువారం ఆత్మహత్య చేసుకుంది.

ఓటరు నమోదు పెంపునకు క్లబ్‌లు

భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ

- పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో క్లబ్‌లు ఏర్పాటు
- భవిష్యత్ ఓటర్ల కోసం 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు..
- కొత్త ఓటర్ల నమోదుకు డిగ్రీ నుంచి ఉన్నత విద్య వరకు..
- నిరక్షరాస్యుల్లో అవగాహన కలిగించేందుకు 'చునావో పాఠశాల'



నల్లగొండ: దేశవ్యాప్తంగా ఓటరు నమోదు ప్రక్రియను పెంచేందుకు భారత ఎన్నికల కమిషన్ యువతను లక్ష్యంగా చేసుకుంది. రానున్న రోజుల్లో యువ ఓటర్లు కీలకంగా మారనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం కొత్తగా క్లబ్‌ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. దీనికి సంబంధించి జిల్లాలోని ఎన్నికల విభాగాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యాసంస్థల్లో యువతీ, యువకులను టీములుగా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా క్లబ్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొంది. నిరక్షరాస్యులైన వారి కోసం 'చునావో పాఠశాల'పేరుతో పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రభుత్వ శాఖలు, ఉద్యోగ సంఘాలు కూడా 'ఓటర్ అవేర్‌నెస్ ఫోరం'లు నెలకొల్పాలి. ఈ క్లబ్‌ల ద్వారా ఓటరు నమోదు పెంచడంతోపాటు, ఓటు ప్రాధాన్యతపై యువకుల్లో అవగాహన కలిగించాలి. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నది ఎన్నికల సంఘం అంతిమ లక్ష్యం.

భవిష్యత్ ఓటర్ల కోసం: విద్యార్థులను భవిష్యత్ ఓటర్లుగా మార్చేందుకు పాఠశాలలు, కళాశాలల్లో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. పాఠశాలల్లో 9,10 తరగతి విద్యార్థులు, కాలేజీల్లో ఇంటర్ విద్యార్థులతో కలిపి క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. వీటికి టీచరు, అధ్యాపకుడు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఓటరు విధానం, నమోదు ప్రక్రియ, ఎన్నికలు జరిగే విధానంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తారు.

ఉద్యోగుల క్లబ్‌లు

ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వేతర సంఘాలు క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. వీటిని ఓటరు అవేర్‌నెస్ ఫోరం(వీఏఎఫ్) అని పిలుస్తారు. ప్రభుత్వశాఖలవారీగా ఫోరంలు ఏర్పాటు చేసుకోవాలి. సంబంధిత శాఖ అధికారి ఫోరానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

25 నాటికి పూర్తి చేయాలి

మొదటి విడత జిల్లాలో 30 శాతం విద్యాసంస్థల్లో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. ఈ నెల 25 నాటికి మొత్తం క్లబ్‌ల నియామకం పూర్తి చేయాలి. ఆ తర్వాత నుంచి ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విద్యాసంస్థల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జిల్లా కమిటీ

క్లబ్‌ల పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో కమిటీ పనిచేస్తుంది. ఈ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా డీఆర్వో, సభ్యులుగా ఆర్డీఓలు, జెడ్పీ సీఈఓ, డీఈఓ, ఆర్‌ఐఓ, వయోజన విద్యాధికారి, డీడబ్ల్యూఓ, డీఎంహెచ్‌ఓ, డీఏఓ ఎన్‌ఐసీ, స్పోర్ట్స్ అధికారి, ఎన్‌జీ కాలేజీ ప్రిన్సిపల్, బాలికల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఉంటారు.

కొత్త ఓటర్ల నమోదుకు..

డిగ్రీ, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను కొత్త ఓటర్లుగా నమోదు చేసేందుకు డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, మెడిసిన్ కాలేజీల్లో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించేందుకు ఈ క్లబ్‌లు దోహద పడతాయి. ఎంపిక చేసిన విద్యార్థులతో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. అధ్యాపకులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు.

చునావో పాఠశాల

పట్టణాల్లో, గ్రామాల్లో పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో నిరక్షరాస్యులైన వారు, చదువు మధ్యలో ఆపేసిన వారిని గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలి. వీటిని చునావో పాఠశాలగా పిలు స్తారు. వీటికి పీఎస్ పరిధిలోని బూత్ స్థాయి అధికారి నోడల్ అధికారిగా పనిచేయాలి.

ప్రజల్లోకి వస్తే అభివృద్ధి కనిపిస్తది

భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ● మరో 20 ఏళ్లు అధికారం టీఆర్‌ఎస్‌దే

భూపాలపల్లి: 'కాంగ్రెసోళ్లు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కూర్చొని పూటకో ప్రెస్‌మీట్‌కే పరిమితమవుతున్నారు.. అక్కడ కూర్చుంటే ఏమీ కనిపించదు. ప్రజల్లోకి వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలాంటి పనులను చూస్తే అభివృద్ధి అంటే ఏమిటో కనిపిస్తది'అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండల కేంద్రంలో రూ.54 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో హరీశ్ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కోతలు కనిపించాయని, తాము నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు ఒక్కొక్కరు ఒక్కోమాట మాట్లాడుతున్నారన్నారు. తమ ప్రజాప్రతినిధులు పొలం గట్లు, కాల్వలు, చెరువుల వెంట ఉంటున్నారని, కాంగ్రెస్ నాయకులు ఏనాడైనా ప్రజల్లో తిరిగి సమస్యలు తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. మరో 20 ఏళ్ల వరకు రాష్ట్రంలో టీఆర్‌ఎస్ పార్టీయే అధికారంలో ఉంటుందన్నారు. బీజేపీ మంత్రి ఒకరు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని చూసి పొగిడారని, బెంగాల్, కేరళ, ఒడిషా మంత్రులు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను చూసి నేర్చుకున్నారని అన్నారు. సీడబ్ల్యూసీ సభ్యులు కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రశంసించారని, 'పనుల పరిశీలన కాదు.. తాము నేర్చుకొని వెళ్తున్నాం' అని కొనియాడారన్నారు. తెలంగాణ ఇంజనీర్లు చాలా కష్టపడుతున్నారని ప్రశంసించారని తెలిపారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మాట్లాడుతూ.. సాగుకు రెండు, మూడు గంటల విద్యుత్ ఇచ్చిన కాంగ్రెస్ సన్నాసులకు ఇప్పుడు మాట్లాడేందుకు సిగ్గుండాలన్నారు.



గురువారం రేగొండ బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నాగార్జున సాగర్ ఎడమకాల్వకు బుంగ



మునగాల: నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాల్వకు గురువారం బుంగపడింది. సూర్యాపేట జిల్లా మునగాల సమీపంలో 115 కిలోమీటరు వద్ద పడిన బుంగతో 30 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ఉదయం 11గంటల సమయంలో ఈ బుంగను గుర్తించిన ఎన్‌ఎస్పీ సిబ్బంది అప్రమత్తమై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. వేసవిలో మిషన్ భగీరథ పథకం కోసం ప్రభుత్వం ఎడమకాల్వ అడుగు భాగాన వేసిన పైపులు లీకేజీ కావడంతో బుంగ పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం బుంగ ద్వారా 30 క్యూసెక్కుల నీరు బయటకుపోతోంది. ఈ వరదతో మునగాల మండలం బరాఖత్‌గూడెంకు చెందిన 30 ఎకరాల వరిపంట పూర్తిగా నీట మునిగింది. కాగా ఎడమకాల్వకు నీటిని నిలుపుదల చేసి.. పూడ్చివేత చర్యలు చేపడుతున్నారు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట కలెక్టర్ సురేంద్ర మోహన్ పరిశీలించారు.

హెచ్‌ఎండీఏ ప్లాట్ల వేలానికి వేళాయె!

- సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్
- ప్లాట్ల అమ్మకాలు ఈ-వేలంలోనే

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) ప్లాట్ల వేలానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. అభివృద్ధి చేసిన లేఔట్లలో 120 ప్లాట్లను ఈ-వేలం వేయనున్నారు. సంక్రాంతి తర్వాత ఈ-వేలం ద్వారా ప్లాట్లు వేలం వేయాలని కమిషనర్ టి.చిరంజీవులు నిర్ణయించారు. వీటి ద్వారా దాదాపు రూ.200 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఆయా లేఔట్లలో ఉన్న 160 స్థలాలను మార్కింగ్ చేసిన అధికారులు వాటిని జీపీఎస్ పద్ధతిన జియో ట్యాగింగ్ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జీపీఎస్ లొకేటర్ ద్వారా ప్లాట్ల ఆకృతులను తెలుసుకోవాలని భావిస్తున్నారు. సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఈ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయనున్నారు. రియల్ బూమ్ ఉన్నప్పుడు 24 లేఅవుట్లను హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసింది. వీటిలో ఆరు లేఔట్లలో అన్ని ప్లాట్లు అమ్ముడవగా, మిగిలిన 18 లే ఔట్లలో స్ట్రే బీట్‌లు, కర్వ్, ఓపెన్, గిఫ్ట్ ల్యాండ్ ప్లాట్లు ఉన్నాయి. వీటి విక్రయానికి ప్రభుత్వ అనుమతి వచ్చింది. మియాపూర్, చందానగర్, వనస్థలిపురం, సరూర్ నగర్, మాదాపూర్, తెల్లపూర్, నల్లగండ్ల తదితర ప్రాంతాల్లోని ఈ లేఔట్లలో ఉన్న ప్లాట్లను గుర్తించి వేలం వేసేందుకు అధికారుల కమిటీ కార్యాచరణను సిద్ధం చేసింది. ప్రభుత్వ బేసిక్ విలువ కంటే 1.5 రెట్లు ఎక్కువగా కనీస ధరను పెట్టాలని ప్రతిపాదించారు. కొనుగోలుదారుడు డబ్బులు చెల్లించిన 30 రోజుల్లోపు హెచ్‌ఎండీఏ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను కొనుగోలుదారుడు భరించాల్సి ఉంటుందని మెంబర్ ఎస్టేట్ అధికారులు తెలిపారు. ఎప్పుడైనా ఈ వేలం ప్రక్రియను రద్దుచేసే అధికారం హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు ఉంటుంది.

ఉప్పల్ భగాయత్‌తో కనకవర్షమే

18 లే ఔట్లలో ప్లాట్లు వేలం వేసిన తర్వాత ఉప్పల్ భగాయత్ ప్లాట్ల విక్రయాలపై హెచ్‌ఎండీఏ అధికారులు దృష్టి సారించనున్నారు. 2005లో ప్రభుత్వం చేపట్టిన మూసీ రివర్ కన్జర్వేషన్ అండ్ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఉప్పల్ భగాయత్ రైతుల నుంచి 733 ఎకరాలను సేకరించింది. ఇందులో మెట్రో రైలు డిపో, జలమండలి మురుగు శుద్ధి నీటి కేంద్రం, మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు కొంత కేటాయించింది. మిగిలిన 413.32 ఎకరాల్లో 20,00,468 చదరపు గజాల్లో ఉప్పల్ భగాయత్ పేరు మీద లేఔట్‌ను అభివృద్ధి చేసింది. రాష్ట్ర విభజన, కోర్టు కేసులు, యూఎల్‌సీ వల్ల భూములు కోల్పోయిన రైతుల్లో 1,520 మందికి గత ఏడాది మార్చిలో లాటరీ రూపంలో ప్లాట్లు కేటాయించారు. మిగిలిన 1,25,963 చదరపు అడుగుల్లో ఉన్న ప్లాట్లను ఇప్పుడు విక్రయించాలని హెచ్‌ఎండీఏ నిర్ణయించింది. గజానికి ధరను రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకు నిర్ణయించారు. దాదాపు 350 నుంచి రూ.500 కోట్ల వరకు హెచ్‌ఎండీఏకు ఆదాయం రానుంది.

మంత్రాల నెపంతో ఆరుగురిపై దాడి

మంగపేట (ములుగు): మంత్రాల నెపంతో ఆరుగురిని చితకబాదిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురువారం జరిగింది. మంగపేట మండలం బాలన్నగూడెంలో ఉపాధ్యాయుడు యాలం పోతురాజు కుమార్తె వినీత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో వారు ఓ భూతవైద్యుడిని ఆశ్రయించారు. వినీత పూనకం వచ్చినట్లు ఊగుతూ నలుగురి పేర్లు చెప్పడంతో తెలగాని గణేశ్, కోరం పాపారావు, యాలం నాగమ్మ, తాటి భిక్షంను గ్రామంలో పంచాయితీకి పిలిచారు. మంత్రాలు రావని వారు చెప్పగా.. వేడి చేసిన నూనెలోంచి ఉంగరాన్ని చేతితో తీసి నిజాయితీ నిరూపించుకోవాలని నిబంధన పెట్టారు. తాము సిద్ధమేనని, మంత్రాలు చేయని మీరు కూడా తీస్తారా అని ఎదురు ప్రశ్నించినందుకు వారిని కర్రలతో చితకబాదారు. అడ్డొచ్చిన గణేశ్ భార్య సౌమ్య, పాపారావు భార్య వెంకటలక్ష్మిపై కూడా దాడి చేశారు. బాధితుడు పాపారావు ఫిర్యాదుతో పోతురాజుతో పాటు దాడిచేసిన మరో 13 మందిపై కేసు నమోదు చేశారు.

ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసు వాయిదా

ఆదిలాబాద్: మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు ఆజాద్ అలియాస్ చెరుకూరి రాజ్‌కుమార్ ఎన్‌కౌంటర్ కేసు ఈ నెల 24వ తేదీకి వాయిదా పడింది. గురువారం కేసుకు సంబంధించి ఆజాద్ భార్య పద్మ, న్యాయవాది సురేశ్ ఎస్సీ, ఎస్టీ కోర్టుకు హాజరయ్యారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 24కు వాయిదా వేశారని సురేశ్ తెలిపారు.

రూ.10కోట్ల డ్రగ్స్ పట్టివేత?

మునిపల్లి (అందోల్): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద గురువారం రూ.10 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడినట్లు తెలిసింది. కర్ణాటక నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారులో ముగ్గురు వ్యక్తులు డ్రగ్స్ తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మాదక ద్రవ్యాల నివారణ అధికారులు 65వ జాతీయ రహదారిపై కంకోల్ టోల్‌ప్లాజా వద్ద కాపు కాసారు. వాహనం టోల్‌ప్లాజా వద్దకు రాగానే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారి నుంచి 53 డ్రగ్స్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

బీజేపీకి నాగం గుడ్‌బై

నాగర్‌కర్నూల్ నుంచే పోటీ చేస్తా.. ఇవే చివరి ఎన్నికలు



సాక్షి, నాగర్‌కర్నూల్: తాను బీజేపీని వీడుతున్నట్లు మాజీ మంత్రి, ఆ పార్టీ నేత నాగం జనార్దన్ రెడ్డి ప్రకటించారు. అనుచరులు, అభిమానుల సూచన మేరకు తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీలో అనేక సందర్భాల్లో అవమానాలకు గురి కావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాంటి అనుభవజ్ఞుడిని ఆ పార్టీ వినియోగించుకోలేక పోయిందన్న బాధ ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వంపై తాను రాజీలేని పోరాటం చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు మరోసారి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇందుకుగాను కేసీఆర్ వ్యతిరేక శక్తులతో చేతులు కలపాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ పార్టీలో చేరేది అభిమానులు, నియోజకవర్గాల ప్రజలతో చర్చించి త్వరలో ప్రకటిస్తానని చెప్పారు. 2019 ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ స్థానం నుంచే పోటీ చేస్తానని, ఇవే తనకు చివరి ఎన్నికలని నాగం పేర్కొన్నారు.

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం 12-1-2018

'యువ' సేన సిద్ధం

రేపటి నుంచి అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్

బరిలో 16 జట్లు ● ఆదివారం ఆస్ట్రేలియాతో భారత్ తొలి మ్యాచ్ ● ఫిబ్రవరి 3న ఫైనల్



దాదాపు ఇరవై ఏళ్ల క్రితం రెండో అండర్-19 క్రికెట్ ప్రపంచకప్... ప్రత్యక్ష ప్రసారం మాట దేవుడెరుగు... భారత ఆటగాళ్లు కైఫ్, సెహ్వాగ్, హర్భజన్ ప్రతీ మ్యాచ్ ముగిసిన తర్వాత సాయంత్రం తమ డార్మిటరీకి దగ్గరిలోని టెలిఫోన్ బూత్‌నుంచి తల్లిదండ్రులకు ఫోన్ చేసి స్కోర్లు చెప్పేవారు. దక్షిణాఫ్రికాలోని యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో టోర్నీ జరిగితే, ఆటగాళ్లకు అక్కడి క్యాంపస్‌లోనే వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. మరో రెండేళ్లకు భారత్ టైటిల్ సాధించినా... పరిస్థితి పెద్దగా మారలేదు. మన జట్టు విజయాన్ని కూడా ఎవరూ పట్టించుకోలేదు. అంతకు పదేళ్ల క్రితం జరిగిన తొలి టోర్నీలోనైతే ఆస్ట్రేలియాలో మ్యాచ్‌కు కొన్ని నిమిషాల ముందు భారత జట్టు అక్కడే కిట్ కొనుక్కొని బరిలోకి దిగాల్సి వచ్చింది.

ఇప్పుడు... భారత యువ ఆటగాళ్ళకు సీనియర్ పురుషుల జట్టుతో సమానంగా సౌకర్యాలు, బిజినెస్ క్లాస్ ప్రయాణం, భారీ మొత్తంలో దినవారీ భత్యం...ప్రాక్టీస్ సెషన్లు, వార్మప్ మ్యాచ్‌లే కాదు, ఈ టోర్నీకి సంబంధించి అన్ని జట్ల ఆటగాళ్ల ప్రత్యేక ప్రమోషనల్ షూట్‌లు, జ్ఞాపికలపై సంతకాలు చేయడం...ఇదంతా ఐసీసీ మార్కెటింగ్ ప్రచారం. పాల్గొంటున్న పదహారు జట్ల ఆటగాళ్ల హాజరీతో భారీగా ఆరంభోత్సవ కార్యక్రమం. ఇక మ్యాచ్‌లు 200లకు పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం. టి20 లీగ్‌లు వచ్చాక ప్రపంచమంతా కూడా యువ ఆటగాళ్లపై, వారి ప్రదర్శనపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. ఈ నేపథ్యంలో రెండేళ్లకు ఒకసారి ఆసక్తి రేపుతున్న అండర్-19 వరల్డ్ కప్ మళ్లీ వచ్చేసింది. న్యూజిలాండ్‌లో జరిగే ఈ సంబరానికి రేపటి నుంచి తెర లేస్తోంది.

మౌంట్ మాంగనీ (న్యూజిలాండ్): అంతర్జాతీయ స్థాయిలో కుర్రాళ్ల సత్తా చాటేందుకు సరైన వేదికలాంటి అండర్-19 వరల్డ్ కప్‌కు రంగం సిద్ధమైంది. రేపటి నుంచి ఫిబ్రవరి 3 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ఇక్కడి బే ఓవల్ మైదానంలో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ వెస్టిండీస్‌తో ఆతిథ్య జట్టు న్యూజిలాండ్ తలపడుతుంది. ఫైనల్ కూడా ఇక్కడే నిర్వహిస్తారు. ప్రస్తుతం జరగబోతోంది 12వ వరల్డ్ కప్ కాగా... గత టోర్నీల్లో



1999

పాల్గొని ఆ తర్వాత సీనియర్ స్థాయికి ఎదిగిన ఆటగాళ్లు వివిధ జట్లలో అనేక మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో తమ ప్రతిభను నిరూపించుకొని ప్రమోట్ అయ్యేందుకు యువ ఆటగాళ్లంతా సిద్ధంగా ఉన్నారు. భారత్, ఆస్ట్రేలియా గతంలో మూడు సార్లు అండర్-19 ప్రపంచ కప్ గెలుచుకోగా...పాకిస్తాన్ రెండు సార్లు, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ ఒక్కోసారి విజేతగా నిలిచాయి.

వీరంతా అక్కడినుంచే...

అండర్-19 ప్రపంచకప్‌లో తమ ఆటతో గుర్తింపు తెచ్చుకొని ఆ తర్వాత సీనియర్ క్రికెట్‌లో కూడా తమదైన ముద్ర చూపించిన ఆటగాళ్లు అన్ని జట్లలోనూ ఉన్నారు. ఇందులో అగ్రస్థానం మాత్రం మన కెప్టెన్ విరాట్ కోహ్లికే దక్కుతుంది. 2008లో తన నాయకత్వంలోనే భారత్‌ను విజేతగా నిలిపిన కోహ్లికి ఆ తర్వాత ఎదురు లేకుండా పోయింది. అదే ఏడాది సీనియర్ జట్టులో తనకు లభించిన అవకాశాన్ని అందిపుచ్చుకున్న అతను... ఇప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌గా, నాయకుడిగా ఎదిగాడు. ఈ జాబితాలో యువరాజ్ సింగ్, రవీంద్ర జడేజా, మనీశ్ పాండే, విలియమ్సన్, ఆమ్లా, డి కాక్, రబడ, అంబటి రాయుడు, వేణుగోపాలరావు తదితరులున్నారు.



2008

జట్ల వివరాలు

- గ్రూప్ 'ఎ': న్యూజిలాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, కెన్యా
- గ్రూప్ 'బి': భారత్, ఆస్ట్రేలియా, జింబాబ్వే, పపువా న్యూగినియా
- గ్రూప్ 'సి': ఇంగ్లండ్, బంగ్లాదేశ్, నమీబియా, కెనడా
- గ్రూప్ 'డి': పాకిస్తాన్, శ్రీలంక, ఐర్లాండ్, అఫ్ఘానిస్తాన్

భారత్ లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్

జనవరి 14న ఆస్ట్రేలియాతో (ఉ.గం. 5.30నుంచి)
జనవరి 16న పపువా న్యూ గినియాతో (ఉ.గం. 6.30)
జనవరి 19న జింబాబ్వేతో (ఉ.గం. 6.30నుంచి)



2012

మన సైన్యమిదే...

దేశవాళీ క్రికెట్‌లో ఇప్పటికే సంచలన క్రికెటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న పృథ్వీ షా నేతృత్వంలో భారత జట్టు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. కోచ్‌గా భారత దిగ్గజం రాహుల్ ద్రవిడ్ మార్గనిర్దేశనంలో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని కుర్రాళ్లు పట్టుదలగా ఉన్నారు. ఇటీవల ఇదే జట్టు ఆసియా కప్‌లాంటి టోర్నీలలో వరుస విజయాలు సాధించి ఊపు మీదుంది.

జట్టు వివరాలు: పృథ్వీ షా (కెప్టెన్), శుభ్‌మాన్ గిల్, ఆర్యన్ జూయల్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్, హార్విక్ దేశాయ్, మన్‌జోత్ కల్రా, కమలేశ్ నాగర్‌కోటి, పంకజ్ యాదవ్, రియాన్ పరాగ్, ఇషాన్ పొరెల్, హిమాన్షు రాణా, అనుకూల్ రాయ్, శివమ్ మావి, శివసింగ్




1988లో యూత్ వరల్డ్ కప్ పేరుతో తొలి టోర్నీ జరిగింది. ఆ తర్వాత అండర్-19 ప్రపంచకప్‌ను మళ్లీ నిర్వహించేందుకు పదేళ్లు పట్టింది. 1998నుంచి దీనిని ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్‌గా వ్యవహరిస్తున్నారు.



గురువారం భారత క్రికెట్ జట్టు జొహన్నెస్‌బర్గ్‌లోని 'ఇండియా హౌస్'లో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరైంది. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా బోర్డు మాజీ అధ్యక్షుడు అలీ బాకర్‌తో కోహ్లి, రవిశాస్త్రి

హైదరాబాద్ సెమీస్ ప్రత్యర్థి ఢిల్లీ

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్



మారిన్

సాక్షి, హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్-3)లో హైదరాబాద్ హంటర్స్ తమ చివరి మ్యాచ్‌లో బెంగళూరు బ్లాస్టర్స్‌ను తుడిచిపెట్టేసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన పోరులో హంటర్స్ 6-(-1) తో బెంగళూరుపై ఘనవిజయం సాధించింది. తొలి మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో పియా జెబదియా - సాత్విక్ సాయిరాజ్ (హైదరాబాద్) జోడి 15-6, 14-15, 15-9తో సిక్కి రెడ్డి- మను అత్రి (బెంగళూరు)జంటపై గెలిచి హంటర్స్‌కు శుభారంభాన్నిచ్చింది. పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్ 10-15, 15-7, 15-14తో చోంగ్ వీ ఫెంగ్ (బెంగళూరు)పై, మహిళల సింగిల్స్‌లో కరోలినా మారిన్ 15-9, 15-7తో కిర్‌స్టీ గిల్మోర్ (బెంగళూరు)పై గెలుపొందారు. తర్వాత జరిగిన రెండో పురుషుల సింగిల్స్ 'ట్రంప్' మ్యాచ్‌లో లీ హ్యూన్ ఇల్ 15-11, 11-15, 15-11తో శుభాంకర్ డే (బెంగళూరు)పై విజయం సాధించడంతో మరో మ్యాచ్ ఉండగానే హైదరాబాద్ 5-0తో జయభేరి మోగించింది. చివరగా జరిగిన పురుషుల డబుల్స్ బెంగళూరుకు 'ట్రంప్' కాగా... మార్కిస్ కిడో-సియాంగ్ (హైదరాబాద్) జోడి 15-10, 11-15, 15-7తో కిమ్ సరంగ్-మథియాస్ బోయె (బెంగళూరు) జంటపై గెలిచింది.

నేటి రాత్రి 7 గంటలకు జరిగే సెమీస్‌లో ఢిల్లీతో హైదరాబాద్ తలపడుతుంది.

2 పరుగులతో...

హైదరాబాద్‌పై కర్ణాటక విజయం ● సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ



బౌండరీ లైన్ వద్ద హసన్ — అంపైర్లతో వినయ్‌కుమార్, అంబటి రాయుడు, ఓజా వాదన

సాక్షి, విశాఖపట్నం: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. గురువారం ఇక్కడి వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ వీడీసీఏ మైదానంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి... 203 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్లు అక్షత్ రెడ్డి (29 బంతుల్లో 70; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు), తన్మయ్ అగర్వాల్ (23 బంతుల్లో 38; 1 ఫోర్, 4 సిక్స్‌లు) దుమ్మురేపడంతో ఓ దశలో హైదరాబాద్ సునాయాసంగా విజయం సాధిస్తుందనిపించినా.. కర్ణాటక బౌలర్లు చెలరేగి వరుస విరామాల్లో వికెట్లు తీయడంతో లక్ష్యానికి 2 పరుగుల దూరంలో నిలిచిపోయింది. చివర్లో సందీప్ (19 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడినా ఓటమిని తప్పించలేకపోయాడు. కర్ణాటక బౌలర్లలో స్టువర్ట్ బిన్నీకి 3 వికెట్లు దక్కాయి. అంతకుముందు కరుణ్ నాయర్ (77; 10 ఫోర్లు, 1 సిక్స్), గౌతమ్ (57; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగడంతో కర్ణాటక భారీ స్కోరు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో రవికిరణ్‌కు 2, మెహదీ హసన్, సిరాజ్‌లు చెరో వికెట్ పడగొట్టారు.

కేరళతో జరిగిన మరో మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 6 వికెట్లతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేరళ 12 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. వినోద్ (45; 3 ఫోర్లు; 4 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. ఆంధ్ర బౌలర్లలో హరిశంకర్ రెడ్డికి 4, అయ్యప్ప బండారుకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఆంధ్ర 13 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్లు అశ్విన్ హెబ్బర్ (34 బంతుల్లో 64; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), విహారి (25; 4 ఫోర్లు) ఆకట్టుకున్నారు.

మైదానంలో వివాదం!

హైదరాబాద్, కర్ణాటక మధ్య జరిగిన మ్యాచ్‌లో అంపైర్ల పొరపాటుతో జరిగిన ఒక ఘటన వివాదానికి కారణమైంది. కర్ణాటక బ్యాటింగ్ చేస్తున్న సమయంలో రెండో ఓవర్ నాలుగో బంతిని ఆపే ప్రయత్నంలో హైదరాబాద్ ఫీల్డర్ మెహదీ హసన్ బౌండరీని తాకాడు. అయితే దీనిని గుర్తించని ఫీల్డ్ అంపైర్లు రెండు పరుగులు మాత్రమే ఇచ్చారు. ఇన్నింగ్స్ ముగిశాక హైదరాబాద్ 204 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగింది. అయితే ఆట ఆరంభానికి ముందు కర్ణాటక కెప్టెన్ వినయ్ కుమార్ ఈ విషయాన్ని థర్డ్ అంపైర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కర్ణాటక జట్టు స్కోరులో మరో రెండు పరుగులు అదనంగా చేర్చారు. ఈ విషయం హైదరాబాద్ బ్యాట్స్‌మెన్‌కు ఆట మధ్యలో తెలిసింది. దాంతో కెప్టెన్ అంబటి రాయుడు అంపైర్లతో వాదనకు దిగాడు. మరోవైపు వినయ్ కుమార్ కూడా మైదానంలోకి వచ్చి అంపైర్లతో చర్చించాడు. అయితే హైదరాబాద్ వాదనను పట్టించుకోని అంపైర్లు ఆటను కొనసాగించారు. చివరకు హైదరాబాద్ కూడా సరిగ్గా 203 పరుగులే చేయడంతో ఆ పరుగుల ప్రాధాన్యం పెరిగింది. రాయుడు సూపర్ ఓవర్ ఆడించమని కోరగా... అంపైర్లు అంగీకరించకుండా కర్ణాటకను విజేతగా ప్రకటించారు. మ్యాచ్ ముగిశాక కూడా హైదరాబాద్ ఆటగాళ్లు మైదానం వీడకపోవడంతో తర్వాత జరగాల్సిన ఆంధ్ర, కేరళ మ్యాచ్ ఆలస్యమై చివరకు 13 ఓవర్లకు పరిమితం చేయాల్సి వచ్చింది. 'నాకు నిబంధనల గురించి బాగా తెలుసు. అప్పుడే అంపైర్లు ఫోర్‌గా ప్రకటిస్తే సమస్య ఉండకపోయేది. మాకు లక్ష్యం నిర్దేశించాక 2 పరుగులు ఎలా కలుపుతారు. ఒకసారి బ్యాట్స్‌మన్ అవుటై పెవిలియన్ చేరాక అది నాటౌట్‌గా తేలినా, అది నో బాల్ అయినా మళ్లీ వెనక్కి పిలవరు కదా' అని రాయుడు అసంతృప్తి వ్యక్తం చేశాడు. దీనిపై హైదరాబాద్ జట్టు రిఫరీకి ఫిర్యాదు చేసింది.

'**ఈ** వివాదం మా దృష్టికి వచ్చింది. మ్యాచ్ రిఫరీ అధికారిక నివేదిక రావాల్సి ఉంది. ఆ తర్వాత బోర్డు క్రమశిక్షణా నియమావళి ప్రకారం తగిన చర్య తీసుకుంటాం'
– బీసీసీఐ ప్రకటన

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.